అదానీకి అసోంలో ఓ జిల్లానా?

- బిజెపి సర్కారు తీరుపై హైకోర్టు షాక్
- అదానీ గ్రూపునకు 1860 ఎకరాలు ఇవ్వడానికి 14 వేల గిరిజన కుటుంబాలు తరలింపు

7

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 45 సంచిక : 19 | విజయవాడ, మంగళవారం 19 ఆగస్టు 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Tuesday 19 August 2025 | Rs

సూర్యకుమార్, బుమ్రా పక్కా

- గిల్, జైస్వాల్‌కు కష్టమే...
- నేడు ఆసియా కప్‌కు జట్టు ప్రకటించే అవకాశం



8

'చలో కరేడు'పై ఉక్కుపాదం

నిర్బంధాన్ని అధిగమించి భారీ ప్రదర్శన, బహిరంగసభ.. కదం తొక్కిన గ్రామస్తులు

- అడుగడుగునా మోహరించిన పోలీసులు
- వి.శ్రీనివాసరావుతో పాటు పలువురు నేతల అరెస్ట్



పోలీస్ స్టేషన్ వద్ద అరెస్టయిన నేతలు

కార్పొరేట్ల కోసం చేపట్టిన విచ్చలవిడి భూ సేకరణకు వ్యతిరేకంగా పోరాడుతున్న నెల్లూరు జిల్లా కరేడు ప్రజానీకానికి సంఘీభావంగా వివిధ రైతు, ప్రజాసంఘాలు సోమవారం చేపట్టిన 'చలో కరేడు' కార్యక్రమంపై రాష్ట్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. గ్రామానికి కొన్ని కిలోమీటర్ల దూరం నుండే పోలీసులను మొహరించింది. ప్రతి వ్యక్తినీ, వాహనాన్ని తనిఖీ చేసింది. బ్యారికేడ్లతో గ్రామంలోకి వెళ్లే అన్ని రోడ్లను మూసివేసింది. జిల్లా వ్యాప్తంగా ముందుస్తు అరెస్ట్‌లు చేసింది. గ్రామంలోనూ భారీ సంఖ్యలో పోలీసులను నింపింది. ఈ ఆంక్షలను లెక్కచేయకుండా కరేడుకు కదిలిన వారిని బలవంతంగా అరెస్ట్ చేసింది! అయినా, ఈ నిర్బంధాన్ని గ్రామస్తులు ఖాతరు చేయలేదు. తమకు మద్దతుగా కదులుతున్న వారిని ఎక్కడికక్కడ అరెస్ట్‌లు చేస్తున్నా లెక్కచేయలేదు. పోలీసు ఆంక్షలను అధిగమించి గ్రామంలోకి చేరుకున్న రైతు, ప్రజాసంఘాల నేతలతో కలిసి కరేడులో కదం తొక్కారు. భారీ బహిరంగసభ నిర్వహించారు. ప్రాణాలు పోయినా... భూమిలిచ్చేది లేదని ప్రకటించారు!

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

రైతు, ప్రజా సంఘాలు చేపట్టిన 'చలో కరేడు'ను అడ్డుకోవడమే లక్ష్యంగా ఆదివారం సాయంత్రానికే ఆ ప్రాంతాన్ని పోలీసులు తమ అదుపులోకి తీసుకున్నారు. అడుగడుగునా మొహరించారు. దీంతో సోమవారం ఏం జరుగుతుందోనన్న ఉత్కంఠ నెలకొంది. సోమవారం ఉదయం 10.30 గంటలకు కలకత్తా - చెన్నయ్ 16వ జాతీయ రహదారి వెంకటేశ్వస్వామి దేవాలయం ప్రాంగణానికి ఒక్కొక్కరుగా రావడం ప్రారంభమైంది,. కేవలం పది నిమిషాల వ్యవధిలోని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి, కౌలు రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వి. శ్రీనివాసరావు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి. వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఉపాధ్యక్షులు దడాల సుబ్బారావులు రావడంతోపాటు జిల్లా నలుమూలల నుంచి రైతులు, ప్రజా సంఘాల నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో అక్కడకు చేరుకు న్నారు. అక్కడ నుంచి కరేడుకు వెళ్లడానికి ముందుకు కదిలారు. దీంతో పోలీసులు అనుమతులు లేవంటూ అడ్డకోవడానికి ప్రయత్నిం చారు. అయితే, పోరాడు తున్న ప్రజలకు సంఘీ భావం చెబుతూ నాయకులు ముందుకు దూసుకెళ్లారు. వారిని ప్రజలు అనుసరిం చారు. ఈ దశలో రోప్ పార్టీతో అడ్డుకోవ డానికి పోలీసులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. పోలీసులు అడ్డుగా కట్టిన తాడును తోసివేసి మిగతా 7లో

కరేడులో అక్రమ అరెస్టులకు సిపిఎం ఖండన 7



కరేడులో కదులుతున్న ప్రజలు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఇండియా వేదిక నేతలు

ప్రశ్నిస్తే ఎదురుదాడి

బిజెపి ప్రతినిధిగా సిఇసి మాటలు

'ఇండియా' వేదిక నేతల ఆగ్రహం

అభిశంసనకు యోచన

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఎన్నికల కమిషన్ తామడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పడానికి బదులు ఎదురుదాడికి దిగుతోందని 'ఇండియా' వేదిక నాయకులు విమర్శించారు. బిజెపి ప్రతినిధిగా సిఇసి మాటా డుతున్నారని, ఎస్ఐఆర్ జాబితా, అవకతవకలపై తమ ప్రశ్నలకు సమాధానం ఇవ్వడంలో ఇసి విఫలమైందని అన్నారు. సోమవారం నాడిక్కడ కానిస్టిట్యూషన్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్, ఆర్‌జెడి, సిపిఎం, ఎస్‌పి, శివసేన, డిఎంకె, టిఎంసి, ఆప్ తదితర పార్టీల నేతలు మాట్లాడారు.

ఈ ప్రశ్నలకు ఇసి బదులేది?

మహారాష్ట్రలో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల మధ్య భారీ సంఖ్యలో ఓటర్లు పెరగడానికి కారణమేంటి? 45 రోజుల్లో పోలింగ్ బూత్‌ల సిసిటివి ఫుటేజ్‌ను తొలగించాలని ఎందుకు నిర్ణయించారు? మహదేవపురలో లక్ష నకిలీ ఓటర్లు ఎందుకు వచ్చారు? మెషిన్ రీడబుల్ ఎలక్టోరల్ ఓటు గోప్యత ఉల్లంఘన ఎలా అవుతుంది? బీహార్‌లోని 65 లక్షల మంది ఓటర్లను ఎందుకు తొలగించారు? మిషన్ రీడబుల్ ఫార్మాట్‌లో దీనికి కారణాన్ని ఎందుకు ఇవ్వలేకపోయారు? ఓటరు ఐడి కోసం ఆధార్‌ను వారు ఎందుకు వ్యతిరేకించారు? ఎస్ఐఆర్ ప్రక్రియను ఎందుకు ఇంత తొందరగా తీసుకొచ్చారు?. ఎన్నికలకు మూడు నెలల వ్యవధి ఉన్న తరుణంలో ప్రతిపక్ష పార్టీలతో సంప్రదించకుండా హడావిడిగా ఎస్ఐఆర్ ఎందుకు చేపట్టారు?. ఎస్ఐఆర్ ప్రకటనలో ఎందుకు దూకుడుగా వ్యవహరించారు? అనే ప్రశ్నలకు కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ సమాధానం ఇవ్వలేదని అన్నారు. ఈ ప్రశ్నలకు ఆయన సమాధానం చెప్పి తీరాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ నేత గౌరవ్ గొగోయ్ మాట్లాడుతూ రాజకీయ పార్టీలు లేవనెత్తిన కీలక ప్రశ్నలకు సిఇసి జ్ఞానేష్ కుమార్ సమాధానం ఇవ్వ కుండా తన బాధ్యతల నుంచి పారిపోతున్నారని విమ ర్శించారు. ఇటీవల ఎన్నికల కమిషన్ వాదనలను సుప్రీంకోర్టు తిరస్కరించిందని గుర్తు చేశారు. ప్రతిపక్షాల ప్రశ్నలకు సమాధానం ఇవ్వకుండా రాజకీయ పార్టీలను ప్రశ్నించడం, దాడి చేయడమా? అని ప్రశ్నించారు. ఎన్నికల కమిషన్ మిగతా 7లో

ఉపరాష్ట్రపతి అభ్యర్థిపై 'ఇండియా' చర్చలు 7



సమావేశంలో మాట్లాడుతున్న ప్రధాని మోడీ

తదుపరి సంస్కరణలపై దృష్టి

ప్రధాని అధ్యక్షతన అత్యున్నత స్థాయి సమావేశం

న్యూఢిల్లీ : ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన సోమవారం అత్యున్నత స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కేంద్ర మంత్రులు, కార్యదర్శులు, ఆర్థికవేత్తలు పాల్గొన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం రోజున మోడీ చేసిన ప్రసంగంలో కీలకమైన అంశాల్లో ఒకటైన తదుపరి తరం సంస్కరణలకు సంబంధించిన రోడ్‌మ్యాప్‌పై ఈ సమావేశంలో చర్చించారు. కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, అమిత్ షా, నితిన్ గడ్కరీ, నిర్మలా సీతారామన్, శివరాజ్ సింగ్ చౌహాన్, పియూష్ గోయల్, లలన్ సింగ్ ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ నెల 15న ఎర్రకోటపై నుంచి చేసిన ప్రసంగంలో తదుపరి తరం సంస్కరణలు, జిఎస్‌టి చట్టాల సవరణ కోసం ఒక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు గురించి ప్రకటించారు. సెమీకండక్టర్ల నుంచి ఎరువుల వరకూ అనేక రంగాల్లో దేశాన్ని స్వావలంబన చేయడంపై మాట్లాడారు.

పరస్పర గౌరవం, ప్రయోజనాలే లక్ష్యంగా ఇరుదేశాల సంబంధాలు 7

- చైనా విదేశాంగ మంత్రితో జై శంకర్ భేటీ

బీహార్‌లో తొలగించిన ఓటర్ల జాబితా విడుదల

- ఇసి వెబ్‌సైట్‌లో 65 లక్షల మంది వివరాలు

7

'ఉక్కు' ప్రైవేటీకరణ వద్దు

- స్టీల్‌ప్లాంట్ ప్రధాన పరిపాలనా భవనం వద్ద ఉక్కు కార్మిక సంఘాల ధర్నా
- త్వరలో ఉద్యమ కార్యాచరణ

3

విషాదయాత్ర..!

- టెంపోట్రావెలర్, ఆర్‌టిసి బస్సు ఢీ
- నలుగురు మృతి.. 8 మందికి గాయాలు

3

వేలాది ఎకరాలకు ముంపు

- రాకపోకలకు అంతరాయం
- అల్లూరి జిల్లాలో వాగులో వ్యక్తి గల్లంతు
- వాయుగుండంగా మారనున్న అల్పపీడనం
- నేడు తీరం దాటే అవకాశం

ప్రజాశక్తి- యంత్రాంగం

బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం కోస్తా జిల్లాలపై ప్రభావం చూపింది. కొన్నిచోట్ల భారీ వర్షాలు కురిశాయి. వేలాది ఎకరాల్లో పంటలు నీటి ముంపునకు గురయ్యాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. వంతెనపైనుంచి వాగుల నీరు ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అల్లూరి జిల్లాలో వాగు దాటుతున్న ఓ వ్యక్తి గల్లంతయ్యాడు. పశ్చిమ మధ్య, వాయువ్య బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన తీవ్ర అల్పపీడనం సోమవారం రాత్రికి వాయుగుండంగా బలపడి మంగళవారం ఉదయానికి దక్షిణ ఒడిశా, ఉత్తరాంధ్ర తీరాలను దాటే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ ఒక ప్రకటనలో పేర్కొంది. సోమవారం భారీ వర్షాలకు అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట మండలం అడ్డుమండలో వాగు తాటుతున్న కంబిడి కుమారస్వామి అనే వ్యక్తి కొట్టుకుపోయారు. శ్రీకాకుళం జిల్లా నందిగాంలో 71.75 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. సరుబుజ్జిలి మండలంలో సుమారు 75 ఎకరాల్లోని తంపర భూములు, ఆమదాలవలస మండలం తోటాడలో 20 ఎకరాల మేర వరి పంట పొలాలు నీట మునిగాయి. విజయనగరం జిల్లా ఎస్.కోట మండలంలో వరి పొలాలు నీట మునిగాయి. విశాఖ-అరకు రహదారిలో రోడ్డుపై నీరు నిలిచి వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. వేపాడ మండలంలోని సింగరాయి గ్రామం జలదిగ్బంధనంలో చిక్కుకొంది. పార్వతీపురం మన్యం జిల్లాలో వర్షాలకు గెడ్డలు పొంగి ప్రవహించాయి. విశాఖ నగరంలోని లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి వర్షపు నీరు మిగతా 2లో

ప్రాణ, ఆస్తి నష్టం లేకుండా చర్యలు

- వర్షాలపై సిఎం సమీక్ష

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో కుండపోతగా పడుతున్న వర్షాల నేపథ్యంలో అధికార యంత్రాంగం సమన్వయంతో వ్యవహరిస్తూ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ప్రాణ, ఆస్తి నష్టం లేకుండా చూడాలన్నారు. అల్పపీడనం వాయుగుండంగా మారుతుందని వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో సోమవారం సచివాలయంలో సిఎస్‌తో కలిసి ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ.. వాతావరణశాఖ హెచ్చరికలను దృష్టిలో పెట్టుకుని అన్ని జిల్లాల కలెక్టర్లను అప్రమత్తం చేయాలని సిఎస్‌కు సూచించారు. ముఖ్యంగా ఉత్తరాంధ్రలో పలుచోట్ల నదులు, వాగులు, ఉప్పొంగి ప్రవహించడం, కొండ ప్రాంతాలు కోతలకు గురికావడంతో అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. భారీ వర్షాలకు కొండ ప్రాంతాల్లో, వాటి దిగువన ఉన్న ప్రజలను ఎప్పటికప్పుడు అధికార యంత్రాంగం అప్రమత్తం చేయాలని సూచించారు. రాష్ట్రంలో భారీ వర్షాలు కొనసాగితే విద్యా సంస్థలకు సెలవులు ఇవ్వాలన్నారు. ప్రజలకు ఎప్పటికప్పుడు సమాచారం అందించేలా అన్ని జిల్లా కేంద్రాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని, అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేసేలా కలెక్టర్లు చొరవ తీసుకోవాలని సిఎం ఆదేశించారు. ఈ సందర్భంగా ఉత్తరాంధ్రలో తాజా పరిస్థితిని ముఖ్యమంత్రికి సిఎస్ విజయానంద్ వివరించారు.

ఓట్ల దొంగతనం ఆపండి

- సిఇసి వ్యాఖ్యలపై ప్రతిపక్షాల ఆందోళన
- బాండ్ పేపర్లను చూపిస్తూ నినాదాల హోరు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఓట్ల చోరీ, అఫిడవిట్ దాఖలు చేయాలి, లేదా క్షమాపణలు చెప్పాలంటూ సిఇసి జ్ఞానేష్ కుమార్ వ్యాఖ్యలను నిరసిస్తూ సోమవారం పార్లమెంట్ ఆవరణలో విపక్షాలు ఆందోళనకు దిగాయి. పార్లమెంట్ ఆవరణలో మకర్ ద్వార్ వద్ద ప్రతిపక్షాలు ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. తమను బెదిరించొద్దని, తాము ప్రజాస్వామ్యం, రాజ్యాంగం, ప్రజల ఓటు హక్కు కోసం పోరాడుతామని నినదించారు సిఇసి వ్యాఖ్యలకు నిరసనగా . ఖాళీ బాండ్ పేపర్లను ప్రదర్శించారు. బాండ్ పేపర్లను నిరసన తెలపడం కోసమే చూపడం లేదని, సమస్య తీవ్రతను చెప్పడమే తమ ఉద్దేశ్యమని వారు చెప్పారు. పార్లమెంటు ఆవరణలో జరిగిన ఈ ఆందోళనలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, ఎస్‌పి నేతలు, అఖిలేష్ యాదవ్, రామ్‌గోపాల్ యాదవ్, టిఎంసి ఎంపి అభిషేక్ బెనర్జీ, డిఎంకె ఎంపిలు టిఆర్ బాలు, తిరుచ్చి శివ, కనిమొళి, ఎన్‌సిపి నేత సుప్రియా సులే, సిపిఎం ఎంపిలు జాన్ బ్రిట్టాస్, అమ్రారామ్, రాధాకష్ణన్, శివదాసన్, ఎస్. వెంకటేషన్, ఎఎ రహీమ్, సిపిఐ ఎంపి సంతోష్ కుమార్, ఆర్‌జెడి ఎంపి మనోజ్ కుమార్ ఝా, జెఎంఎం ఎంపి మహువా మాంఝీ, శివసేన ఎంపి అరవింద్ సావంత్ తదితరులు ఆందోళనలో పాల్గొన్నారు.

ఆందోళన మధ్యే రెండు బిల్లులు

బీహార్ ఎస్ఐఆర్, ఓట్ల దొంగతనం, ప్రతిపక్షాలపై సిఇసి వ్యాఖ్యలను నిరసిస్తూ పార్లమెంట్ ఉభయ సభల్లోనూ ప్రతిపక్ష సభ్యులు తమ ఆందోళనను కొనసాగించారు. సోమవారం లోక్‌సభను స్పీకర్ ఓంబిర్లా ప్రారంభిస్తూ ప్రశ్నోత్తరాలు నిర్వహించేందుకు ప్రయత్నించారు. ప్రతిపక్ష ఎంపిలు ప్లకార్డులు పట్టుకుని వెల్‌లోకి దూసుకెళ్లి ఆందోళన చేపట్టారు. దీంతో సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. సభ్యులు నినాదాలు చేస్తూ స్పీకర్ పోడియం వద్దకు దూసుకురావడంపై లోక్‌సభ స్పీకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అయినా ఆందోళన కొనసాగడంతో సభను మధ్యాహ్నం 12 గంటలకు వాయిదా వేశారు. తిరిగి ప్రారంభమైన సభలో ప్రతిపక్షాల ఆందోళన మధ్యే కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఐఐఎం సవరణ బిల్లు, కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి జన విశ్వాస్ సవరణ బిల్లును ప్రవేశపెట్టారు. అయితే ఇందులో జన విశ్వాస్ సవరణ బిల్లును సెలెక్ట్ కమిటి పంపించారు. వెంటనే సభను మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా వేశారు. తిరిగి ప్రారంభమైన సభలో ప్రతిపక్షాల ఆందోళన మధ్యే అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో దేశ తొలి వ్యోమగామి శుభాన్షు శుక్లా- 2047 నాటికి విక్షిత్ భారత్ కోసం అంతరిక్ష కార్యక్రమం కీలక పాత్ర' అనే అంశంపై చర్చను కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ ప్రారంభించారు. 2040 నాటికి భారత వ్యోమగామి చంద్రుడిపై కాలుమోపి త్రివర్ణ పతాకాన్ని ఎగురవేవేస్తాడని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం సభను నేటి (మంగళవారం)కి వాయిదా వేశారు.ఇటు రాజ్యసభలోనూ అదే పరిస్థితి నెలకొంది. డిప్యూటీ చైర్మన్ హరివంశ్ సభ్యులు లేవనెత్తిన అత్యవసర అంశాలను చర్చించాలని రూల్ 267 కింద ఇచ్చిన నోటీసులను తిరస్కరించారు. ప్రతిపక్ష సభ్యుల ఆందోళనతో సభను మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా వేశారు. తిరిగి ప్రారంభమైన సభలో ఇండియన్ పోర్ట్స్ బిల్లును మూజువాణి ఓటుతో ఆమోదించారు. అనంతరం సభను నేటికి (మంగళవారం) వాయిదా వేశారు.


నిరుపయోగంగా 13 కోట్ల జన్‌ధన్ ఖాతాలు

న్యూఢిల్లీ : పేదల ఆర్థిక సాధికారత కోసం ప్రవేశపెట్టిన పిఎం జన్ ధన్ యోజన (జెడివై) బ్యాంకింగ్ ఖాతాలు కనీస లావాదేవీలు లేక నిరుపయోగంగా మారుతున్నాయి. దేశ వ్యాప్తంగా 56.04 కోట్ల జన్ ధన్ ఖాతాల్లో దాదాపు 23 శాతం అంటే 13.04 కోట్ల ఖాతాలు నిరుపయోగంగా ఉన్నట్లు కేంద్ర ఆర్థికశాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరీ లోకసభకు లిఖితపూర్వకంగా తెలిపారు. ఒక పొదుపు ఖాతాలో వినియోగదారుడి తరపు నుంచి రెండేళ్లకు పైగా ఎలాంటి లావాదేవీలు నిర్వహించకపోతే దానిని నిరుపయోగ ఖాతాలుగా గుర్తిస్తారు. ఒక్క ఉత్తరప్రదేశ్‌లోనే అత్యధికంగా 2.75 కోట్ల నిరుపయోగ ఖాతాలున్నాయి. బీహార్‌లో 1.39 కోట్లు, మధ్యప్రదేశ్‌లో 1.07 కోట్లు చొప్పున అత్యధిక నిరుపయోగ ఖాతాలున్నాయి. ఈ ఖాతాలు ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా ఉన్నాయి. ప్రభుత్వం నిరుపయోగ ఖాతాలను యాక్టివేట్ చేయడానికి (రీ-కెవైసి) చేయడానికి సెప్టెంబర్ 30 వరకు ప్రత్యేక క్యాంపెయిన్‌లు చేపడుతోంది. ప్రస్తుతం యుపిఐ లావాదేవీలపై ఛార్జీలు విధించే ప్రతిపాదనేదీ లేదని మంత్రి చౌదరి తెలిపారు. యుపిఐ సేవల ప్రోత్సాహానికి ప్రభుత్వం గత నాలుగేళ్లలో రూ.8,730 కోట్ల ప్రోత్సాహకాలు ఇచ్చిందన్నారు.

కొత్త ప్రాజెక్టులకు సహకారం అందించండి

- కేంద్ర మంత్రులకు లోకేష్ విజ్ఞప్తి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో



రాష్ట్రంలో తలపెట్టిన కొత్త ప్రాజెక్టులకు సహకారం అందించాలని ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేష్ కేంద్రాన్ని కోరారు. ఈ మేరకు సోమవారం నాడిక్కడ పలవురు కేంద్ర మంత్రులను కలిసి ఆయన విజ్ఞప్తి చేశారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కలిసి కూటమి ప్రభుత్వానికి ఉదారంగా అర్థిక సాయం అందిస్తున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమం, ఎరువులు, రసాయనాల శాఖల మంత్రి జెపి నడ్డాతో భేటీ అయిన నారా లోకేష్ ఖరీఫ్ సీజన్‌లో ముమ్మరంగా వ్యవసాయ పనులు కొనసాగుతున్న నేపథ్యంలో యూరియా కొరత ఉందని, వెంటనే రాష్ట్రానికి అవసరమైన యూరియా కేటాయించాలని కోరారు. దీనిపై కేంద్రమంత్రి నడ్డా స్పందిస్తూ ఈనెల 21నాటికి ఆంధ్రప్రదేశ్‌కు 29వేల మెట్రిక్ టన్నుల యూరియా కేటాయిస్తామని హామీ ఇచ్చినట్లు మంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. విశాఖపట్నంలో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్ (ఎన్ఐపిఈఆర్) శాశ్వత క్యాంపస్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ల కూడా నడ్డాను లోకేష్ కోరారు. రాష్ట్రంలో బిపిసిఎల్ సంస్థ నిర్మించే రిఫైనరీ కమ్ పెట్రోకెమికల్ కాంప్లెక్స్ త్వరితగతిన కార్యకలాపాలను ప్రారంభించేందుకు సహకారం అందించాలని కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సిం గ్ పూరిని కోరారు. రామాయపట్నం పోర్టు సమీపంలో బిపిసిఎల్ సంస్థ 6వేల ఎకరాల్లో రూ.95వేల కోట్ల వ్యయంతో నిర్మించ తలపెట్టిన రిఫైనరీ-కమ్-పెట్రోకెమికల్ కాంప్లెక్స్ కు సంబంధించి పనుల పురోగతిపై చర్చించారు. రాష్ట్రంలోని దీపం-2 పథకాన్ని ప్రధానమంత్రి ఉజ్వల యోజన (పిఎంయువై)తో అనుసంధానం చేయాలని కోరారు. కేంద్ర షిప్పింగ్, ఓడరేవులు, జల రవాణా శాఖల మంత్రి సర్బానంద సోనవాల్, కేంద్ర మంత్రులు, అశ్వినీ వైష్ణవ్, నితీన్ గడ్కరీ, జై శంకర్, పియూష్ గోయల్ తదితరులను కూడా లోకేష్ కలిసి వివిధ అభివృద్ధి ప్రాజెక్టులకు సహకరించాలని కోరారు. అనంతరం ఎన్‌డిఎ ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా సిపి రాధాకృష్ణన్‌ను నారా లోకేష్ మర్యాదపూర్వకంగా కలిసి, అభినందనలు తెలిపారు.

రేపు డిగ్రీ అడ్మిషన్ల షెడ్యూల్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో డిగ్రీ అడ్మిషన్లకు సంబంధించిన షెడ్యూల్‌ను ఈ నెల 20వ తేదిన విడుదల చేస్తామని ఉన్నత విద్యామండలి వెల్లడించింది. ఈ మేరకు విద్యామండలి కార్యదర్శి కృష్ణమూర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో అడ్మిషన్లు ఉంటాయని పేర్కొన్నారు. అడ్మిషన్లకు సంబంధించిన పూర్తి షెడ్యూల్ విడుదల చేస్తామని వెల్లడించారు.

రాజధానిపై వైసిపి దుష్ప్రచారం

- మాజీ మంత్రి దేవినేని ఉమా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాజధాని అమరావతి మునిగిపోయిందంటూ వైసిపి నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. టిడిపి కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అమరావతిలో రూ.52 వేలకోట్లతో జరుగుతున్న నిర్మాణాలను చూసి ఓర్వలేక వైసిపి నేతలు, వారి అనుకూల మీడియా సహకారంతో విషప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ప్రకాశం బ్యారేజీ గేట్లు పనిచేయడం లేదని, కొండవీటి వాగు నీటితో పంటలు మునిగిపోయాయని వైసిపి నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. ఆ పార్టీ అధినేత జగన్ అమరావతిలో సచివాలయం, అసెంబ్లీ, హైకోర్టు, ఎస్ఆర్ఎం యూనివర్సిటీ చూడాలని చెప్పారు. అక్కడ నిర్మాణాలు ఎలా జరుగుతున్నాయో స్వయంగా పర్యవేక్షించి తెలుసుకోవాలని పేర్కొన్నారు.

కాగ్ నివేదికలో అంకెలను వైసిపి తారుమారు చేసి తిమ్మినిబమ్మి చేస్తోందని టిడిపి అధికార ప్రతినిధి, బయో డైవర్సిటీ బోర్డు ఛైర్మన్ నీలాయపాలెం విజయ్‌కుమార్ విమర్శించారు. మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఈ ఏడాది సంఖ్యలను రెండేళ్ల క్రితం అంకెలతో పోలుస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ ఆదాయంపై బుగ్గన తప్పుడు లెక్కలు చెబుతున్నారన్నారు.

అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు

- మంత్రి సత్యకుమార్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

భారీ వర్షాల నేపథ్యంలో అంటువ్యాధులు ప్రబలకుండా అవసరమైన అన్ని రకాల ముందస్తు చర్యలను త్వరితగతిన తీసుకోవాలని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆశాఖ అధికారులను ఆదేశించారు. జిల్లాల్లోని తాజా పరిస్థితులపై అధికారులు మంత్రికి సోమవారం వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వచ్చే నెల వరకు వర్షాలు పడే అవకాశం ఉన్నందున అంటు రోగాల నియంత్రణకు అవసరమైన చర్యలు తీసుకోవడంలో అలసత్వానికి తావివ్వొద్దన్నారు. గతంలో నమోదైన కేసుల ఆధారంగా గుర్తించిన సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు చేపట్టాలని చెప్పారు. జిల్లాల వైద్య ఆరోగ్యశాఖ అధికారులు మండలాల వారీగా కేసుల నమోదు తీరుపై సమీక్షిస్తూ అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. తాగునీరు కలుషితం కాకుండా చూసినట్లయితే ఫలితాలు మరింత మెరుగ్గా ఉంటాయని పేర్కొన్నారు. గ్రామాల్లో పనిచేసే సిహెచ్‌ఓలు జిల్లా అధికారులు నిర్దేశించిన సమయాల్లో తాగునీటి నమూనాలు సేకరించి పరీక్షలు చేయడానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. నీటి ఫలితాలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, మున్సిపల్, పంచాయతీ, గ్రామీణ నీటి పారుదల శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు.

కృష్ణా, కర్నూలు జిల్లాల్లో విఎఎల బదిలీలు రద్దు

- ప్రజాప్రతినిధుల సిఫార్సులతో జరిగాయని తేల్చిన హైకోర్టు

ప్రజాశక్తి-అమరావతి

నిబంధనలతో సంబంధం లేకుండా ప్రజాప్రతినిధుల సిఫార్సుల మేరకే గ్రామ సచివాలయాల్లోని గ్రామ వ్యవసాయ సహాయకుల (విఎఎ)లను బదిలీ చేయడాన్ని హైకోర్టు ఆక్షేపించింది. ఉమ్మడి కర్నూలు, కృష్ణా జిల్లాల్లో జరిగిన బదిలీలను రద్దు చేసింది. గత మే, జూన్ నెలల్లో వెలువడిన జీవోలు 23, 5లకు అనుగుణంగా తిరిగి కౌన్సెలింగ్/బదిలీలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. పై రెండు జిల్లాల్లో అత్యధికంగా ప్రజాప్రతినిధుల సిఫార్సుల మేరకే బదిలీలు జరిగాయని గుర్తించింది. పారదర్శకత, వ్యక్తిగతాభిమానం, ఆశ్రిత పక్షపాతం అడ్డుకోవాలని పేర్కొంది. సిఫార్సులను యాంత్రికంగా జిల్లా కలెక్టర్లు ఆమోదించారని తప్పుపట్టింది. రూల్స్ ప్రకారమే బదిలీలు జరిగాయన్న ప్రభుత్వ వాదనను కొట్టివేసింది. ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలకు అనుగుణంగా బదిలీలు జరిగాయని, ఈ విషయాన్ని ప్రభుత్వం ఖండించలేదని చెప్పింది. బాధ్యత నుంచి అధికారులు తప్పుకున్నట్లు ఉన్నారని పేర్కొంది. ఈ మేరకు జస్టిస్ న్యాపతి విజయ్ ఇటీవల ఆదేశాలిచ్చారు. బదిలీ జరిగిన తీరును సవాలు చేస్తూ కడప, అన్నమయ్య, అనంతపురం, ఉమ్మడి కృష్ణా, ఉమ్మడి కర్నూలు జిల్లాలకు చెందిన గ్రామ వ్యవసాయ సహాయకులు పెద్ద సంఖ్యలో పిటిషన్లు వేశారు. ఆ రెండు జిల్లాల్లోనే 217 మంది బదిలీకి ఎంపీ, ఎమ్మెల్యేలు సిఫారసు చేశారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 115 మంది, ఉమ్మడి కృష్ణా జిల్లాలో 102 మందిని బదిలీ చేయాలని ప్రజాప్రతినిధులు సిఫార్సులు చేశారు. ఈ రెండు జిల్లాల్లో జరిగిన బదిలీలను రద్దు చేస్తున్నట్లు హైకోర్టు ప్రకటించింది. మిగిలిన జిల్లాల్లో ప్రజా ప్రతినిధుల సిఫార్సులు పెద్దగా లేవని, ఆ బదిలీల్లో జోక్యం చేసుకోబోమని ప్రకటించింది.

కృష్ణా, గోదావరి ఉధృతి

- భద్రాచలం వద్ద 39 అడుగుల ప్రవాహం
- ధవళేశ్వరం 175 గేట్లు ఎత్తివేత
- ప్రకాశం బ్యారేజీకి నిలకడగా వరద


ధవళేశ్వరం బ్యారేజీ వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వరద

ప్రజాశక్తి - యంత్రాంగం

కృష్ణా, గోదావరి వరద పరవళ్లు తొక్కుతున్నాయి. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా గోదావరిలో క్రమంగా వరద ఉధృతి పెరుగుతోంది. ఆదివారం రాత్రి భద్రాచలం వద్ద 35 అడుగులు ఉన్న గోదావరి సోమవారం రాత్రి తొమ్మిది గంటల సమయానికి 39 అడుగులకు చేరుకుంది. ఎగువ నుంచి మరో రెండు రోజులు వరద కొనసాగే అవకాశం ఉన్న నేపథ్యంలో మంగళవారం రాత్రిలోగా మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయి 43 అడుగులకు నీటిమట్టం చేరుకుంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. భద్రాచలం దిగువన ఏజెన్సీ ప్రాంతాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. ప్రస్తుతం భద్రాచలం నుంచి దిగువకు ఏడున్నర లక్షల క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది. ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద వరద నీటి ప్రవాహం క్రమంగా పెరుగుతోంది. ప్రస్తుతం అక్కడ 9.14 అడుగుల నీటి మట్టం నమోదైంది. దీంతో ఇరిగేషన్ అధికారులు ఈ బ్యారేజీకి చెందిన 175 గేట్లను ఎత్తి 6,09,682 క్యూసెక్కులను సముద్రంలోకి విడిచిపెడుతున్నారు. వరద తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని గోదావరి హెడ్ వర్క్స్ ఇఇ జి.శ్రీనివాస్ తెలిపారు.

గుట్టలపై పాకలు సిద్ధం చేసుకుంటున్న గిరిజనం

అల్లూరి జిల్లాలోని గోదావరి, శబరి నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో గిరిజనులు కొండలు, గుట్టలపై పాకలు ఏర్పాటు చేసుకుంటున్నారు. శ్రీరామగిరి, చొక్కానపల్లి, గుండుగూడెం, వడ్డిగూడెం, వడ్డిగూడెం కాలనీ, ధర్మతాళ్ల గూడెం వాసులు మైదాన ప్రాంతాలకు వచ్చి గుడారాలు వేసుకుంటున్నారు. కూనవరం వద్ద శబరి, గోదావరి నదుల సంగమం వద్ద వరద పోటు ఉంది. పోలవరం ముంపు మండలాలైన విఆర్.పురం, కూనవరం, చింతూరు, ఎటపాక వాసులు భయాందోళన చెందుతున్నారు. మరోవైపు అటవీ ప్రాంతంలో కురిసిన వర్షాలకు విఆర్.పురం మండలంలోని అన్నవరం - ఉమ్మడివరం, జల్లివారి గూడెం - ఎజి.కోడేరు రహదారులు మూసుకుపోయాయి. సుమారు 40 గ్రామాల ప్రజలకు రాకపోకలు నిలిచిపోయాయి. చింతూరు ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి అపూర్వ భారత్, ఎఎస్‌పి పంకజ్ కుమార్ మీనా పలుచోట్ల పర్యటించి ముంపు ప్రభావిత వాసులకు తగు సూచనలు చేశారు.

కొల్లేరుకు భారీ వరద

భారీస్థాయిలో వరద నీరు కొల్లేరులోకి వచ్చి చేరుతుండటంతో కొల్లేరు లంక గ్రామాల ప్రజలను ఇప్పటికే అప్రమత్తం చేశారు. ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందాన్ని అందుబాటులో ఉంచారు. కొల్లేరును ఆనుకుని ఉన్న భీమడోలు, గుండుగొలను, పూళ్ల ప్రాంతాల్లోని పొలాలు సైతం ముంపునకు గురయ్యాయి. కక్కునూరు మండలంలో కుక్కునూరు-దాచారం మధ్య గుండేటి వాగుకాజ్వే ముంపులోనే ఉంది. దీంతో 12 గిరిజన గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి 15 కిలోమీటర్లు అదనంగా ప్రయాణించి రావాల్సి వస్తోంది. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే వద్ద 31 మీటర్ల నీటిమట్టం నమోదైంది. సుమారు ఆరు లక్షల తొమ్మిది వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

శ్రీశైలం పది గేట్లు ఎత్తివేత

శ్రీశైలానికి వరద ప్రవాహం క్రమేపీ పెరిగింది. ఎగువ ప్రాంతాల నుంచి 3,29,145 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతుండడంతో బ్యారేజీ పది గేట్లను 12 అడుగుల మేర ఎత్తారు. దిగువ నాగార్జున సాగర్‌కు 3,00,174 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. జూరాల గేట్ల ద్వారా 2,08,530 క్యూసెక్కులు, విద్యుత్ ఉత్పత్తిద్వారా 29,707 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 87,158 క్యూసెక్కులు, హంద్రీద్వారా 3,750 క్యూసెక్కులు వచ్చి శ్రీశైలంలో చేరుతున్నాయి. నీటి మట్టం 885 అడుగులకు గాను ప్రస్తుతం 881 అడుగులు, నీటి నిలువ సామర్థ్య 215 టిఎంసిలకు గాను ప్రస్తుతం 197.0114 టిఎంసిలుగా నమోదైంది.

లోతట్టు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ఎన్‌టిఆర్ కలెక్టర్

ప్రకాశం బ్యారేజీ వద్ద కృష్ణా నది ప్రవాహం నిలకడగా కొనసాగుతోంది. ఆదివారం రాత్రి బ్యారేజీ వద్ద 2.85 లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహం కొనసాగగా, సోమవారం ఉదయం 2,90,122 క్యూసెక్కులకు చేరింది. సాయంత్రానికి పది అడుగుల నీటిమట్టంతో 2,48,450 క్యూసెక్కుల మేర తగ్గుముఖం పట్టింది. అదే సమయంలో 2.48 లక్షల క్యూసెక్కులను సముద్రంలోకి విడిచిపెడుతున్నారు. కృష్ణానది ఎగువ ప్రాంతాలతోపాటు ఎన్‌టిఆర్ జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల ప్రభావంతో నదీ ప్రవాహం కొనసాగుతుందని, నదీ పరీవాహక ప్రాంతాలతోపాటు లోతట్టు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా రెవెన్యూ, ఇరిగేషన్, పోలీస్ అధికారులు హెచ్చరించారు.

ప్రయివేటు పాఠశాల డైరెక్టర్ ఆత్మహత్యాయత్నం

- టిడిపి నాయకుల ఒత్తిడి, ఆర్థిక ఇబ్బందులే కారణం !


చికిత్స పొందుతున్న బషీర్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఆర్థిక అంశాలు, వివాదాలు వేధింపుల నేపథ్యంలో ప్రయివేటు పాఠశాల డైరెక్టర్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ ఘటన పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... పట్టణంలోని నవోదయ నగర్‌లో పూజిత ఎడ్యుకేషన్ సొసైటీ ద్వారా రెయిన్‌బో పాఠశాలను ఐదేళ్లుగా నిర్వహిస్తున్నారు. ఆర్థిక లావాదేవీల విషయమై పాఠశాల ఛైర్మన్ అజ్ఞాతంలోకి వెళ్లగా పాఠశాల డైరెక్టర్ బషీర్ మూడేళ్ల నుండి పాఠశాలను నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో పాఠశాల భవనం లీజు అగ్రిమెంట్, అద్దె చెల్లింపులు తదితర ఆర్థిక లావాదేవీలకు సంబంధించి కొన్ని రోజులుగా టిడిపికి చెందిన కొందరు బషీర్‌పై ఒత్తిడి చేస్తున్నారని ఆరోపణలున్నాయి. ఈ క్రమంలో సోమవారం తెల్లవారుజామున బషీర్ నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నం చేశారు. దీనిపై బాధితుని భార్య హేమలత మాట్లాడుతూ 2031 వరకు లీజు ఒప్పందం చేసుకున్నామని, అద్దెనూ ఏప్రిల్ వరకు చెల్లించామని, అయితే ఈ అంశాల్లో గతంలోనే వివాదాలు రాగా కోర్టు కేసులో ఉందని చెప్పారు. అయినా తమను ఇబ్బందులకు గురి చేయాలనే ఉద్దేశంతోనే శనివారం రాత్రి స్కూల్ గేటు, బోర్డు ధ్వంసం చేశారని, పాఠశాలలోకి వెళ్లడానికి వీల్లేకుండా వారే ప్రత్యేకంగా రెడీమేడ్ గోడను పెట్టారని, దీంతో విద్యార్థుల తల్లిదండ్రులకు ఏం సమాధానం చెప్పాలో తెలియక తన భర్త ఆత్మహత్యాయత్నం చేశారని తెలిపారు. దీనిపై మంత్రులు, అధికారులు, ప్రజాప్రతినిధులకూ ఫోన్ ద్వారా సందేశం పంపామని, పోలీసులకు ఫిర్యాదు చేశామని చెప్పారు


చిత్తూరు కలెక్టరేట్ ఎదుట వికలాంగుల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ సుమిత్ కుమార్

పింఛన్ల రద్దుపై వికలాంగుల ధర్నా

- ప్రజాసమస్యల పరిష్కార వేదికలో వినతులు

ప్రజాశక్తి - విలేకరుల యంత్రాంగం

అన్యాయంగా తమ పింఛన్లను రద్దు చేశారంటూ సోమవారం వికలాంగులు ఆందోళన చేపట్టారు. వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పిఆర్‌డి) ఆధ్వర్యాన చిత్తూరు, అనంతపురం, కడప, పార్వతీపురం మన్యం కలెక్టరేట్ల వద్ద ధర్నాలు నిర్వహించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతులు అందజేశారు. చిత్తూరు కలెక్టరేట్ వద్ద జరిగిన ధర్నాలో 400 మంది వికలాంగులు పాల్గొన్నారు. తమ వద్ద సదరం సర్టిఫికెట్లు ఉన్నప్పటికీ, తామంతా నిజమైన వికలాంగులైనప్పటికీ పింఛన్లు రద్దు చేయడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు.

కలెక్టర్ బయటకు రావాలని, తొలగించిన అర్హుల పింఛన్లను పునరుద్ధరించాలని, తమను అనర్హులుగా నిర్ధారించిన సంబంధిత ప్రభుత్వ వైద్యులను తక్షణమే సస్పెండ్ చేయాలని నినదించారు. తుదకు కలెక్టర్ సుమిత్ కుమార్ వారి వద్దకు వచ్చి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సచివాలయ సిబ్బంది అందజేసిన పింఛన్ల తొలగింపునకు సంబంధించిన నోటీసులను పరిశీలించారు. పొరపాట్లను సరిదిద్దుతామని కలెక్టర్ హామీ ఇచ్చారు. కడప, అనంతపురం కలెక్టరేట్ల వద్ద ఆందోళనలు చేపట్టారు. అనంతపురంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రామయ్య మాట్లాడుతూ... పింఛన్ల నిధులను తగ్గించుకునే క్రమంలో వికలాంగుల పింఛన్లను ప్రభుత్వం అన్యాయంగా రద్దు చేస్తోందన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు వసంత్ కుమార్ పాల్గొన్నారు.

29కి ధర్నా వాయిదా

- డిగ్రీ కళాశాలల జెఎసి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

బదిలీలు నిర్వహించాలని డిమాండ్ చేస్తూ పిలుపునిచ్చిన ధర్నాను ఈ నెల 29వ తేదీకి వాయిదా వేసినట్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుల జెఎసి వెల్లడించింది. ఈ నెల 18న పిలుపునిచ్చిన ధర్నా కార్యక్రమాన్ని వాయిదా వేసినట్లు జెఎసి నాయకులు ఎం శ్యాంబాబు, (జిసిటిఎ ఎపి ప్రధాన కార్యదర్శి), ఎం శ్రీనివాసరెడ్డి (జిసిజిటిఎ ఎపి ప్రధాన కార్యదర్శి) సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కళాశాల విద్యాశాఖ డైరెక్టర్ సూచన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. వారం రోజుల్లో తమ సమస్యలకు ఒక ఆమోదయోగ్యమైన పరిష్కారం చూపించడానికి ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. అన్ని ప్రభుత్వ శాఖల్లో నిర్వహించినట్లుగా తమకు కూడా బదిలీలు నిర్వహించాలని, ఎయిడెడ్ అధ్యాపకులను ప్రభుత్వంలోకి తీసుకొచ్చిన జిఓ 42ను రద్దు చేయాలని, గుర్తింపు జిఓ విడుదల చేయాలన్నారు. ఇతర ఆందోళనలు కొనసాగుతాయని వెల్లడించారు.

ప్రజల్లోకి ప్రభుత్వ కార్యక్రమాలు

- ఈ నెలఖారులోగా పార్టీ కమిటీలు
- పార్టీ నేతలతో చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని టిడిపి నేతలకు ఆ పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలు జారీ చేశారు. దీనికోసం నాయకులు ఎప్పుడూ ప్రజల్లో ఉండాలని చెప్పారు. సుపరిపాలనలో తొలి అడుగు, పార్టీ కమిటీల నియామకంపై పార్టీ నేతలతో సోమవారం టెలీకాన్ఫరెన్స్ ద్వారా చర్చించారు. ప్రభుత్వ పథకాలపై ప్రచారం కోసం, ప్రజలకు వివరించేందుకు చేపట్టిన తొలి అడుగు విజయవంతమైందని తెలిపారు. సాంకేతికతను ఉపయోగించుకుని ఇంటింటికీ వెళ్లి ప్రజలకు పథకాలను వివరించారని వెల్లడించారు. ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్రంలో 1.24 కోట్ల కుటుంబాలను నేరుగా కలిశారని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాల పట్ల ప్రజల్లో సానుకూలత వ్యక్తమవుతోందని తెలిపారు. ఎన్నికల్లో చెప్పిన విధంగా సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తున్నామన్నారు. పింఛన్ల పెంపు, తల్లికి వందనం, అన్నదాతా సుఖీభవ, స్త్రీ శక్తి, ఉచిత బస్సు ప్రయాణ పథకాలను చెప్పిన విధంగా అమలు చేశామని తెలిపారు. పార్టీ కోసం కష్టపడ్డ కార్యకర్తల కోసం నామినేటెడ్ పదవులు భర్తీ చేస్తున్నామని చెప్పారు. తప్పుడు ప్రచారంతో ప్రజలను గందరగోళ పరచాలనే సిద్ధాంతంతో వైసిపి పనిచేస్తోందని విమర్శించారు. తప్పుడు ప్రచారాలను ఎప్పటికప్పుడు ఖండించాలని, లేదంటే వాటిని ప్రజలు నమ్మే స్థాయికి తీసుకెళ్తారని చెప్పారు. మంత్రులు, పార్టీ నేతలు ఈ విషయంలో మరింత చొరవ చూపాలని తెలిపారు. పార్టీకి, ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చేలా ఉండకూడదని, వివాదాలకు ఏ ఒక్కరూ ఆస్కారం ఇవ్వకూడదని చెప్పారు. పార్టీ కమిటీలను సాధ్యమైనంతవరకు ఈ నెల చివరికి పూర్తి చేయాలని, దీనికి సంబంధించిన పనిని వేగవంతం చేయాలని తెలిపారు. ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జులతో ముఖాముఖి అవుతానని, మంచి చెడులు వారితో చర్చిస్తున్నానని, పొరపాట్లు ఉంటే సరిదిద్దుతూ సూచనలు ఇస్తున్నానని పేర్కొన్నారు. పులివెందుల, జడ్‌పిటిసి ఉప ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేసిన కార్యకర్తలు, నేతలను అభినందించారు.

శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో తీవ్ర విషాదం

- రథం లాగుతుండగా విద్యుదాఘాతంతో ఐదుగురి మృతి
- ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న మరో నలుగురు
- హైదరాబాద్‌లో తీవ్ర విషాదం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లో కృష్ణాష్టమి వేడుకలు తీవ్ర విషాదాన్ని మిగిల్చాయి. రథం ఊరేగింపులో విద్యుత్ తీగలు తగిలి ఐదుగురు యువకులు అక్కడికక్కడే మృతిచెందారు. మరో నలుగురు చికిత్స పొందుతున్నారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... వేడుకల సందర్భంగా ఆదివారం రాత్రి రామంతపూర్‌లోని గుకులేనగర్‌లో యాదవ్ సంఘం ఫంక్షన్ హాల్ నుంచి ఊరేగింపు చేపట్టారు. అర్ధరాత్రి 12 గంటలకల్లా రథాన్ని తిరిగి గోకులేనగర్‌కు తీసుకువచ్చారు. మరి కాసేపట్లో ఊరేగింపు ముగుస్తుందన్న సమయంలో రథాన్ని లాగుతున్న వాహనం ఒక్కసారిగా నిలిచిపోయింది. దాంతో వాహనాన్ని పక్కన పెట్టి రథం బండిని యువకులు చేతులతో లాగుతూ ముందుకు కదిలారు. ఈ క్రమంలో రథానికి పైన విద్యుత్ వైర్లు (సర్వీస్‌వైర్లు) తగిలాయి. దాంతో తొమ్మిది మందికి విద్యుత్‌షాక్ కొట్టింది. ఐదుగురు యువకులు అక్కడికక్కడే మరణించగా గాయాలపాలైన ఐదుగురు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మృతిచెందిన వారిలో ఓల్డ్ రామంతపూర్‌కు చెందిన కృష్ణ యాదవ్(24), శ్రీకాంత్‌రెడ్డి(35), ఓల్డ్‌రామంతపూర్‌కు చెందిన సురేష్ యాదవ్(34), హబ్సిగూడకు చెందిన రుద్ర వికాస్(39), రాజేంద్రరెడ్డి(39) ఉన్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఉప్పల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో ఈ ప్రమాదం జరిగిందని బాధిత కుటుంబీకులు, స్నేహితులు, బంధువులు సోమవారం రామంతపూర్ ప్రధాన రహదారిపై ఆందోళనకు దిగారు. తమకు న్యాయం చేయాలంటూ డిమాండ్ చేశారు.

రూ.ఐదు లక్షల ఎక్స్‌గ్రేషియా : మంత్రి శ్రీధర్‌బాబు

బాధిత కుటుంబాలకు రూ.ఐదు లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా, గాయపడిన వారికి వైద్య ఖర్చులను ప్రభుత్వమే భరిస్తుందని ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో దర్యాప్తునకు ఆదేశించామని, నివేదిక వచ్చాక బాధ్యులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

కాకాణికి బెయిల్ మంజూరు

ప్రజాశక్తి-అమరావతి

అక్రమ మైనింగ్ ఆరోపణలతో నెల్లూరు జిల్లా, పొదలకూరు పోలీసులు పెట్టిన కేసులో మాజీ మంత్రి, వైసిపి నేత కాకాణి గోవర్ధన్‌రెడ్డికి సోమవారం హైకోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. రూ.2 లక్షల చొప్పున రెండు పూచీకత్తులు సమర్పించాలని, దర్యాప్తునకు సహకరించాలని తెలిపింది. దర్యాప్తు అధికారి అనుమతి లేకుండా తెలుగు రాష్ట్రాలను విడిచి వెళ్లకూడదని స్పష్టం చేసింది. కాకాణిపై 13 కేసులు ఉన్నందున బెయిల్ ఇవ్వొద్దని పోలీసులు వాదించారు. కాకాణి ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేశారని, ప్రాథమిక దర్యాప్తు పూర్తయ్యిందని న్యాయమూర్తి గుర్తు చేశారు.

పవన్ కల్యాణ్ నటించకుండా ఉత్తర్వులు ఇవ్వండి

'హరిహర వీరమల్లు' సినిమా వ్యవహారంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పదవీ దుర్వినియోగం చేశారని, సిబిఐ దర్యాప్తునకు ఆదేశించాలని రిటైర్డు ఐఎఎస్ అధికారి విజయ్ కుమార్ హైకోర్టును ఆశ్రయించారు. సినిమాల్లో నటించకుండా, వినోద కార్యక్రమాల్లో పాల్గొనకుండా, ప్రమోట్ చేయకుండా, ప్రకటనలు ఇవ్వకుండా పవన్‌కు మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. దీనిని సోమవారం హైకోర్టు విచారించింది. కేసుల విచారణ జాబితాలో సిబిఐ, ఎసిబి తరపు అడ్డకేట్ల పేర్లను ముద్రించాలని రిజిస్ట్రీకి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప సోమవారం ఆదేశించారు. సిబిఐ, ఎసిబిలతో పాటు పవన్ కళ్యాణ్‌కు నోటీసులు జారీ చేయాలన్న పిటిషనర్ అడ్వకేట్ వినతిని తిరస్కరించారు.

సాయం చేస్తాం... మరి మాకేంటి?

- మార్గదర్శుల నుంచి కొత్త డిమాండ్

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

పి-4 పథకం అమలు కోసం మార్గదర్శుల నుంచి ప్రభుత్వానికి కొత్త సవాల్ ఎదురవుతున్నట్లు తెలుస్తోంది. సాయం చేసేందుకు ముందుకు వస్తున్న తమకు ప్రభుత్వం నుంచి కూడా ప్రయోజనాలు ఉండాలన్న డిమాండ్ కొంతమంది మార్గదర్శుల నుంచి వస్తున్నట్లు సమాచారం. దీంతో వారిని ఆకట్టుకునేందుకు ప్రభుత్వం కూడా కొన్ని రాయితీలు అందించేందుకు ఆలోచనలు చేస్తోంది. దీనిపై శాఖల వారీ అధ్యయనం చేస్తున్నట్లు తెలిసింది. రాయితీలిస్తే మార్గదర్శులు కూడా ముందుకొచ్చేందుకు చొరవ చూపిస్తారని అధికారులు అంటున్నారు. అయితే ఏ తరహా ప్రోత్సాహకాలు ఇవ్వాలన్నదానిపై కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. పి-4 అమలుకు ఇప్పటికే లక్ష మందికి పైగా మార్గదర్శులను గుర్తించినట్లు తెలుస్తోంది. ఇందులో ఎక్కువ మంది వ్యాపారవేత్తలు, పారిశ్రామికవేత్తలే ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. బంగారు కుటుంబాలను ఆదుకునేందుకు ఒక్కో మార్గదర్శి భారీగానే ఖర్చు చేయాల్సి ఉంటుంది.

బంగారు కుటుంబాల నుంచి వస్తున్న డిమాండ్లు కూడా 90 శాతం వరకు ఆర్థికపరమైనవే ఉండడంతో వాటిని నెరవేర్చేందుకు మార్గదర్శులు నిధులు భరించాల్సి ఉంటుంది. దీంతో వారు కూడా ప్రభుత్వానికి కొన్ని షరతులు పెడుతున్నట్లు చెబుతున్నారు. తాము చేసే వ్యాపారాలకు, వాణిజ్యానికి పన్ను రాయితీలు కల్పించాలని చాలా మంది మార్గదర్శుల నుంచి డిమాండ్లు వస్తున్నట్లు ఒక అధికారి చెప్పారు. అందుకే ప్రభుత్వం కూడా ఆ దిశగా ఆలోచనలు చేస్తున్నట్లు సమాచారం.

ఆర్థిక భారం లేకుండా..

ప్రధానంగా ఏ తరహా ప్రోత్సాహకాలు ఇస్తే బాగుంటుంది, ఆర్థిక భారం కాకుండా ఎలా చేస్తే మెరుగ్గా ఉంటుందన్న కోణంలో ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. నేరుగా పన్ను రాయితీలు ఇస్తే ఎంతవరకు ఖజానాకు ఆదాయం తగ్గుతుందన్నది కూడా అంచనా వేస్తోంది. ఇదే సమయంలో మార్గదర్శుల నుంచి బంగారు కుటుంబానికి ఎంత సాయం అందే అవకాశాలు ఉంటాయి, ప్రోత్సాహకాల వల్ల ఖజానాకు ఎంత లోటు ఉంటుందన్నది కూడా ఆలోచించాల్సిన పరిస్థితి ఉందని అధికారులు అంటున్నారు. అలాగే పరిశ్రమలకు పన్నుల్లో రాయితీ కాకుండా ఇతర ప్రోత్సాహకాల రూపంలో ఏమి అందిస్తే బాగుంటుందో కూడా ఆలోచన చేయాల్సి ఉందని ఒక అధికారి వ్యాఖ్యానించారు. ఇదే అంశంపై నిర్మాణ రంగానికి చెందిన శాఖలు, పరిశ్రమలశాఖ వంటి శాఖలతో సమాలోచనలు చేస్తున్నట్లు కూడా తెలిసింది. మొత్తం అధ్యయనం పూర్తయ్యాక మార్గదర్శులకు ఇవ్వాల్సిన ప్రోత్సాహకాలపై ఒక నిర్ణయం ఉంటుందని తెలుస్తోంది.

లక్కిరెడ్డిపల్లి ఎస్ఐపై హైకోర్టు ఆగ్రహం

ప్రజాశక్తి-అమరావతి

కోర్టు నోటీసు తీసుకోకుండా ఉండేందుకు వారం రోజులు సెలవుపై వెళ్లిన కడప జిల్లా, లక్కిరెడ్డిపల్లి సబ్ ఇన్‌స్పెక్టర్ మోహన్‌పై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. సెలవులో ఉన్నట్లు పోస్టుమెన్ చేత రాయించారని వ్యాఖ్యానించింది ఎస్ఐ చెప్పకుంటే హైకోర్టు నోటీసుపై ఒక పోస్టుమెన్ ఎలా రాస్తారని ప్రశ్నించింది. ఈసారి నోటీసుకు స్పందించకపోతే ఎస్ఐ కౌంటర్ చేసినా చేయకపోయినా తామే విచారణ పూర్తి చేస్తామని తేల్చి చెప్పింది. విచారణను సెప్టెంబర్ 2కి వాయిదా వేస్తూ జస్టిస్ రావు రఘునందన్‌రావు, జస్టిస్ తూటా చంద్ర ధనశేఖర్ డివిజన్ బెంచ్ ప్రకటించింది.

పెద్దారెడ్డి ఇంటికి వెళ్లే ఉత్తర్వులపై ప్రభుత్వం అప్పీల్

ప్రజాశక్తి-అమరావతి

వైసిపి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిని తాడిపత్రిలోని తన ఇంటికి వెళ్లి ఉండేందుకు తగిన భద్రతా ఏర్పాట్లు చేయాలన్న సింగిల్ జడ్జి ఆర్డర్‌ను రద్దు చేయాలంటూ రాష్ట్రప్రభుత్వం హైకోర్టులో అప్పీల్ దాఖలు చేసింది. ఈ అప్పీల్‌ను జస్టిస్ భట్టు దేవానంద్ నేతృత్వంలోని డివిజన్ బెంచ్ మంగళవారం విచారణ చేయనుంది. ఈనెల 18నపెద్దారెడ్డి తాడిపత్రిలోని ఆయన ఇంటికి వెళ్లేందుకు పోలీసులు భద్రత కల్పించాలని గతంలో హైకోర్టు ఉత్తర్వులిచ్చింది. ఈ నేపథ్యంలో సోమవారం పెద్దారెడ్డి తన ఇంటికి వెళ్లేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. తాజాగా ప్రభుత్వం సింగిల్ జడ్జి ఉత్తర్వులను డివిజన్ బెంచ్ వద్ద సవాలుచేస్తూ అప్పీల్ దాఖలు చేసింది.

వేలాది ఎకరాలకు ముంపు

మొదటిపేజి తరువాయి


చేరింది. విశాఖ జిల్లా భీమిలిలో బోయవీధి వద్ద సముద్రం నీరు ముందుకు రావడంతో స్థానికులు భయాందోళనలు చెందారు. విశాఖ ఆర్‌కె బీచ్‌లో రక్షణ గోడ కోతకు గురైంది యారాడ ఘాట్‌రోడ్డు రెండో మలుపులో కొండచరియలు విరిగిపడ్డాయి. అనకాపల్లి జిల్లా బుచ్చయ్యపేట, వడ్డాది తదితర ప్రాంతాలు జలమయమయ్యాయి.

కాకినాడ జిల్లాలో 20 వేల ఎకరాల్లో మునిగిన వరి చేలు

కాకినాడ జిల్లాలో పెద్దాపురం, కాకినాడ, కాకినాడ రూరల్, యు.కొత్తపల్లి, పిఠాపురం, కోటనందూరు, గండేపల్లి, కిర్లంపూడి, గొల్లప్రోలు మండలాల్లో భారీ వర్షాలు కురిశాయి. పల్లపు ప్రాంతాల్లో మోకాల్లోతు వర్షపు నీరు చేరింది. జిల్లాలో సుమారు 20 వేల ఎకరాల్లో వరి చేలు నీట మునిగాయి. వర్షాలకు అన్నవరంలో పంపా రిజర్వాయర్, తునిలో తాండవ రిజర్వాయర్‌లోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం, మామిడికుదురు, ముమ్మిడివరం, రాజోలు, సఖినేటిపల్లి, ఉప్పలగుప్తం, రావులపాలెం మండలాల్లో భారీ వర్షం కురిసింది. లోతట్టు లంక ప్రాంతాల పొలాల్లోకి వర్షపు నీరు చేరింది. తూర్పుగోదావరి జిల్లా అంతటా తేలికపాటి జల్లులు పడుతూనే ఉన్నాయి.

వాగులో కొట్టుకుపోతున్న ముగ్గురిని కాపాడిన గ్రామస్తులు

నంద్యాల జిల్లా నందికొట్కూరు మండలంలో అత్యధికంగా 54.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. కురుకుంద గ్రామానికి చెందిన యువకులు వనమాల పుల్లయ్య, వెంకటేశ్వర్లు, లింగస్వామిలు బైక్‌పై వాగు దాటుతుండగా కొట్టుకుపోతుండగా గ్రామస్తులు వారి ముగ్గురినీ కాపాడారు. వీరి బైక్, రెండు సెల్ ఫోన్‌లు వాగులో కొట్టుకుపోయాయి. పగిడ్యాల మండల కేంద్రంలో కురిసిన వర్షాలకు ప్రభుత్వ కార్యాలయాలు కుంటలను తలపిస్తున్నాయి. కర్నూలు జిల్లాలో ముసురు వాన పడింది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో సోమవారం ఒక మోస్తరు వర్షం కురిసింది.


విశాఖ ఆర్‌కె బీచ్‌లో కోతకు గురైన రక్షణ గోడ

నేడు అల్లూరి, ఏలూరు, ఎన్‌టిఆర్ జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు

వాయుగుండ ప్రభావంతో మంగళవారం చెదురుమదురుగా భారీ వర్షాలు పడే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ ఎమ్‌డి ప్రఖర్ జైన్ ఒక ప్రకటనలో తెలిపారు. అల్లూరి సీతారామరాజు, ఏలూరు, ఎన్‌టిఆర్ జిల్లాల్లో అక్కడక్కడా మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. మిగిలిన జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు. ఎగువ ప్రాంతాల్లో, రాష్ట్రాల్లో పడుతున్న వర్షాల కారణంగా గోదావరి, కృష్ణా, తుంగభద్ర నదుల వరద ప్రవాహం హెచ్చరిక స్థాయికి చేరనప్పటికీ వివిధ ప్రాజెక్టుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నందున ఆయా నదీ పరివాహక ప్రాంత, లోతట్టు, లంక గ్రామాల ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. బోట్లు, మోటారు బోట్లు, స్టీమర్లతో నదిలో ప్రయాణించడం, వరద నీటిలో ఈతకు వెళ్లడం, చేపలు పట్టడం, స్నానాలు చేయడం వంటివి చేయరాదని హెచ్చరించారు.

సిఎం ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్‌గా మాజీ ఎమ్మెల్సీ మంతెన

- జిఒఆర్‌టి నెంబరు 1514 విడుదల

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ముఖ్యమంత్రి టూర్ ప్రోగ్రామ్స్ కో-ఆర్డినేటర్‌గా పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్సీ మంతెన వెంకట సత్యనారాయణ రాజును ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు సోమవారం జిఓ ఆర్‌టి నెంబరు 1514ను విడుదల చేసింది. మంతెనకు సహాయ మంత్రి హోదా కల్పించారు. తదుపరి చర్యలు తీసుకోవాలని జిఎడి ప్రొటోకాల్ డైరెక్టర్‌కు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

వైసిపి హయాంలో నీటిపారుదల రంగం నిర్వీర్యం

- కాఫర్ డ్యామ్, తుంగభద్ర, అమరావతిపై తప్పుడు ప్రచారాలు
- మంత్రి నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - పాలకొల్లు (పశ్చిమగోదావరి)

రాష్ట్రంలో ఐదేళ్లపాటు నీటిపారుదల రంగాన్ని నిర్వీర్యం చేసి అన్నదాతకు అన్యాయం చేసిన చరిత్ర వైసిపిది అని మంత్రి నిమ్మల రామానాయుడు విమర్శించారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో మీడియాతో ఆయన మాట్లాడుతూ... పోలవరం కాఫర్ డ్యామ్‌పై ఉన్న రహదారికి చిన్నపాటి గండి పడితే డ్యామ్ కొట్టుకుపోయినట్లుగా ప్రచారం చేయడం దారుణమన్నారు. కొండవీటి వాగు పొంగి అమరావతి, బెజవాడ మునిగిపోతుందని ప్రచారం చేయడం ఏమిటని ప్రశ్నించారు. 2019-24 మధ్య కరకట్ట విస్తరణ ప్రణాళికలో భాగంగా ఈ రెగ్యులేటర్ పునర్నిర్మాణం చేయాల్సి ఉన్నా వైసిపి ప్రభుత్వం చేయలేదని, వారు చేసిన పాపాలను తాము ప్రక్షాళన చేసుకుంటూ వెళ్తున్నామని తెలిపారు. కొండవీటి వాగు వరదను ప్రస్తుతం పంపుల ద్వారా రోజుకు 2000 క్యూసెక్కుల సామర్థ్యంతో ప్రకాశం బ్యారేజీకి ఎత్తిపోస్తున్నామని తెలిపారు. మరో 3000 క్యూసెక్కుల వరద వచ్చినా, అన్ని పంపులనూ నడిపి పూర్తిగా నియంత్రించే ఏర్పాట్లు పక్కాగా చేసినట్లు చెప్పారు. కరకట్ట పునర్నిర్మాణంలో భాగంగా రెగ్యులేటర్లను నిర్మిస్తామన్నారు. తుంగభద్ర ప్రాజెక్టు మూడు గేట్ల మార్పిడి పనులకు రూ.52 కోట్లు పరిపాలన అనుమతి ఇచ్చి టెండర్ల ద్వారా ఏజెన్సీకి పనులు అప్పగించినట్లు వివరించారు. అప్పటివరకు భద్రతా చర్యల్లో భాగంగా 80 టిఎంసిల నీటిని మాత్రమే నిల్వ చేయాలని తుంగభద్ర బోర్డు నిర్ణయం తీసుకుందని చెప్పారు. ప్రకాశం బ్యారేజీ 67వ గేటు విరిగిందనేది వాస్తవం కాదన్నారు. రోలర్‌లో చిన్న సాంకేతిక సమస్య వల్ల గేటు ఆపరేషన్ నిలిపివేశారని తెలిపారు.

వైసిపి బిసి సెల్ ప్రధాన కార్యదర్శిగా దస్తగిరి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వైసిపి బిసి సెల్ ప్రధాన కార్యదర్శిగా దస్తగిరిని నియమించారు. ఈ మేరకు పార్టీ అధ్యక్షులు జగన్‌మోహన్‌రెడ్డి నియామక ఆదేశాలిచ్చారు. పెదకూరపాడు నియోజవర్గానికి చెందిన దస్తగిరి.. దూదేకుల జెఎసి రాష్ట్ర కన్వీనరుగా పనిచేశారు. యువకుడిగా ఆయన సేవలను గుర్తించి పార్టీ బాధ్యతలు అప్పగించినట్లు నాయకులు తెలిపారు. తన నియామకం సందర్భంగా సోమవారం నాడు దస్తగిరి పార్టీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. వైసిపి బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని దస్తగిరి పేర్కొన్నారు.

కార్లు, ఎసిల ధరలు తగ్గొచ్చు..!

న్యూఢిల్లీ : జిఎస్‌టిలో ప్రతిపాదిత రెండు శ్లాబులు అమల్లోకి వస్తే దేశంలో కార్లు, ఎసిల ధరలు తగ్గొచ్చని పరిశ్రమ నిపుణులు అంచనా వేస్తున్నారు. రోజువారీ వస్తువులు తక్కువ ధరకు లభించే అవకాశం ఉందంటున్నారు. ఈ చర్య వల్ల సామాన్య ప్రజలకు ఆర్థిక భారం తగ్గడంతో పాటు, మార్కెట్‌లో డిమాండ్ పెరిగే అవకాశం ఉందని అభిప్రాయపడుతున్నారు. కార్లు, రిఫ్రిజిరేట్లు, ఎసిల తదితర వాటిపై 28 శాతం జిఎస్‌టి అమల్లో ఉంది. చిన్న కార్లపై 18 శాతం జిఎస్‌టి పరిధిలోకి తేవాలని కేంద్రం భావిస్తోందని సమాచారం. సిగరెట్లు, పొగాకు, గుట్కా, ఆన్‌లైన్ గేమింగ్, అధిక ఇంజిన్ సామర్థ్యం గల ప్రీమియం కార్లు, యాట్‌లు వంటి విలాసవంతమైన ఉత్పత్తులపై 40 శాతం పన్ను విధించే అవకాశాలున్నాయిన తెలుస్తోంది. జిఎస్‌టి కౌన్సిల్ సమావేశం, నిర్ణయాల తర్వాతే పూర్తి స్పష్టత రానుంది. నూతన జిఎస్‌టి శ్లాబు ప్రతిపాదనలపై బిహార్ ఉప ముఖ్యమంత్రి సమ్రాట్ చౌధరి కన్వీనర్‌గా ఉన్న జిఎస్‌టి మంత్రివర్గం ఈ వారంలో సమావేశమై ప్రతిపాదనలను పరిశీలించనుంది. ఆ తర్వాత ఈ ప్రతిపాదనలు జిఎస్‌టి కౌన్సిల్ ఆమోదం కోసం పంపనున్నారు.

ఇండిగో, ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ నుంచి కో బ్రాండెడ్ కార్డు

హైదరాబాద్ : ప్రముఖ బడ్జెట్ ఎయిర్‌లైన్ కంపెనీ ఇండిగో, ప్రయివేటు రంగంలోని ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ సంయుక్తంగా కో-బ్రాండెడ్ క్రెడిట్ కార్డ్‌ను ఆవిష్కరించాయి. ఈ కార్డు వీసాకార్డ్, రూపే నెట్‌వర్క్‌లతో లభిస్తుందని పేర్కొంది. దీంతో ఇండిగో బ్లూచిప్స్ రివార్డులను పొందవచ్చని తెలిపాయి. రూ.4,999 జాయినింగ్ ఫీజు లేదా రూ.1 లక్ష డిపాజిట్ చేయడం ద్వారా ఈ కార్డును పొందవచ్చని ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ పేర్కొంది. దీనిపై పలు రివార్డులను పొందవచ్చని, ముఖ్యంగా ఇండిగో విమనాల్లో ప్రయాణాలు చేసే వారికి ఎక్కువ లాభం చేకూరనుంది.

'ఉక్కు' ప్రైవేటీకరణ వద్దు

- స్టీల్‌ప్లాంట్ ప్రధాన పరిపాలనా భవనం వద్ద ఉక్కు కార్మిక సంఘాల ధర్నా
- త్వరలో ఉద్యమ కార్యాచరణ


వర్షంలోనే ధర్నా నిర్వహిస్తున్న ఉక్కు కార్మిక సంఘాల నాయకులు

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం), అమరావతి బ్యూరో

వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌లో యాజమాన్యం ప్రకటించిన ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంటరెస్ట్ (ఇఒఐ)ను తక్షణం రద్దు చేయాలని విశాఖ ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్టీల్‌ప్లాంట్ ప్రధాన పరిపాలనా భవనం ఎదుట జోరువానలో ధర్నా నిర్వహించారు. స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరామ్ మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో స్థానిక ఉక్కు యాజమాన్యం ప్లాంట్‌లోని 32 విభాగాలలో 44 ఇఒఐలను ప్రకటించిందని, ఇది పూర్తిగా విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరించడమేనని పేర్కొన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం ఎంతో గొప్పగా చెప్పిన ప్యాకేజీలో భాగంగా ఇప్పటికే కాంట్రాక్ట్ కార్మికులను తొలగించారని, పర్మినెంట్ కార్మికులను విఆర్‌ఎస్ పేరుతో ఇంటికి పంపించారని తెలిపారు. పర్మినెంట్ కార్మికులకు సంవత్సర కాలంగా పూర్తి జీతాలు చెల్లించకుండా ఆర్థిక ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో కార్మిక వర్గం మరింత ఐక్యంగా పోరాడాలని కోరారు. స్టీల్ ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి డి.ఆదినారాయణ మాట్లాడుతూ... ప్లాంట్ భూములను ఎన్‌ఎండిసి సంస్థకు ఇచ్చినప్పటికీ వారి వద్ద నుంచి కాకుండా కుదురుముక్ ఐరన్ ఓర్ నుంచి పిలెట్స్ ఎందుకు కొంటున్నారని ప్రశ్నించారు. స్టీల్‌ప్లాంట్ సమస్య సిఎం చంద్రబాబు దృష్టిలో ఉన్నప్పటికీ ఆయన స్పందించకపోవడం బాధాకరమన్నారు. ఐఎన్‌టియుసి ప్రధాన కార్యదర్శి రమణమూర్తి మాట్లాడుతూ... ప్లాంట్‌లో అత్యంత ప్రమాదకర పరిస్థితులు ఉన్నప్పటికీ కార్మికవర్గం అత్యంత నైపుణ్యంతో ఉత్పత్తి ప్రక్రియ సాగిస్తోందన్నారు. అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు యు.రామస్వామి, కెఎస్‌ఎన్.రావు, నీరుకొండ రామచంద్రరావు మాట్లాడుతూ... ఎన్నికలకు ముందు ఉక్కు కర్మాగారంపై టిడిపి కూటమి ప్రజాప్రతినిధులు ఎన్నో వాగ్దానాలు చేశారని, వాటిని ఇప్పుడు నిలబెట్టుకోకుంటే తీవ్ర ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. త్వరలో ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు పి.శ్రీనివాసరాజు, కె.గంగాధర్, పుల్లారావు, వి.ప్రసాద్, మోహన్‌బాబు, ఎం.శ్రీనివాసరావు, బిఎన్.రాజు, కారు రమణ, బంటు రాము, కోరాడ వెంకటరమణ, అట్ట అప్పారావు, పల్లా పెంటరావు, యు.వెంకటేశ్వర్లు, బి.అప్పారావు పాల్గొన్నారు.

ఇఒఐ పేరుతో స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలి : సిపిఎం

ఇఒఐ పేరుతో విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు కేంద్ర ప్రభుత్వం మరోసారి సిద్ధపడిందని, తక్షణం ఆ ప్రక్రియను ఆపాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు.

అఖిలపక్ష సమావేశం నిర్వహించాలి : సిపిఐ

విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణను అడ్డుకోవాలని, ఈ అంశంపై తక్షణమే అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

స్టీల్ ప్లాంట్ విభాగాల ప్రైవేటీకరణ దారుణం : ఎపిసిసి

కేంద్ర ప్రభుత్వం విశాఖ స్టీల్ ప్రైవేటీకరణ లేదంటూనే ప్లాంట్‌లో 44 విభాగాలను ప్రైవేటీకరణకు టెండర్లు పిలవడం దారుణమని, వెంటనే ఆ ప్రక్రియ ఆపాలని ఎపిసిసి రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ షర్మిల సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

కెజిబివి ప్రిన్సిపల్ ఆత్మహత్యాయత్నం

- ఎంఎల్‌ఎ వేధింపులు, టిడిపి శ్రేణుల ట్రోలింగే కారణం : బాధితురాలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ, అమరావతి బ్యూరో

శ్రీకాకుళం జిల్లా పొందూరు కెజిబివి ప్రిన్సిపల్ ఆర్.సౌమ్య నగరంలోని తిలక్‌నగర్‌లోని తన నివాసంలో సోమవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. మోతాదుకు మించి నిద్ర మాత్రలు మింగి అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను కుటుంబ సభ్యులు, డ్రైవర్ శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చేర్పించారు. ప్రస్తుతం అత్యవసర వైద్యం పొందుతున్న ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఆమదాలవలస ఎంఎల్‌ఎ కూన రవికుమార్ వేధింపులకు గురిచేస్తూ అకారణంగా తనను బదిలీ చేయించారని ఇటీవల ఉద్యోగ, ఉపాధ్యాయ, దళిత సంఘాలతో కలిసి సమగ్ర శిక్ష కార్యాలయం వద్ద ఆమె ఆందోళన చేశారు.

ఎంఎల్‌ఎ వల్ల తనకు, తన కుటుంబానికి ప్రాణహాని ఉందని రెండు రోజులుగా ఆమె ఆరోపిస్తున్నారు. కాగా ఈ వివాదం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి వెళ్లడంతో, ఆయన ఎమ్మెల్యే రవికుమార్‌పై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో టిడిపి శ్రేణులు ఆమెపై సామాజిక మాధ్యమాల్లో ట్రోల్స్ చేస్తున్నారు. తనపై, తన కుటుంబ సభ్యులపై వ్యక్తిగతంగా దుష్ప్రచారం చేయడాన్ని తట్టుకోలేక మనస్తాపానికి గురై ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు సౌమ్య తెలిపారు.

ప్రిన్సిపల్ అక్రమ బదిలీపై రాజకీయాలు ఆపాలి - సమగ్రశిక్ష ఎంప్లాయీస్ జెఎసి

పొందూరు కెజిబివి ప్రిన్సిపల్ సౌమ్య అక్రమ బదిలీపై అధికార, ప్రతిపక్ష పార్టీలు రాజకీయాలు ఆపాలని ఎపి సమగ్రశిక్ష ఎంప్లాయీస్ జెఎసి డిమాండ్ చేసింది. ఈ మేరకు జెఎసి గౌరవ చైర్మన్ ఎవి.నాగేశ్వరరావు, చైర్మన్ బి.కాంతారావు, ప్రధాన కార్యదర్శి యు.కల్యాణి సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సౌమ్య బదిలీపై అసలు విషయాన్ని తప్పుదోవ పట్టిస్తూ ఉద్యోగ సంబంధిత అంశాన్ని రాజకీయ రగడగా మలుస్తున్నాయని, ఇది సరైంది కాదని అన్నారు. ఎమ్మెల్యే వైఖరి సరైంది కాదని ముఖ్యమంత్రి పత్రికా ముఖంగా కూడా తెలిపారని వెల్లడించారు. ఆయన ప్రకటన తరువాత కూడా అధికార టిడిపి నాయకులు మహిళా ఉద్యోగి అనే గౌరవాన్ని కూడా మరిచి ఆమె వ్యక్తిగత విషయాలను సోషల్ మీడియాలో ప్రస్తావిస్తున్నారని పేర్కొన్నారు. వైసిపి తన రాజకీయ ప్రయోజనాల కోసం ఈ అంశాన్ని వాడుకుంటోందని విమర్శించారు. ఆమె బదిలీని తక్షణమే ఆపి ఈ సంఘటనకు ప్రధాన బాధ్యుడైన సమగ్రశిక్ష జిల్లా అధికారిని వెంటనే విధుల్లోంచి తొలగించి శాఖాపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రిన్సిపల్ సౌమ్య అక్రమ బదిలీ ఆపాలని కెవిపిఎస్ ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి మరో ప్రకటనలో డిమాండ్ చేశారు.

2 గంజాయి కేసుల్లో 15 మంది అరెస్టు

- నిందితుల్లో ముగ్గురుపై పిడి యాక్ట్ ప్రయోగిస్తాం : డిఎస్‌పి

ప్రజాశక్తి- తెనాలి (గుంటూరు జిల్లా)

రెండు వేర్వేరు ఘటనల్లో 15 మంది గంజాయి నిందితులను పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. వారి నుంచి 3.2 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. తెనాలి త్రీ టౌన్ పోలీస్ స్టేషన్లో డిఎస్‌పి బి.జనార్ధన్‌రావు వెల్లడించిన వివరాల ప్రకారం... తెనాలిలోని సుందరయ్య కాలనీలో గంజాయి సేవిస్తున్నట్లు సమాచారం మేరకు మృత్యుంజయ కుమార్ సింగ్, కరికట్ట మధు, దాది షణ్ముఖ అలియాస్ బన్ను, పఠాన్ మహమ్మద్ అలియాస్ పర్విన్ ఖాన్, ఆకుల మారన్న అలియాస్ మారి, బుంగ అలియాస్ సయ్యద్ సైదా, ఆరిమళ్ల విజయ్‌కుమార్ అలియాస్ జగ్గం నాని, నిమిది సంతోష్ కుమార్‌లను పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఎనిమిది మంది నుంచి 1,700 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్లో మృత్యుంజయ కుమార్ సింగ్ బీహార్ వాసి. ఆ ప్రాంతంలో గంజాయి కొనుగోలు చేసి తెనాలి ప్రాంతంలో విక్రయిస్తున్నారు. మరో ఘటనలో కొల్లిపర మండల కేంద్రం డంపింగ్ యార్డ్ సమీపంలో ఏడుగురుని పోలీసులు అరెస్టు చేసి వారి నుంచి 1,600 గ్రాముల గంజాయిని, ఒక బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో గంజాయి విక్రేతలు కృష్ణా జిల్లా గుడివాడకు చెందిన పంది నాగ యుగంధర్ బాబు, షేక్ రకీబ్, పెకాకాని మండలం ఉప్పలపాడుకు చెందిన రామిశెట్టి శ్యామ్‌వెంకట్ అలియాస్ బాబి, దుగునూరి మోహన్ తేజ, కొల్లిపర మండలం తూములూరుకు చెందిన కనపర్తి సుందర్రావు, గంజాయి సేవిస్తున్న షేక్ అబ్దుల్ కరీం, విష్ణు మొలకల భరత్ కుమార్ ఉన్నారు. నిందితుల్లో నాగ యుగంధర్‌బాబు, షేక్ రకీబ్ విశాఖపట్నం ఏజెన్సీ ప్రాంతంలో గంజాయిని కొనుగోలు చేసి 15 గ్రాములు ప్యాకెట్లు తయారు చేసి తెనాలి పరిసర ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు. వీరిలో పలు కేసుల్లో నిందితుడైన కనపర్తి సుందరరావు అపహరించిన మూడు బైకులను కూడా స్వాధీనం చేసుకున్నట్లు డిఎస్‌పి తెలిపారు. పలు గంజాయి కేసుల్లో నిందితులుగా ఉన్న ముగ్గురిపై పిడి యాక్ట్ ప్రయోగించనున్నామని ఆయన చెప్పారు.

తాడిపత్రిలో ఉద్రిక్తత

- మరోమారు పెద్దారెడ్డిని అడ్డుకున్న పోలీసులు
- ఆరుగంటల పాటు రహదారిపై బైఠాయింపు


కుర్చీ వేసుకుని రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న పెద్దారెడ్డి

ప్రజశక్తి -అనంతపురం ప్రతినిధి

తాడిపత్రి వైసిపి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిని మరోమారు పోలీసులు అడ్డుకున్నారు. దీంతో,ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు తనను అడ్డుకోకుండా తాడిపత్రి పట్టణంలోకి అనుమతించాలని ఇటీవల కోర్టు ఆదేశాలు ఇచ్చిన నేపథ్యంలో సోమవారం తాడిపత్రికి వెళ్లేందుకు కేతిరెడ్డి సిద్ధమయ్యారు. పుట్లూరు మండలం నారాయణరెడ్డిపల్లి గ్రామం వద్దకు రాగానే పోలీసులు ఆయనను అడ్డుకున్నారు. తాడిపత్రి పట్టణంలో ఏర్పాటు చేసిన శివుడి విగ్రహ ప్రతిష్టను మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి చేపట్టారు. ఈ నేపథ్యంలో జెసి మద్దతుదారులు పెద్ద సంఖ్యలో అక్కడికి తరలివచ్చారు. ఇదే సమయంలో పెద్దారెడ్డి అక్కడికి వెళ్తే ఘర్షణ జరిగే అవకాశముందన్న కారణంతో ఆయన్ను పోలీసులు తాడిపత్రికి వెళ్లనీయకుండా అడ్డుకున్నామని పోలీసులు చెప్తున్నారు. కేతిరెడ్డిని అడ్డుకోవడంతో ఒక్కసారిగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి ఆదేశాలకు అనుగుణంగా పోలీసులు తనను తాడిపత్రికి వెళ్లనీయకుండా అడ్డుకుంటున్నారని పెద్దారెడ్డి ఆరోపించారు. శాంతిభద్రతల నేపథ్యంలో తాడిపత్రికి వెళ్లేందుకు వీల్లేదని పోలీసులు చెప్పడంతో రహదారిపై దాదాపు ఆరుగంటల పాటు కూర్చివేసుకుని బైఠాయించి నిరసన చేపట్టారు.

మరోమారు కోర్టును ఆశ్రయిస్తానని, తిరిగి మళ్లీ వస్తానని చెప్పి అక్కడి నుంచి పెద్దారెడ్డి వెళ్లిపోయారు.

జెసి.ప్రభాకర్‌రెడ్డి ఆదేశాలతోనే : పెద్దారెడ్డి

జెసి.ప్రభాకర్‌రెడ్డి, ఆయన తనయుడు అస్మిత్‌రెడ్డిలు తాడిపత్రి పట్టణంలో యథేచ్ఛగా తిరుగుతున్నారని, సమస్య ఉంటే ఇద్దరినీ బయటకు పంపించాలన్నారు. కోర్టు ఉత్తర్వులున్నా పోలీసులు లెక్క చేయకుండా వ్యవహరించడం సరైంది కాదన్నారు.

పెద్దారెడ్డి బాధితులు అడ్డుకుంటున్నారు : జెసి ప్రభాకర్‌రెడ్డి

తాను పెద్దారెడ్డి పర్యటను అడ్డుకోవడం లేదని, వైసిపి ప్రభుత్వంలో ఆయన వల్ల నష్టపోయిన బాధితులే అడ్డుకుంటున్నారని జెసి.ప్రభాకర్‌రెడ్డి చెప్పారు. పెద్దారెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో తాడిపత్రిలో చాలామందిని ఇబ్బంది పెట్టారన్నారు. గతంలో వారు అధికారంలో ఉన్న సమయంలో కోర్టు ఆదేశాలను ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు.

రోజుకు 25 లక్షల మంది ఉచిత ప్రయాణం

- మంత్రి గుమ్మడి సంధ్యారాణి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సూపర్ సిక్స్‌లో భాగంగా అమలు చేస్తున్న 'స్త్రీ శక్తి' పథకం విజయవంతమైందని, రోజుకు 25 లక్షల మంది మహిళలు ఐదు రకాల ఆర్‌టిసి బస్సుల్లో ఉచితంగా ప్రయాణిస్తున్నారని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి తెలిపారు. ఈ పథకం మహిళల్లో నూతనోత్సాహాన్ని తీసుకొచ్చిందన్నారు. సచివాలయంలోని పబ్లిసిటీ సెల్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. మహిళలకు అన్ని రంగాల్లో సమాన అవకాశాలు కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. ఆర్‌టిసికి ఉన్న మొత్తం బస్సుల్లో 74 శాతం (8,458) బస్సుల్లో మహిళలు, ట్రాన్స్‌జెండర్లు, బాలికలు రాష్ట్రంలో ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి ఉచితంగా ప్రయాణించే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందన్నారు. ఈ ఉచిత బస్సు ప్రయాణంతో దూర ప్రాంతాల్లో ఉద్యోగాలు చేసుకునే వెలుసుబాటు మహిళలకు కలుగుతుందని, గ్రామీణ ప్రాంత మహిళలు, బాలికలు, పట్టణాల్లో ఉన్నత చదువులు, ఇతర ఉద్యోగాలు చేసుకునే అవకాశం లభించిందన్నారు. శుభకార్యాలకు, ఆధ్యాత్మిక కేంద్రాలకు, తీర్థయాత్రలు చేసే మహిళలు, వృద్ధులకు ప్రయోజనకరంగా మారిందని తెలిపారు. ఈ పథకాన్ని రాష్ట్రంలో అన్ని పార్టీలు సమర్థిస్తుంటే, ఒక్క వైసిపి మాత్రం లేనిపోని విమర్శలు చేయడం సరికాదన్నారు. ప్రయాణికుల భద్రత దృష్ట్యా కొండ ప్రాంతాల్లోని ఘాట్ రోడ్లలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణానికి అనుమతించలేదన్నారు. భారీ వర్షాలు కారణంగా ఉత్తరాంధ్ర జిల్లాల్లోని అంగన్వాడీ కేంద్రాలకు సోమవారం సెలవు ప్రకటించినట్లు చెప్పారు. రానున్న మూడేళ్లలో డోలీ రహిత గ్రామాలుగా గిరిజన గ్రామాలను తీర్చిదిద్దుతామని తెలిపారు. తొలి ఏడాదిలో రూ.7,500 కోట్లు బడ్జెట్‌ను గిరిజన సంక్షేమానికి కేటాయించామని, అందులో ఇప్పటికే రూ.1,300 కోట్లను వెచ్చించి దాదాపు 60 నుంచి 70 శాతం గ్రామాలకు రోడ్ల సౌకర్యాన్ని కల్పించామని చెప్పారు. వచ్చే మూడేళ్లలో అన్ని గిరిజన గ్రామాలనూ అనుసంధానిస్తామన్నారు.

అర్హులైన కౌలు రైతులకు రుణాలు

- వ్యవసాయశాఖ స్పెషల్ సిఎస్ రాజశేఖర్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అర్హులైన కౌలు రైతులందరికీ సిసిఆర్‌సి కార్డుల ఆధారంగా స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ నిబంధనల ప్రకారం రుణాలు మంజూరు చేయాలని లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్లను వ్యవసాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్ ఆదేశించారు. కౌలు రైతులకు రుణాల మంజూరు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేసేందుకు అధికారులు అవసరమైన అన్ని చర్యలూ తీసుకోవాలని సూచించారు. సచివాలయం నుంచి వర్చువల్‌గా ఎస్‌ఎల్‌బిసి, సిసిఎల్‌ఎ, ఎల్‌డిఎం, డిఎఒలతో సమీక్షా సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. వ్యవసాయశాఖ డైరెకర్ ఢిల్లీరావు మాట్లాడుతూ.. గతేడాది లక్ష్యంలో 91 శాతం మంది కౌలు రైతులకు సిసిఆర్‌సి కార్డులు అందజేశామని తెలిపారు. రూ.4 వేలకోట్లు పంట రుణాలివ్వాలని లక్ష్యంగా పెట్టుకోగా, రూ.4,474.11 కోట్లు రుణాలు మంజూరు చేశామన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 5.9 లక్షల సిసిఆర్‌సి కార్డులిచ్చామని, 75,858 కార్డులు రెన్యువల్ చేసినట్లు చెప్పారు. మొత్తం రూ.8 వేలకోట్లు రుణాలు మంజూరు చేయాలని లక్ష్యంగా నిర్ధారించుకోగా, ఇప్పటి వరకూ రూ.838 కోట్లు మంజూరు చేశామన్నారు. అర్హులైన కౌలు రైతులందరూ లబ్ధిపొందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారులను ఆదేశించారు. ఎస్‌ఎల్‌బిసి కన్వీనర్ భాస్కరరావు, వ్యవసాయశాఖ ఉన్నతాధికారులు, సిసిఎల్‌ఎ ఉన్నతాధికారులు సమావేశంలో పాల్గొన్నారు.


ఘటనా స్థలంలో ఢీకొన్న ట్రావెలర్స్, ఆర్టీసీ బస్సులు

విషాదయాత్ర..!

- టెంపోట్రావెలర్, ఆర్‌టిసి బస్సు ఢీ
- నలుగురు మృతి.. 8 మందికి గాయాలు

ప్రజాశక్తి - తనకల్లు

తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి దర్శనం పూర్తి చేసుకుని ఇంటికి వస్తున్న కుటుంబాన్ని రోడ్డు ప్రమాదం వెంటాడింది. ఈ ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన అవ్వా మనువరాలు, టెంపో డ్రైవర్, మరొక ప్రయాణికుడు మృతి చెందారు. మరో 8 మంది తీవ్రంగా గాయపడ్డారు. శ్రీ సత్యసాయి జిల్లా తనకల్లు మండలం మల్లిపల్లి వద్ద సోమవారం చోటు చేసుకున్న ఈ ప్రమాదం బాధిత కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి... కర్ణాటక రాష్ట్రం బళ్లారికి చెందిన గోవిందప్ప, అనుసూయమ్మ వారి పిల్లలు, బంధువులతో కలిసి మూడు రోజుల క్రితం రెండు టెంపో ట్రావెల్స్‌లో తిరుమలకు వెళ్లారు. వెంకటేశ్వర స్వామి దర్శనం ముగించుకుని ఆదివారం రాత్రి బళ్లారికి తిరుగు ప్రయాణమయ్యారు. సోమవారం ఉదయం 9 గంటల సమయంలో తనకల్లు మండలం మల్లిపల్లి వద్దకు రాగానే రెండు ట్రావెల్స్ బస్సుల్లో ఒక బస్సు మరొక బస్సును ఓవర్‌టేక్ చేసే ప్రయత్నం చేయడంతో అవి రెండూ ఒకదానికి ఒకటి ఢీకొని అదుపు తప్పాయి. ఇదే సమయంలో కదిరి నుంచి మదనపల్లి వైపు వెళ్తున్న ఆర్‌టిసి బస్సును ట్రావెల్స్ బస్సులు వేగంగా ఢీకొన్నాయి. దీంతో ఒక ట్రావెల్స్ బస్సులోని అనసూయమ్మ(55) తీవ్ర రక్తగాయాలతో ఘటనా స్థలంలోనే మృతిచెందారు. అందులో ఉన్న జాన్విక (5), డ్రైవర్ మణికంఠ(32), ఏడేళ్ల రిత్విక, కుమారస్వామి, మణికుమార్ స్వామి, శశాంక్, రాకేష్, నాగేంద్ర, వసంత్, నాగార్జున, పవన్‌లు తీవ్రంగా గాయపడ్డారు. తనకల్లు ఎస్ఐ గోపి, సిబ్బంది వందేమాతరం యువత ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. కొక్కంటి క్రాస్‌కు చెందిన వందేమాతరం టీం క్షతగ్రాతులను ప్రత్యేక అంబులెన్స్‌లలో కదిరి, అనంతపురం ప్రభుత్వాసుపత్రులకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అనుసూయమ్మ మనువరాలు జాన్విక, డ్రైవర్ మణికంఠ, నాగేంద్ర (33) మరణించారు. నాగేంద్ర అనే వ్యక్తి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. మిగిలిన వారికి ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు. ఘటనా స్థలాన్ని కదిరి డిఎస్‌పి శివనారాయణ పరిశీలించారు. సహాయక చర్యలు చేపట్టి ప్రమాదానికి గురైె రోడ్డుకు అడ్డంగా ఉన్న వాహనాలను జెసిబితో తొలగించి వాహనరాకపోకలను పునరుద్ధరించారు. ప్రమాదం జరిగిన ప్రదేశంలో సంబంధిత అధికారులు స్పందించి సూచిక బోర్డులు ఏర్పాటు చేసి, రోడ్డుకు అడ్డంగా ఉన్న కంపచెట్లను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. విషయం తెలుసుకున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు.

సచివాలయ ఉద్యోగుల ముందస్తు సమాచారం తప్పనిసరి

- గ్రామ, వార్డు సచివాలయాలశాఖ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గ్రామ, వార్డు సచివాలయాల్లోని కొన్ని విభాగాలకు చెందిన ఉద్యోగుల డిప్యూటేషన్లు, ప్రమోషన్లు, ఓడి సౌకర్యం కల్పించే ఉద్యోగుల వివరాలు ముందస్తుగా జిఎస్‌డబ్ల్యుఎస్ శాఖకు తెలియపరచాలని ఆ శాఖ సోమవారం జిఓఆర్‌టి నెంబరు 12ను విడుదల చేసింది. అంతేకాకుండా జిఎస్‌డబ్ల్యుఎస్ శాఖకు తెలియకుండానే కొన్ని విభాగాలు డిప్యూటేషన్లు, ఓడి ఏర్పాట్లు కోసం ఆర్డర్లు జారీ చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చినట్లు ప్రభుత్వం పేర్కొంది. అనేక సందర్భాల్లో జిఓ ఎంఎస్ నెంబరు 3, తేదీ 10.04.2025, జిఓ ఎంఎస్ నెంబరు 4, జిఎస్‌డబ్ల్యుఎస్ శాఖ తేదీ 17.05.2025లో జారీ చేసిన మార్గదర్శకాలను ఉల్లంఘించినట్లు గమనించామని ఉత్తర్వుల్లో పేర్కొంది. జిఎస్‌డబ్ల్యుఎస్‌శాఖ నోటీసు లేకుండా ఉద్యోగోన్నతులు ఇవ్వడం సమన్వయస్ఫూర్తిని దెబ్బతీస్తుందని పేర్కొన్నారు. అనుమతి లేకుండా ఉద్యోగోన్నతులు, డిప్యూటేషన్లు, ఓడి పోస్టింగులు చెల్లవని, లైన్ డిపార్టుమెంట్లు, ఫంక్షనీర్లను ఎక్కడికైనా మార్చే ముందు జిఎస్‌డబ్ల్యుఎస్ శాఖ అనుమతి తప్పనిసరి అని తెలిపింది. ఉద్యోగులు తమకు కేటాయించిన సచివాలయంలోనే పనిచేయాలని, తప్పనిసరిగా హెచ్‌ఆర్‌ఎంఎస్ పోర్టల్‌లో బయోమెట్రిక్ హాజరు నమోదు చేయాలని పేర్కొంది. అనధికారిక డిప్యూటేషన్లు, ఓడిల్లో ఉన్నవారికి డిడిఒలు జీతాలు చెల్లించరాదని ప్రభుత్వం స్పష్టం చేసింది.

బార్ల కోసం దరఖాస్తుల స్వీకరణ

- కొత్తవారిని ప్రోత్సహించేలా నూతన పాలసీ
- 10 బార్లు గీత కార్మికులకు రిజర్వు
- ఎక్సైజ్‌శాఖ డైరెక్టర్ నిషాంత్ కుమార్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన బార్ పాలసీలో 840 బార్లను కేటాయిం చేందుకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఎక్సైజ్‌శాఖ డైరెక్టర్ నిషాంత్ కుమార్ తెలిపారు. మంగళ గిరిలోని ఎక్సైజ్‌శాఖ డైరెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ ఏడాది సెప్టెంబరు ఒకటి నుంచి అమల్లోకి వచ్చే నూతన పాలసీ 2028 ఆగస్టు 31వ తేదీ వరకూ అమల్లో ఉంటుందని తెలిపారు. కొత్తవారిని ప్రోత్సహించేందుకు నూతన పాలసీలో దరఖాస్తు, లైసెన్స్ ఫీజులను భారీగా తగ్గించినట్లు తెలిపారు. అదేవిధంగా గతంలో రెస్టారెంట్ లైసెన్స్ ఉంటేనే బార్ లైసెన్స్ దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉండేదన్నారు. ప్రస్తుతం ఆ నిబంధన తొలగించినట్లు చెప్పారు. బార్ లైసెన్స్ పొందిన 15 నుంచి 30 రోజుల్లో రెస్టారెంట్ ఏర్పాటు చేసుకునే అవకాశం కల్పించినట్లు తెలిపారు. వేలం విధానం స్థానంలో లాటరీ విధానాన్ని అమలు చేస్తున్నట్లు చెప్పారు. లైసెన్స్ ఫీజులు 50 వేలలోపు జనాభా ఉన్న పట్టణాల్లో రూ.35 లక్షలు, 5 లక్షలలోపు జనాభా ఉన్న నగరాల్లో రూ.55 లక్షలు, 5 లక్షల కంటే అధిక జనాభా ఉన్న పట్టణాల్లో రూ.75 లక్షలుగా నిర్ణయించినట్లు తెలిపారు. లైసెన్స్ ఫీజు 6 విడతలుగా చెల్లించేందుకు అవకాశం ఇచ్చామని చెప్పారు. లైసెన్స్ ఫీజు ప్రతియేటా 10 శాతం పెంచనున్నట్లు పేర్కొన్నారు. 840 బార్లలో 10 శాతం (84) బార్లను గీత కార్మికులకు రిజర్వు చేసినట్లు తెలిపారు. వాటికి సాధారణ లైసెన్స్ ఫీజులో 50 శాతం రాయితీ ఉంటుందని పేర్కొన్నారు. దరఖాస్తు రుసుము గతంలో రూ.7.50 లక్షలుగా ఉండేదని, ప్రస్తుతం రూ.5 లక్షలకు తగ్గించామన్నారు. ఒకరికి 4 దరఖాస్తులకు అవకాశం ఇస్తున్నట్లు చెప్పారు. కొత్త విధానంలో ఉదయం 10 నుంచి రాత్రి 12 గంటల వరకూ బార్లు నిర్వహించుకునేందుకు వీలుందన్నారు. లాటరీ జిల్లా స్థాయిలోనే కలెక్టర్ల ఆధ్వర్యాన ఉంటుందని పేర్కొన్నారు. ఈ నెల 18 నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైందని, 26వ తేదీ సాయంత్రం 5 గంటల వరకూ ఆన్‌లైన్‌లో, ఆఫ్‌లైన్‌లో, హైబ్రిడ్ మోడ్‌లో దరఖాస్తులను స్వీకరించనున్నట్లు వెల్లడించారు. 28వ తేదీన లాటరీ తీసి బార్లను కేటాయించనున్నట్లు తెలిపారు. కొత్తవారికి అవకాశం కల్పించేందుకు, పారదర్శకత ఉండేలా నూతన బార్ పాలసీని తీసుకొచ్చినట్లు చెప్పారు. దరఖాస్తు రుసుముల రూపంలో రూ.175 కోట్ల వరకూ ఆదాయం లభిస్తుందని ఆశిస్తున్నట్లు చెప్పారు. విమానాశ్రయాల్లో బార్ల లైసెన్స్‌కు సంబంధించి విధివిధానాలను త్వరలో తీసుకొస్తామని తెలిపారు.

నువామా వెల్త్‌కు రూ.264 కోట్ల లాభాలు

న్యూఢిల్లీ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2025-26 జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1)లో నువామా వెల్త్ మేనేజ్‌మెంట్ నికర లాభాలు 19 శాతం పెరిగి రూ.264 కోట్లకు చేరాయి. ఇదే సమయంలో కంపెనీ రెవెన్యూ 15 శాతం వృద్ధితో రూ.770 కోట్లుగా నమోదయ్యింది. కాగా.. కంపెనీ మొత్తం ఆస్తుల విలువ (ఎయుఎం) 54 శాతం పెరిగి రూ.11,810 కోట్లకు చేరింది. తమ క్లయింట్ల ఆసక్తులకు మరింత ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా దీర్ఘకాలంలో అధిక వృద్ధిని సాధించగలమని ఆ సంస్థ ఎండి, సిఇఒ ఆశిష్ కెహిర్ పేర్కొన్నారు.

సూర్య రోష్ని రూ.25 కోట్ల పెట్టుబడులు

హైదరాబాద్ : ప్రముఖ విద్యుత్ పరికరాల కంపెనీ సూర్య రోష్ని కొత్తగా కేబుల్స్ విభాగంలోకి ప్రవేశిస్తున్నట్లు ప్రకటించింది. ఇందుకోసం రూ.25 కోట్ల పెట్టుబడి వ్యయాలను చేస్తున్నామన్నారు. మూడు లక్షలకు పైగా రిటైలర్ల నెట్‌వర్క్‌తో విస్తరస్తున్నామన్నారు. టర్బో ఎఫ్‌ఆర్, టర్బో ఎఫ్‌ఆర్‌ఎల్‌హెచ్ వేరియంట్లలో కేబుల్స్‌ను అందిస్తున్నట్లు పేర్కొంది. ఏడు రంగులలో, అధిక ఇన్సులేషన్ నిరోధకతతో భద్రత అందిస్తోన్నామని సూర్య రోష్ని లిమిటెడ్ ఛైర్మన్ జెపి అగర్వాల్ తెలిపారు.

సంపాదకీయం

ఎరువు కరువు

ఖరీఫ్ రైతుకు అదనకు అవసరమైన యూరియా పుట్టని దుస్థితి దాపురించడం 'డబుల్ ఇంజిన్' సర్కార్ తలకెత్తుకున్న విధానాల తాలూకు దుష్పరిణామం. ఎరువులపై రైతులకు ఇచ్చే సబ్సిడీని భారంగా భావించిన కేంద్ర బిజెపి ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులను దిగ్గోసి, తన దుర్మార్గం నుంచి రైతుల దృష్టి మళ్లించేందుకు పర్యావరణం, ప్రజల ఆరోగ్యం అనే సుభాషితాలను లంకించుకుంది. ప్రకృతి సేద్యం, సేంద్రియ సాగు, జీవ ఎరువుల ముసుగులో రాష్ట్రాల ఎరువుల కేటాయింపులకు కోతలు విధించింది. గతేడాది అమ్మకాలపై పది శాతం కేటాయింపులు కత్తిరించింది. మన రాష్ట్రంలో నిరుడు 39 లక్షల టన్నుల అమ్మకాలు జరగ్గా 35 లక్షల టన్నులకు ఈ ఏడాది కేటాయింపులు కుదించబడ్డాయి. నాలుగు లక్షల టన్నులు తగ్గిపోయాయి. కేంద్రంలో, రాష్ట్రంలో 'డబుల్ ఇంజిన్' సర్కార్ అని పరవశించిపోతున్న టిడిపి కూటమి కేంద్రం ఎరువుల కేటాయింపులను తగ్గిస్తే మారు మాట్లాడకుండా తలాడించింది. ఎ.పి.కి చెందిన కేంద్ర మంత్రులు, ఎన్‌డిఎ ఎంపిలు ప్రధాని మోడీని మాటమాత్రం అడగలేదు. అన్యాయం జరిగితే ప్రశ్నిస్తాననే జనసేన అధినేత, డిప్యూటి సిఎం పవన్ నోరు మెదపలేదు. వ్యవసాయ రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌కు, ఇక్కడి రైతాంగానికి మోడీ ప్రభుత్వం అన్యాయం తలపెట్టినా కూటమి నేతలు చోద్యంచూస్తూ తమది 'మంచి ప్రభుత్వం' అనడం సుతరాం నప్పదు.

ఏటికేడు ఐదు నుంచి పది శాతం ఎరువుల వినియోగం పెరుగుతున్న విషయం తెలియనిది కాదు. ఆ మేరకు కేంద్రం కేటాయింపులు పెంచాల్సిందిపోయి కుదించడటం సేద్యాన్ని, రైతులను ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం చేయడమే. 2024 ఖరీఫ్‌లో ఎ.పి. యూరియా వినియోగం 6.32 లక్షల టన్నులు కాగా 2025లో 6.22 లక్షల టన్నులకు కేటాయింపు తగ్గింది. నెలనెలా కేటాయింపులు, వచ్చినది చూస్తే కోత ఇంకా ఎక్కువే. ఉదాహరణకు జులైలో 3.05 లక్షల టన్నుల యూరియా రావాల్సి ఉండగా 2.85 లక్షల టన్నులే వచ్చాయి. ఈ కోతలు ఒక వైపు కొనసాగుతుండగా, గతేడాది ఖరీఫ్‌లో ఎప్పటి కంటే నైరుతి రుతుపవనాలు ఈ మారు మే 26న రాష్ట్రంలోకి ప్రవేశించడంతో సీజన్ నెల రోజులు ముందుకొచ్చింది. రాయలసీమ, మరికొన్ని ప్రాంతాల్లో రైతులు ముందస్తుగా పంటలు సాగు చేయడంతో ఒక్కసారిగా యూరియాకు డిమాండ్ వచ్చింది. ధరలు, తెగుళ్లు, నీటి సదుపాయం ఇత్యాది కారణాలతో రైతులు పంటలను మారుస్తున్నారు. యూరియా డిమాండ్‌కు పంటల సరళిలో చోటు చేసుకున్న మార్పులు కొంత వరకు కారణం. కేంద్రం కోతలను మేనేజ్ చేసే పనిలో వ్యవసాయశాఖ తలమునకలై ఈ పరిస్థితులను అంచనా వేయలేకపోయింది. ఇవన్నీ కలిసి ఖరీఫ్ రైతును ఎరువుల కోసం రోడ్డెక్కేలా చేన్నాయి.

ఎరువులు అందుబాటులో ఉన్నాయని కొరత లేదని ప్రభుత్వం ఎంతగా మభ్యపెట్టాలని ప్రయత్నించినా ఆ ప్రచారంలో నిజం లేదనడానికి పెద్ద పెద్ద క్యూలైన్లలో గంటల కొలది పడిగాపులు పడుతున్న అన్నదాత అవస్థలు కళ్లకుకడుతున్నాయి. సగం జిల్లాల్లో యూరియా, డిఎపి లభ్యత అవసరం కంటే తక్కువగా ఉందని ప్రభుత్వ గణాంకాలే వెల్లడిస్తున్నాయి. ప్రభుత్వం డిబిటి లెక్కలతో పొంతన లేకుండా మాట్లాడుతోంది. మార్క్‌ఫెడ్ వద్ద బఫర్ స్టాక్ అంటున్నా ఎటు తరలుతున్నాయో తెలీదు. పిఎసిఎస్‌లు, ఇతర ప్రభుత్వ సంస్థలకు చేరిన ఎరువులు స్థానిక అధికార కూటమి నేతల అదుపులోకి వెళుతున్నాయి. ఇదే అదనుగా ప్రైవేటు డీలర్లు బ్లాక్ చేసి అధిక ధరలకు అమ్ముతున్నారు. వేరే ఎరువుకు లింక్ పెట్టి సొమ్ము చేసుకుంటున్నారు. కేంద్ర ప్రభుత్వమే పెద్ద ఎత్తున నానో ఎరువులను అంటగట్టడంతో వాటిని వదిలించుకునేందుకు తంటాలు పడుతున్నారు. క్షణాల్లో సమాచారం అందించే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, వాట్సాప్, రియల్ టైం గవర్నెన్స్‌లు, డాష్ బోర్డులు రైతుల యూరియా కష్టాలను ఎందుకు పసిగట్టలేకపోతున్నాయో ముఖ్యమంత్రికి, ప్రభుత్వానికే తెలియాలి. టిడిపి కూటమి ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి చేసి రాష్ట్రానికి అవసరమైన ఎరువులను సాధించడమే సమస్యకు పరిష్కారం. శాస్త్రీయంగా రుజువుకాని, రైతులు ఇష్టపడని నానో ఎరువులను తిరస్కరించాలి. రైతులకు మేలు చేసే విధంగా వ్యవసాయశాఖతో పని చేయించాలి. సన్నద్ధతే ఎరువుల వెతల నుంచి అన్నదాతలకు ఉపశమనం.

మహనీయుల మాట




ప్రజల చైతన్యంలో మనం నాటిన విత్తనాలు మొలకెత్తకుండా ఎల్లకాలం ఉండబోవు.

- సాల్వడార్ అలెండీ,

అమెరికా కుట్రలకు బలైన చిలీ అధ్యక్షుడు, కమ్యూనిస్టు నేత.

పెట్టుబడిదారీ ప్రపంచాన్ని ముంచనున్న ట్రంప్ సుంకాలు

ట్రంప్ సుంకాల బాదుడు గురించి మీడియా అదేదో మామూలుగా జరిగే వ్యవహారమే అన్నట్టు యథాలాపంగా చర్చిస్తోంది. ఆ సుంకాల విధింపు ఏ ప్రత్యేక నేపథ్యంలో జరుగుతోందో దానిని పట్టించుకోవడం లేదు. ఇప్పుడు తాను పెంచిన సుంకాల ద్వారా సమకూరే అదనపు ఆదాయాన్ని ఉపయోగించి అమెరికా అదనపు సరుకులను గాని సేవలను గాని కొనుగోలు చేయబోవడం లేదు. దాని గురించి దిగువ వివరిస్తాను. ట్రంప్ పెంచిన సుంకాల ప్రభావం వలన ఇంతవరకూ అమెరికాకు తమ దేశాల సరుకులను ఎగుమతి చేస్తున్న దేశాలు ఇకపైన అదే మోతాదులో ఎగుమతి చేయలేవు. ఆ యా దేశాలు ఎంత మేరకు ఎగుమతి మార్కెట్లను కోల్పోయాయో ఆ మేరకు తమ తమ దేశాల్లో అంతర్గత మార్కెట్లను ఇప్పుడు విస్తరించేలా చర్యలు తీసుకోలేవు. అలా చేయాలంటే ఆ దేశాల ప్రభుత్వాలు అదనపు వ్యయాన్ని చేయాలి. అందుకోసం తమ బడ్జెట్ లో ద్రవ్యలోటునైనా పెంచాలి లేదా తమ దేశాలలోని ధనవంతుల మీద అదనపు పన్నులనైనా వేయాలి. ఈ రెండింటిలో ఏది చేసినా అది అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడికి ఆమోదయోగ్యం కాదు. ఇప్పుడు ఆ అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ఆదేశాలను ధిక్కరించగల స్థితిలో ఈ దేశాలు లేవు. అమెరికా చేపట్టిన 'రక్షణాత్మక' చర్యల ఫలితంగా మొత్తంగా ప్రపంచ స్థూల డిమాండ్ కుదించుకుపోతుంది. దాని వలన ప్రస్తుతం ఉన్న ఆర్థిక సంక్షోభం మరింత తీవ్రతరమౌతుంది. ట్రంప్ సుంకాలు అమెరికాలో దేశీయ ఉత్పత్తుల మోతాదును కొంతవరకూ పెంచవచ్చు. దాని ఫలితంగా కొంత ఉపాధి కల్పన అక్కడ జరగవచ్చు. కాని అమెరికాతో సహా మొత్తం ప్రపంచ దేశాలన్నింటినీ కలిపి చూసినప్పుడు స్థూల ప్రపంచ డిమాండ్ ముడుచుకుపోతుంది కనుక ప్రపంచ ఆర్థిక సంక్షోభం మరింత ముదిరిపోతుంది. ఈ ప్రపంచ స్థూల డిమాండ్ ఏ విధంగా ట్రంప్ సుంకాల పర్యవసానంగా పడిపోతుందో ఇప్పుడు చూద్దాం.



ప్రభాత్ పట్నాయక్



> **అమెరికా చేపట్టిన 'రక్షణాత్మక' చర్యల ఫలితంగా మొత్తంగా ప్రపంచ స్థూల డిమాండ్ కుదించుకు పోతుంది. దాని వలన ప్రస్తుతం ఉన్న ఆర్థిక సంక్షోభం మరింత తీవ్రతరమౌతుంది. ట్రంప్ సుంకాలు అమెరికాలో దేశీయ ఉత్పత్తుల మోతాదును కొంతవరకూ పెంచవచ్చు. దాని ఫలితంగా కొంత ఉపాధి కల్పన అక్కడ జరగవచ్చు. కాని అమెరికాతో సహా మొత్తం ప్రపంచ దేశాలన్నింటినీ కలిపి చూసినప్పుడు స్థూల ప్రపంచ డిమాండ్ ముడుచుకుపోతుంది కనుక ప్రపంచ ఆర్థిక సంక్షోభం మరింత ముదిరిపోతుంది.**

ఏదైనా ఒక దేశం తాను దిగుమతి చేసుకునే సరుకుల మీద సుంకాలను పెంచినప్పుడు అలా దిగుమతయ్యే సరుకుల రేట్లు ఆ దేశంలో పెరుగుతాయి. అదే మోతాదులో ఆ దేశంలోని వేతనాలు మాత్రం పెరగవు. అందుచేత దిగుమతి చేసుకునే బదులు తమ దేశంలోనే ఆ సరుకులను ఉత్పత్తి చేయడానికి కొంత ప్రయత్నం జరుగుతుంది. దిగుమతి సుంకాలను పెంచినంత మాత్రాన అన్ని దిగుమతులూ నిలిచిపోవు, కొన్ని సరుకుల దిగుమతులు మాత్రం నిలిచిపోతాయి. సుంకాలు పెంచిన అనంతరం కూడా దిగుమతయ్యే సరుకుల మీద వసూలు చేసే అదనపు సుంకాల వలన ఆ సరుకుల రేట్లు పెరుగుతాయి. వాటిని కొనుగోలు చేసేవారిలో అత్యధికులు శ్రామిక ప్రజలే. అంటే దిగుమతులమీద అదనపు సుంకాలను విధించినందు వలన ప్రభుత్వానికి ఆదాయం పెరుగుతుంది. అదే సమయంలో శ్రామిక ప్రజల కొనుగోలు శక్తి ఆమేరకు పడిపోతుంది.

ప్రభుత్వానికి అదనపు సుంకాల ద్వారా సమకూరే ఆదాయాన్ని గనుక ఆ ప్రభుత్వం తిరిగి ఖర్చు చేసేస్తే, అప్పుడు ప్రభుత్వ ఖర్చు, శ్రామిక ప్రజానీకపు ఖర్చు కలిపి లెక్కించినప్పుడు తేడా రాదు. సుంకాల పెంపుకు ముందు ఉన్నట్టే ఇప్పుడూ ఉంటుంది. ప్రభుత్వం కనుక అలా ఖర్చు చేయకపోతే, అప్పుడు శ్రామిక ప్రజల కొనుగోలు శక్తి పడిపోయిన మేరకు ఆ దేశపు స్థూల డిమాండ్ తగ్గుతుంది. ఇప్పుడు అమెరికాలో ట్రంప్ అదనపు సుంకాల ద్వారా వచ్చే ఆదాయాన్ని తిరిగి ఖర్చు చేయబోవడం లేదు. అందుచేత అమెరికాలో స్థూల డిమాండ్ తగ్గుతుంది.

ప్రస్తుతం ట్రంప్ అమెరికన్ బడా సంపన్నులకు భారీగా పన్ను రాయితీలను ప్రకటిస్తున్నాడు. ఇప్పుడు అదనపు సుంకాల ద్వారా వచ్చే ఆదాయాన్ని ఆ రాయితీల నిమిత్తం ఖర్చు చేయబోతున్నాడు. అంటే ఈ ఆదాయం బడ్జెట్ ద్రవ్యలోటును తగ్గించడానికి వాడతారే తప్ప ప్రభుత్వ ఖర్చును పెంచడానికి మాత్రం కాదు. అంటే అమెరికా దిగుమతి సుంకాలను పెంచి ఆర్జించే ప్రతీ డాలరూ ఆ మేరకు అమెరికాలో స్థూల డిమాండ్‌ను తగ్గించి వేస్తుంది. అమెరికాలో తగ్గే డిమాండ్‌ను భర్తీ చేయడానికి ప్రపంచంలో మరే దేశంలోనైనా ప్రభుత్వ వ్యయాన్ని పెంచుతారా అంటే అదీ సాధ్యం కాదు. అందుచేత మొత్తంగా ప్రపంచాన్ని ఒక యూనిట్‌గా తీసుకున్నప్పుడు స్థూల డిమాండ్ స్థాయి దిగజారిపోతుంది. దాని ఫలితంగా ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ఆర్థిక మాంద్యం మరింత తీవ్రంగా మారుతుంది.

అమెరికాలో దేశీయంగా ఉత్పత్తులు కొంతమేరకు పెరగవచ్చు. దిగుమతులు తగ్గుతాయి కనుక అందులో కొంతమేరకైనా భర్తీ చేసుకోడానికి ఆ విధంగా దేశీయ ఉత్పత్తి పెరగవచ్చు. కాని అది అక్కడ తగ్గిపోయే దిగుమతుల కన్నా ఎక్కువగా ఏమీ పెరిగిపోదు. అమెరికాలో మాంద్యం కొంత తగ్గుముఖం పట్టొచ్చు కాని ప్రపంచం మొత్తంగా చూసుకున్నప్పుడు ఆర్థిక కార్యకలాపాలు తగ్గుముఖం పట్టక తప్పదు.

ఇప్పుడు అమెరికా అనుసరిస్తున్న విధానం వలన అమెరికాలో కొంత ఉపాధి కల్పన జరగొచ్చు కాని ఇతర దేశాల్లో నిరుద్యోగం పెరుగుతుంది. అంటే అమెరికా తన నిరుద్యోగాన్ని ఇతర దేశాలకు ఎగుమతి చేస్తోందన్నమాట. నిజానికి ఇది కేవలం అంతవరకే పరిమితం కాదు కూడా. ఉదాహరణకు అమెరికా సుంకాలను పెంచిన ఫలితంగా, దిగుమతులు తగ్గి, వాటిని భర్తీ చేయడానికి తన దేశంలోనే వాటిని ఉత్పత్తి చేయడానికి పూనుకుందనుకుందాం. అప్పుడు అమెరికాలో పెరిగే ఉత్పత్తి 100 పాయింట్లు ఉంటే, తక్కిన ప్రపంచంలో తగ్గిపోయే ఉత్పత్తి 100కే పరిమితం కాదు. అది 120 లేదా 150 పాయింట్ల దాకా ఉంటుంది. అందుచేత వాస్తవానికి అమెరికాలో ఉత్పత్తి కార్యకలాపాలు పెరిగిన మేరకు మించి ప్రపంచం మొత్తం మీద తగ్గుదల ఉంటుంది.

అమెరికా విధించిన సుంకాలకు ప్రతీకారంగా మరికొన్ని దేశాలు తమ సుంకాలను కూడా పెంచవచ్చు. కాని అలా పెంచినంత మాత్రాన ప్రపంచ స్థూల డిమాండ్ తగ్గుదల నిలిచిపోదు. ఈ దేశాలన్నీ దాదాపుగా నయా ఉదారవాద చట్రానికి లోబడే వ్యవహరిస్తున్నాయి. అవి తాము పెంచిన సుంకాల వలన వచ్చిన అదనపు ఆదాయాలను ద్రవ్య లోటును తగ్గించుకోడానికి మళ్ళిస్తాయి. లేకపోతే, తమ దేశాల్లోని సంపన్నులకు మరింత రాయితీలను కల్పించడానికి ఖర్చు చేస్తాయి. అంతే తప్ప దేశీయ డిమాండ్ ను పెంచేలా ఖర్చు చేయవు. ఆ దేశాలలో అటు దేశీయ కార్మికుల కొనుగోలుశక్తీ పడిపోతుంది (ఎగుమతులు తగ్గిపోయి ఉపాధి తగ్గినందువలన). ఇటు దేశీయ వ్యయమూ పెరదు. దాని ఫలితంగా ప్రపంచ స్థూల డిమాండ్ మరింత పడిపోతుంది. ప్రతీకార సుంకాల విధింపు ద్వారా ఆ యా దేశాలు తమ అమెరికా ఎగుమతులను తగ్గించుకుని ఆ మేరకు ఉత్పత్తిని దేశీయ మార్కెట్ లోకి మళ్ళించగలుగుతాయేమో కాని ప్రపంచ పెట్టుబడిదారీ మార్కెట్ మొత్తం మీద చూసినప్పుడు మాత్రం డిమాండ్ తగ్గిపోయి నయా ఉదారవాద ఆర్థిక సంక్షోభం మరింత తీవ్రతరం కాక మానదు.

ప్రస్తుతం మీడియాలో జరుగుతున్న చర్చ అంతా డిమాండ్‌ను అమెరికా నుండి దేశీయంగా మళ్ళించడం అన్న అంశం మీదనే సాగుతోంది తప్ప ప్రపంచ పెట్టుబడిదారీ మార్కెట్ మొత్తంగా ఏం కానున్నది అన్న దాని మీద లేదు. అదనపు సుంకాల ద్వారా ప్రభుత్వానికి ఒనగూడే అదనపు ఆదాయాన్ని ఆ ప్రభుత్వం ప్రజల మధ్య ఖర్చు చేసినప్పుడు మాత్రమే దేశీయ డిమాండ్ ఆ మేరకు పెరుగుతుంది తప్ప అలా ఖర్చు చేయకుండా ద్రవ్య లోటును భర్తీ చేయడానికో లేక సంపన్నులకు మరిన్ని రాయితీలను కల్పించడానికో ఖర్చు చేస్తే అప్పుడు మొత్తంగా ప్రపంచ డిమాండ్ ముడుచుకుపోతుంది.

ఇప్పుడు పెట్టుబడిదారీ ప్రపంచానికి నాయకుడిగా అమెరికా ఉంది. అందుచేత ప్రపంచ ఆర్థిక సంక్షోభాన్ని అధిగమించే మార్గాలను అన్వేషించి ఆ దారిన ముందు అమెరికా నడుస్తుందని, తన వెంట తక్కిన సంపన్న పెట్టుబడిదారీ దేశాలను తీసుకుపోతుందని ఉదారవాద బూర్జువా ఆర్థిక పండితులు భావిస్తున్నారు. 1930 దశకంలో నెలకొన్న సంక్షోభ సమయంలో జె.ఎం.కీన్స్ సంపన్న పెట్టుబడిదారీ దేశాల నుండి అటువంటి ఉమ్మడి ప్రయత్నాన్నే ఆశించాడు. కాని ఇప్పుడు తక్కిన పెట్టుబడిదారీ ప్రపంచాన్ని పట్టించుకోకుండా అమెరికా మాత్రం తన వరకూ తాను ఈ సంక్షోభం నుండి ఏ విధంగానైనా బైట పడాలని ప్రయత్నిస్తోంది. అందుకోసం తక్కిన పెట్టుబడిదారీ ప్రపంచం మీద వత్తిడి పెంచుతోంది. ఈ వత్తిడి ముఖ్యంగా మూడవ ప్రపంచం లోని పెట్టుబడిదారీ దేశాల మీద ఎక్కువగా పెంచుతోంది. "మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్" అని ట్రంప్ ఇచ్చిన నినాదం పెట్టుబడిదారీ ప్రపంచం సంక్షోభం నుండి బైట పడేందుకు దారి చూపదు సరికదా, అది అమెరికా వరకూ సంక్షోభం నుండి బైటపడి, తక్కిన దేశాలు, ముఖ్యంగా మూడవ ప్రపంచ దేశాలు మరింత సంక్షోభంలోకి కూరుకుపోవడానికి దారి తీస్తుంది.

ట్రంప్ దుర్మార్గుడు అయినందువల్లో లేదా అతడు మూర్ఖుడు అయినందువల్లో ఈ విధంగా వ్యవహరిస్తున్నాడు అని అనుకోకూడదు. అతడు పెట్టుబడిదారీ సహజ న్యాయానికి అనుగుణంగానే వ్యవహరిస్తున్నాడు. ఉదారవాద బూర్జువా ఆర్థిక పండితులు ఏదో ఆశాజనకమైన స్థితిని ఊహించుకుంటున్నారు కాని వారికి ఈ వాస్తవం పట్టినట్టు లేదు. పెట్టుబడిదారీ వ్యవస్థ ఒక ప్రణాళికాబద్ధ విధానానికి లోబడి నడుచుకునేది కాదు. ఇప్పుడు ఎదుర్కొంటున్న సంక్షోభానికి ఏదైనా ఒక "హేతుబద్ధ" పరిష్కారం ఉందనుకున్నా ఆ పరిష్కారానికి అది కట్టుబడదు. అందుచేత అమెరికా ఈ సంక్షోభ సమయంలో తన దారేదో తాను చూసుకుంటోంది.

అందుకోసమే అమెరికా వివిధ దేశాలతో జరుపుతున్న వాణిజ్య సుంకాల చర్చల్లో, ముఖ్యంగా మూడవ ప్రపంచ దేశాలతో జరుపుతున్న చర్చల్లో పలు డిమాండ్లను ముందుకు తెస్తోంది. తాను అధిక సుంకాలు విధిస్తానని ప్రకటించిన ఏ దేశమైనా అమెరికన్ సరుకులను 'జీరో' సుంకంతో దిగుమతి చేసుకోడానికి ఒప్పుకుంటే ఆ దేశం మీద సుంకాలను తగ్గిస్తానని బేరమాడుతోంది. ఈ పద్ధతిలో అది పలు దేశాలతో కొత్తగా ఒప్పందాలు కుదుర్చుకుంటోంది.


కాని అటువంటి ఒప్పందాల వలన మూడవ ప్రపంచ దేశాలు వినాశకర పర్యవసానాలను చవిచూడవలసి వస్తుంది. ఇండియా వరకు చూసుకుంటే మన దేశం గనుక అమెరికన్ డెయిరీ ఉత్పత్తులు, బాదం పప్పు, పిస్తా, కొన్ని రకాల ఫలాలు వంటివి జీరో సుంకంతో దిగుమతి చేసుకోడానికి అంగీకరిస్తే అప్పుడు అమెరికా మన దేశం నుంచి దుస్తులు, వజ్రాలు, ఆభరణాలు, ఫార్మాస్యూటికల్స్ వంటి సరుకుల దిగుమతుల మీద సుంకాలను తగ్గించవచ్చు. అప్పుడు భారతీయ రైతాంగం అమెరికా నుండి వచ్చిపడే వ్యవసాయ ఉత్పత్తుల పోటీకి తట్టుకోలేక కుదేలౌతారు. అమెరికన్ రైతాంగం మన రైతులకన్నా ఎందులోనూ గొప్పగా పొడిచేసిందేమీ లేదు కాని వాళ్ళకి అమెరికన్ ప్రభుత్వం భారీగా సబ్సిడీలు ఇస్తుంది. ప్రపంచ వాణిజ్య సంస్థ తక్కిన దేశాలు సబ్సిడీలు ఇవ్వడానికి అభ్యంతరం చెప్పింది కాని అమెరికా ఇచ్చే సబ్సిడీలను మాత్రం ఆమోదించింది.

ఇప్పుడు నయా ఉదారవాద విధానాలు మన దేశాన్ని ఒక మూలకు నెట్టాయి. ఇప్పుడు మన దేశం అటు రైతుల ప్రయోజనాలనైనా బలి చేయాలి లేదా ఫార్మా, ఆభరణాల తయారీ, వజ్రాల తయారీ వంటి రంగా ప్రయోజనాలనైనా బలి చేయాలి. ఏది జరిగినా మన దేశానికి నష్టమే. అందుచేత అసలు ఈ నయా ఉదారవాద చట్రం నుండి మొత్తంగానే మన దేశాన్ని బైటకు తెచ్చుకుని ఇప్పుడున్న చిక్కు పరిస్థితుల నుండి విముక్తి చేయాలి. అదే మార్గం.

(స్వేచ్ఛానుసరణ)

విశ్లేషణ

సహకారం నుండి సంపద!



గత మూడు సంవత్సరాల నుండి మోడీ ప్రభుత్వం 'సహకార్ సే సమృద్ధి', 'ప్రాస్పరిటీ త్రూ కోపరేషన్' నినాదాలు ఇస్తోంది. తెలుగులో ఇది 'సహకారం నుండి సంపద'గా మారుతుంది. ఇటీవల కేంద్ర సహకార శాఖా మంత్రి అమిత్ షా విడుదల చేసిన జాతీయ సహకార విధానం దీనికనుగుణంగానే ఉంది. రెండున్నర సంవత్సరాల క్రితం కేంద్ర ప్రభుత్వం రూపొందించిన మోడల్ బైలాస్ (నమూనా నియమావళి)కు నకలుగా జాతీయ సహకార విధానం కనిపిస్తుంది. కేవలం స్వల్పకాలిక, దీర్ఘకాలిక వ్యవసాయ రుణాల మీద వచ్చే ఆదాయంతో ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘాలు దృఢంగా నిలబడలేవని కేంద్ర ప్రభుత్వం చెప్తోంది. ప్రస్తుతం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు (పి.ఎ.సి.ఎస్ లు) నిర్వహిస్తున్న ఆర్థిక కార్యకలాపాలకు వాటి బైలాస్ (నియమావళి) ఆటంకాలు కల్పిస్తున్నాయని, అవి దశాబ్దాల కిందటివని, వాటిని తిరగ రాయాల్సిన అవసరముందని, రాష్ట్ర ప్రభుత్వాలకు పంపిన లేఖలలో పేర్కొంది.



పి.అజయ కుమార్

మోడీ ప్రభుత్వం సహకార రంగం పట్ల కేంద్రీకృత లక్ష్యంతో వ్యవహరిస్తోంది. 2021 జులై 6న సహకార మంత్రిత్వ శాఖను కొత్తగా ఏర్పాటు చేసి, అమిత్ షా కు ఆ శాఖ పగ్గాలు అప్పగించిన నాటి నుండి, తను అనుకున్న లక్ష్యాన్ని సాధించే దిశగా వేగం పెంచింది. సహకారం నుండి వచ్చే సంపద ఎవరి కోసం? ఎవరికి దక్కుతుంది? అనేది కీలకం. రాజ్యాంగం రాష్ట్రాల హక్కుగా ఇచ్చిన సహకారాన్ని బిజెపి ప్రభుత్వం తన చేతుల్లోకి తీసుకుంటోంది. బిజెపి పాలిత రాష్ట్రాలు, బిజెపి కి మద్దతు ఇచ్చే రాష్ట్రాలు, కేంద్ర సహకార శాఖ పంపించే ఆదేశాలన్నింటిని కిందికి పంపిస్తూ ఆచరణకు పూనుకుంటున్నాయి. బిజెపి యేతర ప్రభుత్వాలు కూడా దీనిపై సరైన విధంగా స్పందించడంలేదు. కేరళ ఒక్కటే దీనికి మినహాయింపు.

రాష్ట్రంలో టిడిపి నాయకత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం, అంతకు ముందటి వైసిపి ప్రభుత్వం...మోడీ ప్రభుత్వ ఆదేశాలను ఇచ్చినవి ఇచ్చినట్లుగా అమలు జరుపుతున్నాయి. 2023లో వైసిపి ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వ 'సహకార్ సే సమృద్ధి" మార్గదర్శకాలను అనుసరిస్తూ, రాష్ట్ర స్థాయిలో రాష్ట్ర సహకార అభివృద్ధి కమిటీ (ఎస్.సి.డి.సి), జిల్లా స్థాయిలో జిల్లా సహకార అభివృద్ధి కమిటీలు (డి.సి.డి.సి) ఏర్పాటు చేసింది. టిడిపి ప్రభుత్వం 2024 అక్టోబర్ 25న జీవో 670 జారీ చేసి, జిల్లా సహకార అభివృద్ధి కమిటీలకు సబ్ కమిటీలుగా, జాయింట్ వర్కింగ్ కమిటీలను ఏర్పాటు చేయాల్సిందిగా జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు ఇచ్చింది. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం, ప్రతి గ్రామ పంచాయితీ పరిధిలో ఒక సహకార సంఘం ఉండాలి.

> **2021 జులై 6న సహకార మంత్రిత్వ శాఖను కొత్తగా ఏర్పాటు చేసి... అమిత్ షా కు ఆ శాఖ పగ్గాలు అప్పగించిన నాటి నుండి... తను అనుకున్న లక్ష్యాన్ని సాధించే దిశగా వేగం పెంచింది. సహకారం నుండి వచ్చే సంపద ఎవరి కోసం? ఎవరికి దక్కుతుంది? అనేది కీలకం. రాజ్యాంగం రాష్ట్రాల హక్కుగా ఇచ్చిన సహకారాన్ని బిజెపి ప్రభుత్వం తన చేతుల్లోకి తీసుకుంటోంది. బిజెపి పాలిత రాష్ట్రాలు, బిజెపి కి మద్దతు ఇచ్చే రాష్ట్రాలు, కేంద్ర సహకార శాఖ పంపించే ఆదేశాలన్నింటినీ కిందికి పంపిస్తూ ఆచరణకు పూనుకుంటున్నాయి. బిజెపి యేతర ప్రభుత్వాలు కూడా దీనిపై సరైన విధంగా స్పందించడంలేదు. కేరళ ఒక్కటే దీనికి మినహాయింపు.**

అన్నింటిలోకి కీలకమైనవి కేంద్ర ప్రభుత్వం పంపిన మోడల్ బైలాస్. అన్ని సహకార సంఘాలు వీటిని ఆమోదించేలా రాష్ట్ర ప్రభుత్వాలు చూడాలి. ఈ బైలాస్ ప్రకారం సంఘం పేరులో వ్యవసాయ పరపతి అనే మాట ఉండదు. 'ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘం' 'బహుళ ప్రయోజన ప్రాథమిక గ్రామీణ సహకార సంఘం'గా మారుతుంది. సహకార సంఘ సభ్యులు రెండు తరగతులుగా విభజించబడతారు. 'ఎ' క్లాస్ సభ్యులకు మాత్రమే జనరల్ బాడీలకు హాజరయ్యే, నిర్ణయాలలో భాగస్వామ్యం పొందే, డైరెక్టర్లుగా పోటీ చేసే అధికారం, ఓటింగ్ హక్కులు ఉంటాయి. 'బి' క్లాస్ సభ్యులకు ఎటువంటి హక్కులూ ఉండవు.

'ఎ' క్లాస్ సభ్యులు కావటానికి వ్యవసాయ భూమి లేదా వ్యవసాయ అనుబంధ కార్యకలాపాలు నిర్వహించే భూమి ఉండాలి. 'ఎ' క్లాస్ సభ్యులు మాత్రమే వాటాదారులుగా ఉంటారు. వీరిలో ఎవరికైనా మొత్తం షేర్ ధనంలో వాటాగా 20 శాతం వరకు ఉండవచ్చు. వీరి చెప్పుచేతల్లోకి సహకార సంఘాలు ఉండబోతున్నాయని వేరేగా చెప్పనక్కర్లేదు. వ్యవసాయ భూమిగల రైతులు 'ఎ' క్లాస్ సభ్యులు.

వ్యవసాయ అనుబంధ రంగం అంటే ఏమిటి? వ్యవసాయ అనుబంధ రంగం అంటే వివిధ ప్రయోజనాల కోసం వ్యవసాయ రంగంపై ఆధారపడిన రంగం. ఈ రంగంలో వ్యవసాయ ఉత్పత్తులను ముడి సరుకులుగా ఉపయోగించే పరిశ్రమలు, వ్యవసాయ రంగానికి సేవలు అందించే పరిశ్రమలు ఉన్నాయి. అనుబంధ రంగాలు అంటే వ్యవసాయ ఉత్పత్తుల ప్రాసెసింగ్, మార్కెటింగ్‌లో పాల్గొనే సంస్థలు, పరిశ్రమలు ఉంటాయి. అదానీ, అంబానీ, గాడ్రెజ్, ఆదిత్య బిర్లా, మోన్‌శాంటో, జువారి, ర్యాలీస్, ఐటిసి, బ్రిటానియా వంటి గుత్త సంస్థలతో పాటు అనేక పెద్ద కంపెనీలు వ్యవసాయ అనుబంధ కార్యకలాపాలలో ఉన్నాయి. ఇంత పెద్ద కంపెనీలకు, 'బహుళ ప్రయోజన ప్రాథమిక గ్రామీణ సహకార సంఘం'తో పనేంటి?

బహుళ ప్రయోజన సహకార సంఘంలో గ్రామీణ ఆర్థిక కార్యకలాపాలు మొత్తం కేంద్రీకరించబడతాయి. వీటిలో 'మీ సేవ', 'ఈ సేవ'లు అందించిన అనేక కార్యకలాపాలతో పాటు గోడౌన్ల ఏర్పాటు, ఆహార ధాన్యాల సేకరణ, ఎరువులు, విత్తనాలు, పెట్రోల్, డీజిల్, గ్యాస్ డీలర్‌షిప్, వ్యవసాయ రుణాలు, సామూహిక వ్యవసాయం, స్కూళ్ళు, కాలేజీలు, ఆస్పత్రులు, డిస్పెన్సరీలు, చౌక ధరల దుకాణాలు, పాస్‌పోర్టు సేవలు, అన్ని రకాల టిక్కెట్ల బుకింగ్, బిల్లుల చెల్లింపులే కాక వీటిలో లేని వ్యాపారం అంటూ ఏదీ ఉండదు. బహుళ ప్రయోజన సహకార సంఘాలు సభ్యుల ప్రయోజనాల కోసం మార్కెటింగ్ కార్యకలాపాలను సొసైటీ పరిధి లోపల, సొసైటీ పరిధి బయట నిర్వహిస్తాయి. ఆస్తుల సృష్టికి పనిచేస్తాయి. లక్ష్యాల సాధనలో ఇతర వ్యాపారాల నిర్వహణకు అవసరమైన ఆర్థిక మద్దతు ఇస్తాయి.

'బి' క్లాస్ సభ్యులలో స్వయం సహాయక గ్రూపులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు, గ్రామీణ చేతి వృత్తిదారులు, చిన్న వ్యాపారస్తులు ఉంటారు. వీరికి వ్యవసాయేతర రుణాలు మాత్రమే ఇస్తారు. అంటే కౌలు రైతులకు వ్యవసాయ రుణాలు ఉండవు. వ్యవసాయేతర రుణాల వ్యాపారంలో వచ్చే ఆదాయం నుండి కొద్ది భాగం వీరికి ప్రోత్సహకంగా ఇస్తారు.

ప్రధానంగా ఈ సొసైటీలు వ్యవసాయ ఉత్పత్తిదారుల సంఘాలు (ఎఫ్.పి.ఓ లు) ఏర్పాటు చేస్తాయి. సామూహిక వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తాయి. 'ఎ' క్లాస్ సభ్యులుగా ఉండి వ్యవసాయ అనుబంధ కార్యకలాపాలలో ప్రధాన పాత్ర పోషించే కంపెనీల చేతుల్లోకి సామూహిక వ్యవసాయం, వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ వెళ్లే ప్రమాదం ఉంది. బహుళ ప్రయోజన సహకార సంఘాలు నిర్వహించే మొత్తం వ్యాపార ప్రయోజనం, ఆర్థికంగా బలంగా ఉండే ధనిక రైతులకు, కార్యకలాపాల అధిపతులకు దక్కుతుంది. బహుళ ప్రయోజన సహకార సంఘం తన పరిధిలోని సభ్యులు, సభ్యులు కాని వారి సామాజిక, ఆర్థిక, వ్యాపార సంబంధిత సమాచారాన్ని సేకరిస్తుంది. విధానాల రూపకల్పనకు, వ్యవసాయం లేదా దాని సంబంధిత వ్యాపారం లేదా అభివృద్ధి ప్రణాళికకు ఉపయోగిస్తుంది. ఇంతకు ముందు మోడీ ప్రభుత్వం రద్దు చేసిన వ్యవసాయ నల్ల చట్టాలలో ఉన్న రైతు వ్యతిరేక అంశాలు బహుళ ప్రయోజన ప్రాథమిక గ్రామీణ సహకార సంఘాల ద్వారా అమలులోకి వస్తాయి.

ఆధునిక వ్యాపార నిర్వహణకు అవసరమైన విధంగా పి.ఎ.సి.ఎస్ లు అన్నిటినీ కంప్యూటరీకరించి ఆన్‌లైన్ లోకి తీసుకొచ్చారు. ఇక మోడల్ బైలాస్‌ను ఆమోదింపచేసి, వాటి ప్రకారం సంఘాలను నడపటమే తరువాయి. ఇప్పటి వరకు సహకార రంగాన్ని అన్ని పాలక పార్టీలు దివాళా తీయించాయి. విధానాల రూపకల్పన చేసి, రోజువారీ కార్యకలాపాలలో ప్రభుత్వాలు జోక్యం చేసుకోకూడదనే ప్రజాస్వామ్య పద్ధతికి తిలోదకాలు ఇచ్చాయి. సహకార సంఘాలను ప్రజాస్వామ్యయుతంగా నడిపే పేరుతో పరస్పర సహాయక సహకార సంఘాల చట్టాన్ని తెచ్చి, పాల డెయిరీలను కంపెనీలకు అప్పచెప్పారు. వ్యవసాయ పరపతి సంస్థలు మినహా మిగతా సహకార సంస్థలను చంద్రబాబు నాయుడు ప్రభుత్వం 25 సంవత్సరాల క్రితమే ప్రైవేటీకరించింది.

ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘాలు, డి.సి.సి.బి లు, ఆప్కాబ్ లకు 2013 తరువాత ఇంత వరకు ఎన్నికలు నిర్వహించలేదు. రాష్ట్ర (టిడిపి, వైసిపి) ప్రభుత్వాలు తమ రాజకీయ కార్యకర్తలను వ్యవసాయ పరపతి లోని మూడు దొంతరలలో పర్సన్ ఇన్‌చార్జిలుగా నియమిస్తున్నాయి. ఇప్పుడు ఈ రెండు ప్రభుత్వాలు మోడీ ప్రభుత్వం ఆడించినట్లు ఆడుతూ వ్యవసాయ సహకార రంగాన్ని ప్రైవేటీకరిస్తున్నాయి. పి.ఎ.సి.ఎస్ లు బహుళ ప్రయోజన సహకార సంఘాలుగా మారిన తరువాత, వాటితో పాటు డి.సి.సి.బి లు, ఆప్కాబ్ కూడా వ్యవసాయ అనుబంధ కార్యకలాపాలలో ఉన్న కార్పొరేట్ల చేతుల్లోకి పోతాయి. రైతు సంఘాలు, ఉద్యోగ సంఘాలు ఈ విధానాలను వ్యతిరేకించి సహకార రంగాన్ని కాపాడుకోవాలి.

/ వ్యాసకర్త సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు /

ఎలక్షన్ కమిషన్ ద్వంద్వ నీతి

- ఇసి తీరుపై కాంగ్రెస్ నిరసన ర్యాలీ

ప్రజాశక్తి–విజయనగరం కోట

ఓట్ల చోరీపై కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ ఆధారాలతో సహా బయటపెడితే చర్యలు తీసుకోవాల్సిన ఎన్నికల కమిషన్ ద్వంద్వ నీతి అవలంభిస్తోందంటూ ఇసి తీరుకు నిరసనగా కాంగ్రెస్ ఆధ్వర్యాన సోమవారం రాత్రి ర్యాలీ చేపట్టారు. మూడులాంతర్లు నుంచి గంటస్తంభం వరకు చేపట్టిన ఈర్యాలీని ఉద్దేశించి డిసిసి అధ్యక్షులు మరిపి విద్యాసాగం మాట్లాడారు. దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితాలో జరిగిన అవకతవకలపై తమ పార్టీ పోరాటం చేస్తోందన్నారు. 65 లక్షల ప్రతిపక్షాల ఓట్లను తొలగించిన ఎలక్షన్ కమిషన్‌ని రాహుల్ గాంధీ ప్రశ్నిస్తే క్షమాపణ చెప్పమంటారా? అఫిడవిట్ అడుగుతారా? అని ప్రశ్నించారు. దొంగ ఓట్లపై బిజెపి ఎంపీ అనురాగ్ ఠాగూర్! ఇసిని ప్రశ్నిస్తే క్షమాపణ కోరరా? అఫీడవిట్ అడగరా? అన్నారు. ఇదేమి న్యాయం జ్ఞానేశ్వర? ఈ ఎలక్షన్ కమిషన్ రాజ్యాంగ వ్యవస్థనా? లేదా బిజెపి జేబు సంస్థనా? అంటూ ప్రశ్నించారు.

బిజెపికి తొత్తుగా ఎలక్షన్ కమిషన్ వ్యవహరిస్తోందన్నారు. ఎన్నికల కమిషన్ తప్పిదాలకు నైతిక బాధ్యతగా వహించాలన్నారు. ఇసి జ్ఞానేశ్వర్, ఎలక్షన్ కమిషనర్లు సుఖ బీర్ సింగ్ సందు, వివేక్ జోషి రాజీనామా చేయాలన్నారు. ర్యాలీలో కాంగ్రెస్ నియోజకవర్గాల సమన్వయ కర్తలు డాక్టర్ గేదెల తిరుపతి, తదితరులతో పాటు మండల అ,ధ్యక్షులు, జిల్లా కాంగ్రెస్ కమిటీ సభ్యులు, యుత్ కాంగ్రెస్ అధ్యక్షులు పూడి శ్రీను, విద్యార్థి విభాగం ఆధ్యక్షులు గణేష్, జనరల్ సెక్రటరీ శ్రీనివాస్, షరీఫ్, సమీర్ పాల్గొన్నారు.

ముంబయిని ముంచెత్తిన భారీ వర్షాలు

- వరసగా మూడోరోజూ కుండపోత
- కర్ణాటక, హిమాచల్ ప్రదేశ్‌లోనూ..


ముంబైలో మోకాళ్ల లోతు నీళ్లలో వెళ్తున్న ప్రజలు

న్యూఢిల్లీ : దేశ ఆర్థిక రాజధాని ముంబయిని వరసగా మూడోరోజు కూడా భారీ వర్షాలు ముంచెత్తాయి. దీంతో సోమవారం ముంబయి తీవ్రమైన నీటి ముంపుతో ఇబ్బంది పడింది. రోడ్లన్నీ జలమయమయ్యాయి. అల్పపీడనం, తుపాను ఉపరితల ఆవర్తనాల కారణంగా భారీ వర్షాలు కురిశాయని అధికారులు తెలిపారు. ముంబయి, శివారు ప్రాంతాల్లో మరో రెండు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ హెచ్చరించింది. ముంబయితో పాటు మహారాష్ట్రలోని పాల్ఘడ్, సింధు దుర్గ్, ఔరంగాబాద్, హింగోలి, జల్గావ్, జల్నా, నాందేడ్, పర్భానీ జిల్లాల్లోనూ సోమవారం భారీ వర్షాలు ముంచెత్తాయి. నాందేడ్ జిల్లాలోని ముఖేడ్ తాలూకాలో భారీ వర్షాల కారణంగా ఐదుగురు గల్లంతయ్యారు. భారీ వర్షాల నేపథ్యంలో మంగళవారం ముంబయిలోని అన్ని పాఠశాలలు, కళాశాలలకు సెలవు ప్రకటిస్తున్నట్లు బిఎంసి వెల్లడించింది. అవసరమైతేనే బయటకురావాలని బృహన్ ముంబయి మునిసిపల్ కార్పొరేషన్ (బిఎంసి) నివాసితులకు విజ్ఞప్తి చేసింది. మత్స్యకారులు అరేబియా సముద్రంలోకి వెళ్లవద్దని ఐఎండి కోరింది.

కర్ణాటకలో ఆదివారం రాత్రి నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. శివమొగ్గ, మాండ్య, కొడగు జిల్లాల్లో భారీ వర్షపాతం నమోదవుతుంది. హిమాచల్ ప్రదేశ్‌లో రుతుపవనాల ప్రభావం కొనసాగుతూనే ఉంది. సోమవారం కూడా రాష్ట్రంలో భారీ వర్షాలు కురిసాయి. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో భారీ వర్షాల కారణంగా నిర్మాణంలో ఉన్న గోడ కూలిపోయింది. ఈ ప్రమాదంలో ముగ్గురు కార్మికులు మరణించగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. భారీ వర్షాల కారణంగా దక్షిణ ఒడిషాలో సాధారణ జనజీవనం స్తంభించింది. ముఖ్యంగా మల్కాన్‌గిరి, నబరంగ్‌పూర్, గజపతి, కోరాపుట్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసి, అనేక లోతట్టు ప్రాంతాలు వరద నీటితో మునిగిపోయాయి. జమ్ముకాశ్మీర్‌లోనూ సోమవారం మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. ముఖ్యంగా శ్రీనగర్, కుష్వారా, బారాముల్లా, అనంతనాగ్, పుల్వామా జిల్లాల్లో భారీ వర్షపాతం నమోదైంది.

మహారాష్ట్ర, కర్ణాటకలో గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా కృష్ణా, దాని ఉప నదుల నీటి మట్టాలు ప్రమాదకర స్థాయికి పెరిగాయి. దీంతో ఈ నదుల పరివాహక ప్రాంతాల్లోని గ్రామాల ప్రజలు, రైతులు, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. భారీ వర్షాల కారణంగా ఆల్మట్టి ఆనకట్ట వద్ద నీటిమట్టం క్రమంగా పెరుగుతున్నట్లు అధికారులు తెలిపారు. కృష్ణాతోపాటు ఘటప్రభ నది నుంచి భారీగా వరద ప్రవాహం ఆల్మట్టి డ్యామ్‌కు కొనసాగుతున్నదని తెలిపారు.

మా భద్రతకు భరోసా ఇవ్వండి

- అమెరికా నుంచి స్పష్టమైన హామీ కోరిన జెలెన్స్కీ
- ట్రంప్‌తో ముగిసిన భేటీ



వాషింగ్టన్ : రష్యాతో శాంతి ఒప్పందం అంగీకరించడం కోసం అమెరికా తమ భద్రతకు భరోసా ఇవ్వాలని, వివిధ అంశాల్లో సహాయం చేయాలని ఉక్రెయిన్ అధ్యక్షులు జెలెన్స్కీ స్పష్టమైన హామీని కోరారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో జెలెన్స్కీ సోమవారం వైట్‌హౌస్‌లో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో ఉక్రెయిన్ సురక్షితంగా ఉండటానికి ఏమి అవసరమో ట్రంప్‌నకు జెలెన్స్కీ వివరించారు. ఇందులో ఆయుధాల అమ్మకాలు, ఉక్రెయిన్ సైన్యానికి శిక్షణ వంటి అంశాలు ఉన్నాయి. యూరోపియన్ నాయకులతో చర్చించిన తరువాత వివరాలు వెల్లడిస్తానని ట్రంప్ తెలిపారు. పుతిన్‌తో మాట్లాడతానని, ముగ్గురి మధ్య సమావేశం జరుగుతుందని ఆశిస్తున్నానని ట్రంప్ తెలిపారు. సోమవారం ముందుగా వైట్‌హౌస్‌కు చేరుకున్న జెలెన్స్కీకి ట్రంప్ స్వాగతం పలికారు. జెలెన్స్కీ మాట్లాడుతూ.. యుద్ధాన్ని ఆపేందుకు, ప్రజల ప్రాణాలు కాపాడేందుకు చొరవ తీసుకుంటున్నందుకు ట్రంప్‌నకు కృతజ్ఞతలు తెలిపారు. రష్యా, అమెరికాతో త్రైపాక్షిక సమావేశానికి తాము సిద్ధంగా ఉన్నట్లు జెలెన్స్కీ పేర్కొన్నారు. కొన్ని రోజుల క్రితం అలాస్కా వేదికగా రష్యా అధ్యక్షులు పుతిన్‌తో ట్రంప్ సమావేశం అనంతరం ఈ భేటీ నిర్వహించడంతో ప్రాధాన్యం సంతరించుకుంది. జెలెన్స్కీతో సమావేశం తరువాత ట్రంప్‌తో భేటీ అయ్యేందుకు యూరప్, నాటో నేతలు తరలివచ్చారు. బ్రిటన్ ప్రధాని స్టార్మర్, ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్, ఇటలీ ప్రధాని జార్జియా మెలోని, ఫిన్లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్, ఐరోపా కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్‌డెర్, నాటో చీఫ్ మార్క్ రుట్టె తదితరులు వైట్‌హౌస్‌కు చేరుకున్నారు.

తలకోన ఆలయ నిర్మాణానికి రూ.19.13 కోట్లు

- టిటిడి ఛైర్మన్, ఎంఎల్ఎ నాని

ప్రజాశక్తి – యర్రావారిపాలెం

ప్రముఖ క్షేత్రమైన శ్రీ తలకోన సిద్దేశ్వర స్వామి నూతన ఆలయ పునర్నిర్మాణానికి సోమవారం భూమి పూజ జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడుకు ఎమ్మెల్యే పులివర్తి నాని స్వాగతం పలికారు. అనంతరం టిటిడి చైర్మన్ బాలాలయంలో స్వామివారిని దర్శించుకుని పండితులచే వేద మంత్రాల నడుమ భూమి పూజ చేసి పండితులచే ఆశీర్వాదాలు అందుకున్నారు. మీడియాతో టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చొరవతో ఆలయ పునర్నిర్మాణానికి టటిడి నుండి రూ.19.13 కోట్లు నిధులు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. త్వరితగతిన ఆలయ పునర్నిర్మాణం చేపట్టి తలకోన ఆలయ రూపురేఖలు మారి మరింత సుందరంగా ఆలయ నిర్మాణం రూపుదిద్దుకుంటుందని తెలిపారు.

గాజాలో 263 ఆకలి చావులు

- ఉద్దేశపూర్వకంగానే ఇజ్రాయిల్ దారుణాలు : అమ్నెస్టీ



గాజా : ఇజ్రాయిల్ దాడులకు వేలాదిమంది చనిపోతుంటే, ఆకలికి తట్టుకోలేక వందలాది మంది కన్నుమూస్తున్నారు. గాజాలో తీవ్రమైన ఆకలి బాధలు తట్టుకోలేక గత 24గంటల్లో ఐదుగురు మరణించారు. దీంతో ఇప్పటివరకు ఆకలి మంటలకు 263 మంది బలయ్యారని పాలస్తీనా ఆరోగ్య మంత్రిత్వశాఖ తెలిపింది. వీరిలో 113 మంది చిన్నారులే వున్నారు. గాజాకు ఆహారం, తాగునీరు, ఇతరత్రా మానవతా సహాయాన్ని అందనివ్వకుండా ఇజ్రాయిల్ మే నెల నుంచే ఆంక్షలు విధించింది. దీంతో గాజాలోని ప్రజలు తిండిలేక అల్లాడుతున్నారు. తాగడానికి నీరులేక డీ హైడ్రేషన్‌కు గురవుతున్నారు. ఈ పరిస్థితుల్లో చిన్నారులు చర్మాన్ని కప్పుకున్న ఎముకలా గూడుల్లా, అస్థిపంజరాల్లా వుంటున్నారు. అందుకే చిన్నారులు పిట్టల్లా రాలిపోతున్నారు. మరోవైపు గత 24గంటల్లో ఇజ్రాయిల్ దాడుల్లో 60మంది చనిపోయారు. 344మంది గాయపడ్డారు. దాడులకు గురై పెద్ద సంఖ్యలో బాధితులు శిథిలాల కింద, రోడ్లపై పడి వున్నారని, అంబులెన్సులు, పౌర రక్షణ దళాలు కూడా అక్కడకు వెళ్లలేని పరిస్థితులు నెలకొన్నాయని గాజా ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు. ఇప్పటివరకు గాజా మరణాల సంఖ్య 62వేలు దాటింది. గాయపడినవారి సంఖ్య 1,56,230 దాటింది. ఆహారం కోసం వచ్చి ఆదివారం ఆహార కేంద్రాల వద్ద దాడులకు గురై మరణించిన వారి సంఖ్య 27గా వుందని ఆస్పత్రి రికార్డులు పేర్కొంటున్నాయి.

ఉద్దేశపూర్వకంగానే ఇజ్రాయిల్ చర్యలు : అమ్నెస్టీ

ఇజ్రాయిల్ ఉద్దేశపూర్వకంగానే గాజా ప్రజలను ఆకలి చావులకు గురి చేస్తోందని అమ్నెస్టీ ఇంటర్నేషనల్ విమర్శించింది. ఇదిలాగే కొనసాగితే గాజాలో దుర్భిక్షం తీవ్ర స్థాయిలో నెలకొంటుందని హెచ్చరించింది. పాలస్తీనా ప్రజల ఆరోగ్యాన్ని, వారి సంక్షేమాన్ని, సామాజిక కూర్పును ఒక పద్ధతి ప్రకారం ఇజ్రాయిల్ ధ్వంసం చేస్తోందని అమ్నెస్టీ విమర్శించింది. ఈ మేరకు ఒక నివేదిక విడుదల చేసింది. సుదీర్ఘకాలంగా సాగుతున్న యుద్ధంతో, దాడుల భయంతో ఎక్కడకూ వెళ్లలేక విసిగివేసారిపోయామని గాజా వాసులు చెబుతున్నారు. ఈ తరుణంలో ఐక్యరాజ్య సమితి తమకు బాసటగా వుండాలని గాజా వాసి మహ్మద్ అబూ అల్తా తదితరులు కోరారు.

ప్రాథమిక హక్కుల కోసం పాక్ కార్మికుల పోరాటం


చట్టాలను అమలు చేయాలని ఆందోళన చేస్తున్న కార్మికులు

లాహోర్ : పాకిస్తాన్‌లోని పంజాబ్ రాష్ట్రంలోని కార్మికులు తమ ప్రాథమిక హక్కుల కోసం పోరాటం చేస్తున్నారు. 140 అమెరికా డాలర్లను నెలకు కనీసం వేతనంగా ఇవ్వాలని చట్టం ఉన్నప్పటికీ అనేక మంది ఫ్యాక్టరీ యజమానులు ప్రపంచ మార్కెట్‌ను సాకుగా చూపుతూ వేతనాలు తగ్గించారు.దీంతో కనీస వేతనం చట్టాన్ని అమలు చేయాలని, పని పరిస్థితులను తక్షణమే మెరుగుపరచాలని డిమాండ్ చేస్తూ పంజాబ్‌లోని ఫైసలాబాద్, గుజ్రాన్‌వాలాలోని వేలాది మంది లూమ్, టెక్స్‌టైల్, బట్టీ కార్మికులు జులై చివరి నుంచి నిరసనలు కొన సాగిస్తున్నారు. కొంత మంది యజమానులు అక్రమ ఫ్యాక్టరీ లాకౌట్లకు పాల్పడుతున్నారు. దీంతో ఈ ప్రాంతంలో కీలకమైన వస్త్ర రంగంలో ప్రతిష్టంభన నెలకుంది. పాకిస్తాన్ వస్త్ర పరిశ్రమకు చెందిన 25 శాతం కార్మికులు పనిచేసే ఫైసలాబాద్ పవర్ లూమ్ రంగం తీవ్రమైన పరిస్థితులను ఎదుర్కొంటుంది. ఈ ప్రాంతంలో కార్మికులకు వేతనాలు తగ్గింపుతో పాటు, అనేక మందికి సామాజిక భద్రతా నమోదు నిరాకరించారు. ఆరోగ్య సంరక్షణ, పెన్షన్లు, చికిత్సా పరిహారం కూడా అమలు కావడం లేదు. దీంతో కార్మి కులు తమ నిరసనలు ఉధృతం చేస్తున్నారు. ఈ నెల 1 నుంచి ఫైసలాబాద్ డిప్యూటీ కమిషనర్ కార్యా లయం ఎదుట వందలాది మంది కార్మికులు, వారి కుటుంబ సభ్యులు ఆందోళన నిర్వహి స్తున్నారు. ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని కోరుతున్నారు. 'పని ఇవ్వండి లేదా చంపేయండి' అని నినాదాలు చేస్తున్నారు.

బిల్లుల ఆమోదంలో రాష్ట్రపతి జాప్యంపై పంజాబ్ ప్రభుత్వ పిటిషన్ విచారణ వాయిదా



న్యూఢిల్లీ : పంజాబ్ గవర్నర్ పరిశీలనకు పంపిన రెండు బిల్లులపై నిర్ణయం తీసుకోవడంలో రాష్ట్రపతి తీవ్ర జాప్యం చేయడాన్ని సవాల్ చేస్తూ ఆ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్ విచారణను సుప్రీంకోర్టు సోమవారం వాయిదా వేసింది. ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) జస్టిస్ బిఆర్ గవాయి నేతృత్వంలోని ధర్మాసనం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర బిల్లులను ఆమోదించడానికి గవర్నర్లు, రాష్ట్రపతికి కాలపరిమితిని నిర్దేశించవచ్చా.. లేదా అనే విషయంపై రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చే తీర్పు వరకూ వేచి చూడాలని నిర్ణయించింది. పంజాబ్ ప్రభుత్వ పిటిషన్‌ను సిజెఐతో పాటు జస్టిస్ కె వినోద్ చంద్రన్, జస్టిస్ ఎన్‌వి అంజరియాలతో కూడిన ధర్మాసనం సోమవారం విచారించింది. కేంద్ర ప్రభుత్వం తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తన వాదనలు వినిపించారు. ఇలాంటి పిటిషన్‌ను రాజ్యాంగ ధర్మాసనం విచారించాలని వాదించారు. ఈ వాదనలను పంజాబ్ తరుపున న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి వ్యతిరేకించారు. కౌంటర్ అఫిడవిట్‌ను దాఖలు చేయడానికి సమయం కోరారు. ఈ వాదనలు విన్న ప్రధాన న్యాయమూర్తి గవాయ్ రాజ్యాంగ ధర్మాసనం తీర్పును వెల్లడించిన తర్వాత ఈ పిటిషన్ జాబితా చేయాలని ఆదేశించారు. 'రాజ్యాంగ ధర్మాసనం ఈ అంశంపై నిర్ణయం తీసుకున్న తరువాత, అన్ని ఇతర ధర్మాసనాలు ఆ తీర్పును అనుసరించడానికి కట్టుబడి ఉంటాయి' అని సిజెఐ వ్యాఖ్యానించారు.

బోనులో చిక్కిన చిరుత

ప్రజాశక్తి – వెంకటేశ్వర క్యాంపస్(తిరుపతి)

శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో పరిపాలనా భవనం వెనుక భాగంలో అటవీశాఖ అధికారుల చిరుత పులిని ఆదివారం రాత్రి 11.30 సమయంలో బోను ద్వారా బంధించినట్టు, ఉదయం దానిని తరలించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఉపకులపతి ఆచార్య అప్పారావు వివరాలు తెలియజేస్తూ విశ్వవిద్యాలయంలో గత మూడు వారాలుగా తిరుగుతున్న చిరుతను బంధించి ఉపశమనం కలిగించినందుకు అటవీశాఖ అధికారులకు వారు కృతజ్ఞతలు తెలిపారు. అయితే విశ్వవిద్యాలయంలో తిరిగే ప్రతి ఒక్కరూ రాత్రుళ్లు జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం వుందని తెలిపారు. తిరుపతిలోని పలు ప్రాంతాల్లో చిరుతల సంచారం భయాందోళనకు గురిచేస్తోంది. జూపార్క్ రోడ్డులో తరచూ చిరుతలు కనిపిస్తున్నాయి చిరుతలు. ఆడ చిరుత పులి దాని పిల్లల సమాచారం కనిపెట్టేందుకు అటవీశాఖ అధికారులు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం.

శ్రీవారి దర్శనానికి దళారులను ఆశ్రయించొద్దు

- టిటిడి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుమల శ్రీవారి దర్శనానికి విచ్చేసే యాత్రికులు దర్శనం, వసతి కోసం దళారులను ఆశ్రయించొద్దని, టిటిడి అధికారిక వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా, టోకెన్ జారీ కౌంటర్ల ద్వారా నమోదు చేసుకుని దర్శనం పొందాలని టిటిడి యాజమాన్యం సూచించింది. ఇటీవల శ్రీవారి విఐపి బ్రేక్ టికెట్లు ఇప్పిస్తామని వనం నటరాజ నరేంద్ర కుమార్, కెఎస్.నటరాజ శర్మ రూ.90 వేలు తీసుకుని మోసం చేసినట్లు హైదరాబాద్‌కు చెందిన వై.శ్రీవిశ్వనాథ్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వనం నటరాజ నరేంద్ర కుమార్, కె.ఎస్.నటరాజ శర్మ విఐపి బ్రేక్ దర్శన టిక్కెట్లు ఇస్తామని చెప్పి 2024 ఆగస్టు 16న 12 మంది కోసం రూ.90 వేలు వసూలు చేసినట్లు పేర్కొన్నారు. అప్పటి నుండి పలుమార్లు ఫోన్ చేసి తన డబ్బు తిరిగి ఇవ్వాలని కోరినప్పటికీ వారు స్పందించలేదు. వై.శ్రీ విశ్వనాథ్ ఫిర్యాదు తరువాత టిటిడి విజిలెన్స్ విభాగం విచారణలో నిందితులు హైదరాబాద్ జంట నగరాల్లో పలువురిని ఇలాగే మోసం చేస్తున్నారని వీరిపై ఇప్పటికే దాదాపు 12 పోలీస్ కేసులు నమోదయ్యాయి. దళారులపై అనుమానం వస్తే టిటిడి విజిలెన్స్ అధికారులు 0877-2263828 సదరు ఫోన్ నెంబర్‌లో నిరంతరం అందుబాటులో ఉంటారని, ఫిర్యాదు చేయాలని టిటిడి యాజమాన్యం సూచించింది. సోమవారమూ రద్దీ కొనసాగింది. శ్రీవారి దర్శనానికి 24 గంటల సమయం పడుతోంది.

తిరువనంతపురంలో నేటి నుంచి ఎస్‌జెఎఫ్‌కె మహాసభ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సీనియర్ జర్నలిస్టుల జాతీయ మహాసభ కేరళ రాష్ట్రంలోని తరువనంతపురంలో మంగళవారం నుంచి మూడు రోజులపాటు జరగనున్నట్లు సీనియర్ జర్నలిస్టుల ఫోరం - కేరళ (ఎస్‌జెఎఫ్‌కె) వెల్లడించింది. పెన్షన్ల మంజూరులో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అసమానతల దృష్ట్యా, అన్ని రాష్ట్రాల్లో సీనియర్ జర్నలిస్టులకు సమానంగా జాతీయ పెన్షన్ పథకం అమలు చేయాలని కోరుతూ ఈ మహాసభలో తీర్మానించనున్నట్లు ఎస్‌జెఎఫ్‌కె ఒక ప్రకటనలో పేర్కొంది. ఇప్పటి వరకూ పెన్షన్ పథకం అమలు చేయని రాష్ట్రాల్లోనూ ఈ పథకం అమలు చేయాలని కేంద్రాన్ని కోరుతూ తీర్మానం చేయనున్నట్లు వెల్లడించింది. ఈ మహాసభలో పత్రికా రంగంలోని అన్ని విభాగాల వారిని పెన్షన్ పథకంలో చేర్చడం, జాతీయ ఆరోగ్య బీమా పథకం అమలు, రైల్వే ప్రయాణ రాయితీ పునరుద్ధరణ, పిఎఫ్ కనీస పెన్షన్ పెంపు తదితర అంశాలపై చర్చించనున్నట్లు తెలిపింది. 19న జరిగే సంఘీభావ సభలో విద్యాశాఖ మంత్రి శివన్‌కుట్టి పాల్గొంటారని, 20న కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ మహాసభను ప్రారంభిస్తారని వెల్లడించింది.

రాజధాని నిర్మాణానికి రూ.వంద కోట్ల సేకరణే లక్ష్యం

- అమరావతి బ్రాండ్ అంబాసిడర్ వైష్ణవి

ముదినేపల్లి : కలల రాజధాని అమరావతి అభివృద్ధికి ఏడాదిలో రూ.వంద కోట్ల విరాళాలు సేకరించడం లక్ష్యంగా మొదలు పెట్టిన కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన వస్తోందని అమరావతి బ్రాండ్ అంబాసిడర్, వైద్య విద్యార్థిని అంబుల వైష్ణవి అన్నారు. ముదినేపల్లిలో ఆదివారం ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తనపై నమ్మకంతో ముఖ్యమంత్రి చంద్రబాబు తనను రెండోసారి అమరావతి బ్రాండ్ అంబాసిడర్‌గా ప్రకటించడం సంతోషమన్నారు. తాను ఎవరిని అడిగినా హైదరాబాద్, బెంగళూరు, చెన్నై ఇలా ఇతర ప్రాంతాల్లో ఉద్యోగాలు చేస్తున్నామని చెబుతున్నారని, విజయవాడలో ఉద్యోగం చేస్తున్నామని అన్నవారు లేరని తెలిపారు. ఆ ఆవేదనలో నుంచి పుట్టిన ఆలోచనే అమరావతి అభివృద్ధిలో యువతను భాగస్వాములను చేయాలనే ఉద్దేశ్యం నుంచి 'రూ.116 సాయం' ఆలోచన పుట్టిందన్నారు. గతంలో అమరావతి నిర్మాణానికి ఒక్కో ఇటుక విరాళం అందించడానికి తెరచిన సిఆర్‌డిఎ బ్యాంకు ఖాతా నంబర్నే ఇప్పుడు విరాళాల సేకరణకు వినియోగిస్తున్నామన్నారు. రాష్ట్ర యువత భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని మన రాష్ట్రాన్ని మళ్లీ అభివృద్ధి పథంలో నడిపించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ప్రతి ఒక్కరూ రూ.116 విరాళాన్ని సిఆర్‌డిఎ ఖాతాలో జమ చేస్తారని ఆశిస్తున్నామని వైష్ణవి విజ్ఞప్తి చేశారు.

రూ.904 కోట్లతో అభివృద్ధి పనులు

- అమరావతిలో కీలక ప్రాజెక్టులకు ఎస్‌పివి
- మంగళగిరిలో గోల్డ్ క్లస్టర్‌కు భూ సమీకరణ
- సిఎం అధ్యక్షతన సిఆర్‌డిఎ సమావేశంలో నిర్ణయం



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అమరావతి రాజధాని పరిధిలో రూ.904 కోట్లతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని సిఆర్‌డిఎ సమావేశం నిర్ణయించింది. సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధ్యక్షతన సిఆర్‌డిఏ 51వ సమావేశం జరిగింది. మొత్తం తొమ్మిది ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. రాజధాని పరిధిలో చేపట్టే గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు, ఎన్‌టిఆర్ విగ్రహం, స్పోర్ట్సుసిటీ, స్మార్ట్ ఇండస్ట్రీస్, రివర్‌ఫ్రంట్, ఇన్నర్‌రింగురోడ్డు, రోప్‌వే లాంటి ప్రాజెక్టులకు స్పెషల్ పర్పస్ వెహికల్ (ఎస్‌పివి)ని ఏర్పాటు చేసేందుకు అంగీకారం తెలిపింది. 29 గ్రామాల్లో డ్రెయిన్లు, నీటి సరఫరా, ఇతర మౌలిక సదుపాయాల కోసం ఎస్‌పిఎస్ జోన్ క్రిటికల్ ఇన్‌ఫ్రా అండ్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాను కింద రూ.904 కోట్లతో పనులు చేపట్టేందుకు అథారిటీ ఆమోదం తెలిపింది. సీవరేజ్ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంటుకు రూ.411 కోట్లు, నీటి సరఫరాకు రూ.376 కోట్లు, విట్, ఎస్ఆర్ఎం యూనివర్శిటీలకు అదనంగా 100 ఎకరాల చొప్పున భూములు ఇవ్వనున్నారు. మంగళగిరి వద్ద 76 ఎకరాల్లో గోల్డ్ క్లస్టర్ ఏర్పాటు చేసేందుకు భూ సమీకరణ చేసేందుకు, ప్రత్యేక ఎస్‌పిఎస్ నిబంధనలకు అథారిటీ సమావేశంలో ఆమోదించారు. దీనిలో ఐదువేల కోట్ల పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందని అంచనా వేశారు. దీనికోసం ప్రత్యేక ఎకో సిస్టమ్ వచ్చేలా చూడాలని నిర్ణయించారు.

ఈ సీజన్లోనే అమరావతికి రాజధాని రూపం

ఈ సీజన్లోనే అమరావతికి ఒక రూపం వచ్చేలా యుద్ధ ప్రాతిపదికన నిర్మాణాలు చేపట్టాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. స్పోర్ట్స్ సిటీ లాంటి ప్రాజెక్టులను అంతర్జాతీయ ప్రమాణాలతో చేపట్టాలని సిఎం సూచించారు. రివర్‌ఫ్రంట్, రోప్‌వే, ఇన్నర్‌రింగురోడ్డును అనుసంధానించాలని సిఎం సూచించారు. రాజధాని ప్రాంతంలో కాలుష్య రహిత పరిశ్రమలు, పెట్టుబడులు వచ్చేలా చూడాలని స్పష్టం చేశారు. త్వరలోనే ప్రతిష్టాత్మక బయో ఇంజనీరింగ్ యూనివర్శిటీ కూడా అమరావతికి రానుందని పేర్కొన్నారు. దేశంలో మరే ప్రాంతానికి లేని భౌగోళిక సానుకూలతలు అమరావతికి ఉన్నాయని చెప్పారు. అందువల్ల ఇక్కడ చేపట్టే నిర్మాణాలన్నీ ఐకానిక్‌గా ఉండాలని సూచించారు. ప్రతి ప్రాజెక్టు పరిధిలోనూ ఆర్థిక కార్యకలాపాలు జరిగేలా ప్రణాళికలు ఉండాలని సిఎం సూచించారు. ఈ సమావేశంలో మంత్రి నారాయణ, సిఎస్ కె.విజయానంద్ ఇతర అధికారులు పాల్గొన్నారు. ఇదే అంశాలపై మంత్రి నారాయణ అధ్యక్షతన మంత్రివర్గ ఉపసంఘం జరిగింది. ఈ సమావేశానికి మంత్రులు ఆన్‌లైన్లో హాజరయ్యారు.

రిటర్నబుల్ ప్లాట్లలో అసైన్‌మెంట్ పదం తొలగింపు

గతంలో రాజధానిలో పూలింగుకు ఇచ్చిన అసైన్డ్ భూముల్లో తిరిగి రైతులకు ఇచ్చిన ప్లాట్లకు రిజిస్టర్ చేసే సమయంలో అసైన్డ్ అని ప్రస్తావిస్తున్నారు. దీనివల్ల అమ్ముకోవాలంటే రైతులకు ఇబ్బంది ఎదురవుతోంది. రిజిస్ట్రేషన్ల దగ్గర సమస్య ఎదురవుతోంది. ఈ నేపథ్యంలో అసైన్డ్ అనే పదాన్ని తొలగించాలని అథారిటీ సమావేశంలో నిర్ణయించారు.

రెండున్నరేళ్లలో లేఅవుట్ల పనులు పూర్తి

అథారిటీ సమావేశం అనంతరం మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడుతూ మార్చి 31 నాటికి నాలుగువేల గృహాలను పూర్తి చేసి అధికారులకు అప్పగిస్తామని తెలిపారు. వచ్చే మూడున్నరేళ్లలో ప్రధాన రహదారులు, వాటి అనుబంధ పనులు పూర్తి చేస్తామన్నారు. రెండున్నరేళ్లలో లేఅవుట్లలో అన్ని పనులూ పూర్తి చేస్తామని వివరించారు. మహాలక్ష్మి హోటల్ కన్సార్టియంకు ఎకరం భూమిని కేటాయించినట్లు వివరించారు. రాజధాని పరిధిలో అభివృద్ధి పనులు విస్తృత స్థాయిలో చేపట్టామని వివరించారు. ఆయా పనులను ఎడిసి, సిఆర్‌డిఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తామని పేర్కొన్నారు.

అంచనాలను మించుతున్న లోటు

- నాలుగు నెలల్లోనే సంవత్సర అంచనాలను దాటిన వైనం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

బడ్జెట్ అంచనాలకు, వాస్తవ ఆర్థిక పరిస్థితికి మధ్య పొంతన కనిపించడం లేదు. ఆదాయం కన్నా వ్యయం పెరిగిపోవడం, లోటు లెక్కలకు మించి నమోదవుతుండడం, చేస్తున్న రుణాలు కూడా అంచనాకు మించి ఉండడం వంటి పరిస్థితులు కనపడుతున్నాయి. ఈ నేపథ్యంలోనే భారీ లోటు ఖజానాకు ఆందోళనకరంగా మారుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. వార్షిక అంచనా లోటు కేవలం నాలుగు నెలల్లోనే దాటిపోవడంపై ఆర్థికశాఖ అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు

జూలై చివరి నాటికి వెల్లడైన నివేదిక మేరకు ఆదాయ లోటు ఏకంగా రు. 36,741 కోట్లుగా నమోదైంది. అయితే బడ్జెట్ అంచనాల్లో మాత్రం వార్షికం మొత్తానికి 33,185 కోట్లుగా అంచనా వేశారు. తొలి నాలుగు నెలల్లోనే 110 శాతానికి చేరుకోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. ద్రవ్య లోటు కూడా బడ్జెట్‌లో 79,926 కోట్లుగా అంచనా వేయగా, నాలుగు నెలల్లోనే 60 శాతం కన్నా అధికంగా 48,354 కోట్లకు చేరుకోవడం గమనార్హం.

ఆదాయంలో సగం అప్పే

రాష్ట్ర ఆదాయం 2.97 లక్షల కోట్లకు అంచనా వేయగా, నాలుగు నెలల్లో 98 వేల కోట్ల వరకు వచ్చినట్లు లెక్కలు తేల్చారు. ఇందులో సగం ఆదాయం కేవలం రుణం రూపంలో వచ్చినదే కావడం గమనార్హం. నాలుగు నెలల్లోనే 49 వేల కోట్లకుపైగా రుణాలు సేకరించాల్సి వచ్చింది. అంటే నెలకు సగటున 12,300 కోట్లు రుణం తీసుకున్నట్టయింది. ఈ కారణంగానే లోటు కూడా భారీ స్థాయికి చేరుకుందని అధికారులు అంగీకరిస్తున్నారు.

విభాగం	బడ్జెట్‌లో	4 నెలలకు
ఆదాయ లోటు	33,186	36,741
ద్రవ్యలోటు	79,927	48.354
రుణం	79,927	49,198
మొత్తం ఆదాయం	**2,97,929**	**98,281**
మొత్తం వ్యయం	**2,91,798**	**94,374**



హెలీ మ్యూజియం ప్రారంభ కార్యక్రమంలో మంత్రులు వీరాంజనేయస్వామి, అనిత

హెలీ మ్యూజియం ప్రారంభం

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

విశాఖను పర్యాటకంగా మరింత అభివృద్ధి చేసేందుకు కట్టుబడి ఉన్నామని, నగరంలో ఆకర్షణీయమైన ప్రాజెక్టులను అందుబాటులోకి తీసుకు వస్తున్నామని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి, రాష్ట్ర హోం శాఖ మంత్రి అనిత అన్నారు. బీచ్ రోడ్డులో ఇండియన్ నేవీ సహకారంతో సుమారు రూ.3.50 కోట్ల నిధులతో నెలకొల్పిన యుహెచ్3హెచ్ హెలికాప్టర్ మ్యూజియాన్ని సోమవారం సాయంత్రం వారు ప్రారంభించారు. అనంతరం డోలా వీరాంజనేయ స్వామి మాట్లాడుతూ అతి త్వరలోనే దేశంలోని అతి పెద్ద గ్లాస్ బ్రిడ్జిను అందుబాటులోకి తీసుకురానున్నట్టు తెలిపారు. విఎంఆర్‌డిఎ చైర్మన్ ఎంవి.ప్రణవ్ గోపాల్, కమిషనర్ కెఎస్.విశ్వనాథన్, ఎమ్మెల్యేలు వంశీకృష్ణ శ్రీనివాస్, విష్ణు కుమార్ రాజు, నగర మేయర్ పీలా శ్రీనివాసరావు, జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్, విఎంఆర్‌డిఎ కార్యదర్శి మురళీకృష్ణ పాల్గొన్నారు.



చెరువును తలపిస్తున్న తాడేపల్లి రూరల్ లోని ఇప్పటం గ్రామంలో వరి పొలంలో నీరు



మంగళగిరి మండలంలో ఉధృతంగా ఉన్న కొండవీటి వాగు (ఫైల్)

డెల్టా రైతులకు దెబ్బమీద దెబ్బ

- వెదపద్ధతిలో సాగు చేసిన వారికి అపారనష్టం
- మరోసారి నాట్లు వేసేందుకు అవకాశాలు మృగ్యం

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

కృష్ణా పశ్చిమ డెల్టాలో ఈ ఏడాది అన్నదాతలకు ఆదిలోనే కష్టాలు ప్రారంభమయ్యాయి. వరి సాగు చేసిన రైతులు ఇప్పటి వరకు రెండుసార్లు వెదపద్ధతిలో విత్తనాలు చల్లగా ఒకసారి వర్షాభావం నష్టం వల్ల జరగ్గా, రెండో విడత అతి భారీ వర్షాలు దెబ్బతీశాయి. పంట ఎదుగుదల దశలో వైపరిత్యాల వల్ల ఎకరాకు ఒక్కో రైతు రూ.20 వేల వరకు నష్టపోయారు. ఈ నెల 12, 13 తేదీల్లో కురిసిన అతి భారీ వర్షం వల్ల జిల్లాలోని దాదాపు లక్ష ఎకరాల్లో వరి పొలాలు ముంపునకు గురయ్యాయి. ఇప్పటికే రెండుసార్లు నష్టపోయిన రైతులు మూడోసారి వెదపద్ధతిలో సాగుకు అవకాశాలు లేవని, ఇప్పుడు నాట్లు వేయాలన్నా నారు అందుబాటులో లేదని వాపోతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల్లో 1.50 లక్షల ఎకరాల్లో వరి పైర్లకు నష్టం వాటిల్లగా ఇందులో గుంటూరు జిల్లాలో 70 వేల ఎకరాల్లో పంట నీట మునిగింది. ఇప్పటి వరకు అధికారులు ఎటువంటి ఎన్యూమరేషన్ ప్రక్రియ చేపట్టలేదు. ఈ నేపథ్యంలో రైతులు పంటను కోల్పోయి ఎటూ పాలుపోని స్థితిలో ఉన్నారు. నారుమడులు పోసి నారు తయారు కావాలన్న కనీసం 30 రోజులు సమయం పడుతుందని ఈ లోగా అదునుదాటిపోతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కృష్ణా పశ్చిమ డెల్టాలో తొలి పంటగా వరి సాగు, రెండో పంటగా జొన్న, మొక్కజొన్న సాగు చేయడం ఆనవాయితీ. ఈ ఏడాది అతివృష్టి, అనావృష్టి పరిస్థితుల పంటను ప్రాథమిక దశలోనే కోల్పోయారు. ప్రధానంగా తెనాలి డివిజన్‌లోని కొల్లిపర, దుగ్గిరాల, పెదకాకాని, మంగళగిరి, తాడేపల్లి, చేబ్రోలు, పొన్నూరు తదితర మండలాల్లో కురిసిన అధిక వర్షాలకు పైరు నీట మునిగి ఎందుకూ పనికిరాకుండాపోయింది. వరితో పాటు కూరగాయలు, ఆకుకూరల తోటలు దెబ్బతిన్నాయి. పసుపు, కంద పంటలు నీట మునిగాయి. గుంటూరు ఛానల్‌కు గండ్లు పడడం, కొండవీటి వాగు ముంపు వల్ల అధిక నష్టం జరిగింది. కాల్వ కట్టల పటిష్టతపై అధికార యంత్రాంగం పట్టించుకోకపోవడం వల్లే అధిక నష్టం జరిగిందని రైతులు వాపోతున్నారు. మూడ్రోజులపాటు పొలాల్లో రెండు అడుగుల మేరకు నీరు నిల్వ ఉండడం వల్ల పైర్లన్నీ దెబ్బతిన్నాయి.

రైతులకు ఆదుకోవాలి

అధిక వర్షాల వల్ల నష్టపోయిన రైతులను వెంటనే ఆదుకోవాలి. ఎకరాకు రూ.20 వేల వరకు ఒక్కో రైతుకు నష్టం వాటిల్లింది. కాల్వల మరమ్మతులు సక్రమంగా జరగపోవడం, పొలాల్లో నీరు బయటకు పోయే అవకాశాలు లేకపోవడం వల్ల పైర్లు నీట మునిగి పూర్తిగా నష్టం జరిగింది. పాలకులు, అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రతి ఏటా పొలాలు ముంపునకు గురికావడం, రైతులు తీవ్ర నష్టాలపాలవడం పరిపాటిగా మారింది.

పాశం రామారావు,
ఎపి కౌలురైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి



వధూవరులను ఆశీర్వదిస్తున్న బంధువులు

ఆంధ్రా అబ్బాయి.. మెక్సికో అమ్మాయి... ఒకటైన వేళ...

ప్రజాశక్తి-గన్నవరం

మెక్సికోలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న మన రాష్ట్రంలోని కృష్ణా జిల్లా గన్నవరం నియోజకవర్గ కేంద్రమైన గన్నవరం శివారు మర్లపాలెం అబ్బాయి జాస్తి యశ్వంత్, మెక్సికో అమ్మాయి జ్యాన్యజాయ్ రూయిజ్ అంజర్ ప్రేమించుకోగా పెద్దలు పెళ్లి చేశారు. ఆదివారం రాత్రి గన్నవరం ఎబి కన్వెన్షన్‌లో జరిగిన వివాహంతో వారు ఒకటయ్యారు. మెక్సికోలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న యశ్వంత్‌కి చెవినెప్పి రావడంతో అక్కడే ఓ మహిళా ఇఎన్‌టి డాక్టర్ అంజర్ వద్దకు వెళ్లి చికిత్స పొందారు. అలా వారిద్దరికీ అక్కడ ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది.



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న ఎయు, ఐఐటిఎం ప్రతినిధులు

ఎయుతో ఐఐటిఎం ఎంఒయు

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ (విశాఖ)

ఆంధ్ర విశ్వవిద్యాలయంతో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ట్రాపికల్ మెటీరాలజి (ఐఐటిఎం) సంస్థ అవగాహన ఒప్పందం చేసుకుంది. సోమవారం ఎయు పాలకమండలి సమావేశ మందిరంలో ఎయు విసి ఆచార్య జి.పి రాజశేఖర్ సమక్షంలో అవగాహన ఒప్పందంపై రిజిస్ట్రార్ ఆచార్య ఇఎన్. ధనంజయరావు, ఐఐటిఎం డైరెక్టర్ డాక్టర్ ఎ.సూర్యచంద్రరావు సంతకాలు చేసి ఒప్పందపత్రాలు మార్చుకున్నారు. ఈ సందర్భంగా జిపి రాజశేఖర్ మాట్లాడుతూ అంతర్జాతీయ ప్రాజెక్టులను సాధించి, నిర్వహించే దిశగా రెండు సంస్థలు కృషి చేయాలని, పోస్ట్ డాక్టరల్ ఫెలోషిప్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి ఎంఒయు ప్రగతిని సమీక్షించాలని నిర్ణయించారు. విభిన్న ఉన్నత పదవులలోఉన్న ఎయు పూర్వ విద్యార్థులు వర్సిటీ ప్రగతికి పాటుపడడం సంతోషాన్నిస్తోందన్నారు. ఐఐటిఎం డైరెక్టర్ సూర్యచంద్రరావు మాట్లాడుతూ ఎయులో ప్రత్యేకమైన వాతావరణ అధ్యయన కేంద్రాన్ని ఏర్పాటు చేసే ప్రతిపాదన ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మిషన్ మౌసంకార్యక్రమంలో భాగం కావాలని ఎయును ఆహ్వానించారు. దేశీయ టెక్నాలజీని అభివృద్ధి చేసి, సెన్సార్ల నుంచి పరికరాల వరకు దేశీయ సాంకేతిక ఉపకరణాలను రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ఎయు వాతావరణ అధ్యయన విభాగం అధిపతి ఆచార్య పి.సునీత మాట్లాడుతూ పరిశోధనలో సంయుక్తంగా కలిసి పనిచేయడం, ఐఐటిఎంకి సంబంధించిన పరిశోధనలకు ఉపయోగించే సమాచారాన్ని పరస్పరం అందించడం, విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం, సంయుక్తంగా సదస్సులు, వర్క్ షాప్‌ల నిర్వహణ, ఇంటర్న్‌షిప్‌లు, ఫ్యాకల్టీ కొలాబరేషన్ వంటివి నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య ఎన్.కిషోర్‌బాబు, ప్రిన్సిపల్ ఆచార్య ఎంవిఆర్ రాజు, జి.శశిభూషణరావు, ఐఐటిఎం శాస్త్రవేత్తలు డి పద్మకుమారి, సచిన్ దేశ్ పాండే, శుభ్రత్‌కుమార్ దాస్, విభాగాధిపతులు, ఆచార్యులు, డీన్‌లు పాల్గొన్నారు.

విశాఖలో కాల్పుల కలకలం

- ఒకరికి తీవ్ర గాయాలు
- ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్

విశాఖ వన్ టౌన్‌లో కాల్పుల కలకలం రేగింది. 39వ వార్డు చిలకపేటలో ఆదివారం అర్ధరాత్రి చేపల రాజేష్‌పై అదే ప్రాంతానికి చెందిన దూర నూకరాజు తన వద్ద ఉన్న తుపాకీతో పొట్టపై కాల్చారు. ఆ సమయంలో నూకరాజు స్నేహితుడు దిలీప్, మరో ఇద్దరు అక్కడ ఉన్నారు. ఈ కేసులో సోమవారం సాయంత్రానికి ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. తీవ్రంగా గాయపడ్డ రాజేష్‌ను చికిత్స నిమిత్తం కెజిహెచ్‌కు తరలించారు. ఈ సంఘటన జరగడానికి ముందు చిలకపేట ఆర్చి దగ్గర రాజేష్, నూకరాజు మద్యం సేవించి గొడవపడ్డారు. ఆ సమయంలో నూకరాజు కత్తితో రాజేష్‌పై దాడి చేసేందుకు ప్రయత్నించాడు. ఆ క్రమంలో రాజేష్ కత్తి లాక్కున్నాడు. తర్వాత ఇద్దరూ అక్కడి నుంచి వెళ్లిపోయారు. అనంతరం అర్ధరాత్రి సమయంలో మళ్లీ అదే ప్రాంతానికి వచ్చి ఇద్దరూ ఘర్షణ పడ్డారు. ఈసారి నూకరాజుతోపాటు ఆయన స్నేహితుడు దిలీప్, రాజేష్‌తోపాటు ఆయన స్నేహితుడు వాసుపల్లి నరేష్ ఉన్నారు. గొడవ తీవ్రం కావడంతో నూకరాజు తన వద్ద ఉన్న తుపాకీతో రాజేష్‌పై కాల్పులు జరిపాడు. అనంతరం నూకరాజు, దిలీప్ అక్కడ నుంచి పారిపోయారు. గాయపడిన రాజేష్‌ను కెజిహెచ్‌కు నరేష్ తదితరులు తీసుకువెళ్లారు. ఈ సంఘటన వెనుక రిటైర్డ్ కానిస్టేబుల్ నాయుడు ప్రమేయం ఉన్నట్లు పోలీసులు భావిస్తున్నారు. నాయుడు అప్పట్లో కానిస్టేబుల్‌గా ఉండి విధులకు సక్రమంగా హాజరు కాకుండా పోర్టులో లారీలు పెట్టి బొగ్గు వ్యాపారం చేసేవారు. డబ్బులు బాగా గడించారు. పోలీసు ఉద్యోగం కంటే అదే బాగుందని భావించి ఆ వ్యాపారంలో కొంతమందిని చేర్చుకున్నారు. వారంతా ఒక ముఠాగా ఏర్పడినట్లు తెలిసింది. అయితే ఈ ముఠా కొన్ని ఆగడాలకు, అక్రమాలకు పాల్పడుతున్నట్లు గుర్తించి రాజేష్ ప్రశ్నించేవాడని పలువురు చెబుతున్నారు. ఈ క్రమంలోనే గొడవలు జరుగుతున్నాయి. ఆదివారం రాత్రి కాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనలో నూకరాజు, దిలీప్‌లను పోలీసులు అరెస్టు చేశారు. తుపాకీని స్వాధీనం చేసుకున్నారు. సంఘటనలో వెనకుండి నడిపించిన ప్రధాన నిందితుడు, రిటైర్డ్ కానిస్టేబుల్ నాయుడు పరారీలో ఉన్నాడని పోలీసులు తెలిపారు.

ప్రమాదపుటంచున ఆర్‌టిసి !

- విద్యుత్ బస్సుల పాలసీని మార్చాలంటూ సంతకాల సేకరణ
- 12న జాతీయ నిరసన దినం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కేంద్ర ప్రభుత్వం పిఎం-ఇ బస్సు సేవ పేరుతో తీసుకొచ్చిన విద్యుత్ బస్సుల పాలసీతో రానున్న రోజుల్లో ఆర్‌టిసి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారనుందనే ఆందోళన ఉద్యోగుల్లో నెలకొంది. విద్యుత్ బస్సులను దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో ప్రవేశపెట్టాలని కేంద్రం ఇప్పటికే ఆదేశించిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగానే ఒక్కో రాష్ట్రానికి కొన్ని బస్సులను కేటాయించే ప్రక్రియను వేగవంతం చేసింది. పిఎం-ఇ బస్సులు (ప్రైవేట్ విద్యుత్ బస్సులు) ప్రవేశపెట్టడం ద్వారా ఆర్‌టిసిల ఉనికినే సవాల్ చేస్తూ కాలక్రమేణా ఆర్‌టిసి డిపోల మూసివేతకు దారితీస్తుందనే ఆందోళనను రవాణా రంగ నిపుణులు, ఆర్‌టిసి ఉద్యోగ సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. విద్యుత్ బస్సుల పాలసీని మార్చాలంటూ సెప్టెంబరు 2న దేశ వ్యాప్తంగా లక్షలాది సంతకాలు సేకరణ చేపట్టి కేంద్ర ప్రభుత్వానికి పంపాలని హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో దక్షిణాది రాష్ట్రాలు, పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఆర్‌టిసి యూనియన్లు నిర్ణయించాయి. సెప్టెంబరు 12న జాతీయ నిరసన దినం పాటించేందుకు కూడా ఆర్‌టిసి ఉద్యోగ సంఘాలు సమాయత్తమవుతున్నాయి. ఎలక్ట్రికల్ బస్సుల పాలసీలో మార్పులు తీసుకురాకపోతే దేశ వ్యాప్తంగా ఆర్‌టిసి ఉద్యోగులు ఉద్యమ బాట పట్టే దిశగా అడుగులు వేస్తున్నారు. ఆర్‌టిసిని రక్షించడానికి ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ పిలుపునిచ్చింది. అంతేకాకుండా విద్యుత్ బస్సుల సమస్యపై నవంబరులో చెన్నై కేంద్రంగా జాతీయ సదస్సు నిర్వహించేందుకు కసరత్తు చేయనున్నట్లు ఆర్‌టిసి ఉద్యోగ సంఘాలు వెల్లడించాయి. విద్యుత్ బస్సుల కొనుగోలు, నిర్వహణ, బస్సులను నడిపేది కూడా ప్రైవేట్ ఆపరేటర్లేనని ఉద్యోగ సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఎలక్ట్రిక్ బస్సులపై సబ్సిడీ, వయబిలిటీ గ్యాప్ నిధులు ప్రైవేట్ ఆపరేటర్లకు ఇవ్వనున్నారని, అంతేకాకుండా ఆదాయంతో సంబంధం లేకుండా ఆర్‌టిసి, ఆపరేటర్లకు కిలోమీటర్ల ప్రాతిపదికన డబ్బు చెల్లించాల్సి ఉంటుందని విద్యుత్ బస్సుల పాలసీలో స్పష్టంగా పేర్కొన్నట్లు ఉద్యోగ సంఘాలు తెలిపాయి. విద్యుత్ బస్సుల పాలసీ పూర్తి స్థాయిలో అమలు కాగానే ఆయా బస్సుల్లో రాయితీలు కనుమరుగవుతాయని ఉద్యోగ సంఘాలు పేర్కొంటున్నాయి.

ఆర్‌టిసి డిపోల మూసివేసేందుకే గ్రాస్ కాస్ట్ కాంట్రాక్టు

దేశ వ్యాప్తంగా పిఎం-ఇ బస్సుల పథకం ప్రవేశపెట్టడం ద్వారా ఆర్‌టిసిల ఉనికే సవాలుగా మారనుంది. డిపోల మూసివేతకు (గ్రాస్ కాస్ట్ కాంట్రాక్ట్) దారితీస్తుందనే ఆందోళన ఉద్యోగ సంఘాలు వ్యక్తం చేస్తున్నాయి. రాష్ట్రంలో ఇప్పటికే 12 బస్సు డిపోలను గుర్తించి, మొదటి దశలో ప్రైవేట్ ఎలక్ట్రిక్ బస్సు ఆపరేటర్లకు అప్పగించారు. రెండో దశలో మరో 19 డిపోల మూసివేతకు ప్రభుత్వం సన్నాహాలు చేయడంతోపాటు ఆయా డిపోలను కార్పొరేట్లకు టూరిజం పాలసీ లేక పారిశ్రామికవేత్తలను ఆకర్షించి పెట్టుబడులు రాబట్టేందు కంటూ ప్రభుత్వాలు సన్నాయి నొక్కులు నొక్కుతున్నాయి. తాజాగా విజయవాడ నడిబొడ్డున అత్యంత విలువైన పాత బస్టాండును లూలూ కంపెనీకి అప్పగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే.

వయబిలిటీ ఫండ్‌ను ఆర్‌టిసిలకు ఎందుకివ్వరు?

- ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్

ఎలక్ట్రిక్ బస్సులకు సంబంధించి ప్రైవేట్ ఆపరేటర్లకు ఇవ్వనున్న వయబిలిటీ గ్యాప్ ఫండ్‌ను ఆర్‌టిసికి ఎందుకివ్వకూడదని ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ ప్రశ్నించింది. ఎలక్ట్రిక్ బస్సుల తయారీని జోనల్ వర్కుషాప్, ఆర్‌టిసి బస్ బాడీ బిల్డింగ్ యూనిట్ల సహకారంతో తక్కువ ఖర్చుతో నాణ్యతతో చేయొచ్చని ప్రభుత్వానికి ఫెడరేషన్ సూచించింది.

ప్రకటనల్లోనే ఆర్భాటం.. ఆచరణలో విఫలం

- గంటల తరబడి రాని ఆర్‌టిసి బస్సులు
- మహిళా ప్రయాణికుల పడిగాపులు
- అధికారుల తీరుపై ఆగ్రహం

ప్రజాశక్తి - కదిరి టౌన్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఉచిత బస్సు ప్రయాణం నామమాత్రమే అన్న వాదనలు మహిళ ప్రయాణికుల నుంచి వినిపిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీ మేరకు ఈనెల 15న స్వాతంత్ర్యం దినోత్సవం సందర్భంగా స్త్రీశక్తి పథకం కింద ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యాన్ని ప్రారంభించింది. అయితే ఈ పథకం కార్యరూపం దాల్చకముందు కదిరి డిపో పరిధిలో ప్రతి రూట్ లో 10 నిమిషాలకు ఒక్కబస్సును ఆర్టీసీ అధికారులు నడిపేవారని ప్రస్తుతం ఉచిత బస్సు ప్రయాణం అమలులోకి వచ్చాక గంటకు ఒక్క బస్సు వస్తోందని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులు నడుపుతామని అటు ప్రభుత్వం ఇటు అధికారులు ఉపన్యాసాలు ఇచ్చారని ఈ పథకం ప్రారంభమై మూడు రోజులు అయినా ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవటం లేదని విమర్శిస్తున్నారు. గ్రామాలకు పట్టణాలకు మండల కేంద్రాలకు వెళ్ళే ప్రయాణికులు బస్సుల రాక కోసం ప్లాట్ ఫామ్‌లో గంటల తరబడి నిలబడుతున్నామని వాపోతున్నారు. అదనపు బస్సులు ఏర్పాటు చేస్తామన్న మాటలు ఏమయ్యాయని ప్రయాణికులు అధికారులను నిలదీస్తున్నారు. అదేవిధంగా అంతరాష్ట్ర పల్లెవెలుగు సర్వీసుల్లో సైతం ఉచిత బస్సు ప్రయాణం అమలు కాలేదని మహిళలు వాపోతున్నారు. కదిరి నుండి ఓడిసి, మహమ్మదాబాద్, అమడగూరు మీదుగా బాగేపల్లికి, అలాగే కదిరి నుండి కుంట్లపల్లి , తుమ్మల , అమడగూరు మీదుగా బిల్లూరుకి పల్లె వెలుగు బస్సులు రాక పోకలు సాగిస్తున్నాయి. ఈ బస్సులను ఆర్‌టిసి అధికారులు అంతరాష్ట్ర సర్వీసులుగా పరిగణనలోకి తీసుకొని మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేయలేదు. ఈ సర్వీసులు దాదాపు 50 కిలోమీటర్లు మేర గ్రామాల మధ్య రాకపోకలు సాగిస్తున్నాయి. ఈ రూట్ గుండా ప్రయాణించే మహిళలు తామేమీ పాపం చేశామని ప్రశ్నిస్తున్నారు. తాము ఉచిత బస్సు ప్రయాణానికి అర్హులం కాదా అని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా పుట్టపర్తి ఎమ్మెల్యే సింధూర ఆర్టీసీ అధికారులు స్పందించి ఈ బస్సులలో ఉచిత బస్సు ప్రయాణం కల్పించాలని వారు కోరుతున్నారు.

ఉపరాష్ట్రపతి అభ్యర్థిపై 'ఇండియా' చర్చలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ప్రతిపక్ష ఇండియా బ్లాక్ ఉపరాష్ట్రపతి అభ్యర్థి ఖరారుపై చర్చలు తుది దశకు చేరుకున్నాయి. మంగళవారం అభ్యర్థిని ప్రకటించే అవకాశం ఉంది. దేశంలోనే రెండో అత్యున్నత రాజ్యాంగ పదవికి జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన రాజకీయేతర వ్యక్తిని నిలబెట్టాలని ప్రతిపక్షం కోరుకుంటున్నట్లు సమాచారం. తమిళనాడుకు చెందిన భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) శాస్త్రవేత్త పేరును డిఎంకె నాయకులు ప్రతిపాదించినట్లు తెలుస్తోంది. సీనియర్ డిఎంకె నాయకుడు తిరుచ్చి శివ పేరు కూడా వినిపిస్తోంది. ఉపరాష్ట్రపతిని ఏకగ్రీవంగా ఎన్నుకోవాలని రాజ్యసభ ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గేతో సహా ప్రతిపక్ష పార్టీల నాయకులను రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కోరారు. ఎన్‌డిఎ ఉపరాష్ట్రపతి అభ్యర్థి సిపి రాధాకృష్ణన్ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీని కలిశారు. ఈనెల 20న రాధాకృష్ణన్ నామినేషన్ వేసే అవకాశం ఉంది. మంగళవారం జరిగే ఎన్‌డిఎ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో రాధాకృష్ణన్‌ను సన్మానించనున్నట్లు తెలుస్తోంది. సెప్టెంబర్ 9న ఉపరాష్ట్రపతి ఎన్నిక జరగనుంది. ఈనెల 21తో నామినేషన్ల గడువు ముగుస్తుంది.

ఐఇడి పేలి జవాన్ మృతి

- ముగ్గురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా భోపాలపట్నం పోలీస్ స్టేషన్ ప్రాంతంలోని ఉల్లూర్ సమీప అటవీ ప్రాంతంలో మావోయిస్టులు అమర్చిన మందు పాతర పేలడంతో ఓ జవాన్ ప్రాణం కోల్పోయారు. ముగ్గురు డిఆర్‌జి సైనికులు తీవ్రంగా గాయపడ్డారని జిల్లా ఎస్‌పి జితేంద్ర యాదవ్ తెలిపారు. మరణించిన డిఆర్‌జి జవాన్ దినేష్‌ మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. బస్తర్ ఐజి సుందర్‌రాజ్, పోలీసు అధికారి కమాండెంట్ కశ్యప్, పోలీసు అధికారులు నివాళి అర్పించారు. జవాన్ కుటుంబాన్ని ఓదార్చారు. అన్ని విధాలుగా సహాయం చేస్తామని భరోసా ఇచ్చారు. గాయపడిన జవాన్లకు చికిత్స కొనసాగుతోంది.

ట్రంప్‌తో భేటీ వివరాలపై మోడీకి పుతిన్ ఫోన్!

న్యూఢిల్లీ : అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో ఇటీవల అలాస్కాలో జరిగిన సమావేశ వివరాలను రష్యా అధ్యక్షుడు పుతిన్, సోమవారం ప్రధాని మోడీకి తెలియజేశారు. ఉక్రెయిన్‌తో యుద్ధం ఆపాలన్న లక్ష్యంతో సాగిన ఈ చర్చల్లో పురోగతి వున్నప్పటికీ ఎలాంటి ఒప్పందం కుదరలేదు. ఆ చర్చలు జరిగిన మూడు రోజుల తర్వాత పుతిన్, మోడీకి ఫోన్ చేసి మాట్లాడారు. ఉక్రెయిన్ సమస్యకు శాంతియుత పరిష్కారాన్ని కనుగొనాలన్నదే భారత్ వైఖరని ఈ సందర్భంగా మోడీ స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించిన ప్రయత్నాలకు మద్దతిస్తామన్నారు. ఈ మేరకు ఎక్స్‌లో మోడీ పోస్టు పెట్టారు. ఫోన్ చేసినందుకు, చర్చల వివరాలను పంచుకున్నందుకు థ్యాంక్స్ మై ఫ్రెండ్ ప్రెసిడెంట్ పుతిన్ అని మోడీ ఆ పోస్టులో వ్యాఖ్యానించారు. రాబోయే రోజుల్లో ఇలాగే పరస్పరం అభిప్రాయాలు పంచుకోవాలని కోరుకుంటున్నానని ఆ పోస్టులో పేర్కొన్నారు.

డిసెంబరు 28న మయన్మార్ ఎన్నికల ప్రక్రియ ప్రారంభం!

యాంగాన్ : మయన్మార్‌లో ఎన్నికల ప్రక్రియ డిసెంబరు 28న ప్రారంభమవుతుందని జుంటా సోమవారం ప్రకటించింది. దేశంలో అంతర్యుద్ధం జరుగుతూ చాలాభాగం ఆర్మీ నియంత్రణలో లేని కారణంగా పోతోంది. అటువంటి సమయంలో ఈ ఎన్నికల గురించి మాట్లాడుతున్నందున ఒక సంస్థకూడా అంతర్జాతీయ పర్యవేక్షకులు పరిగణిస్తున్నారు. సైనిక పాలన కొనసాగించడానికి ఇదొక ఎత్తుగడ అని వ్యాఖ్యానిస్తున్నారు. బహుళ పార్టీ ప్రజాతంత్ర సాధారణ ఎన్నికల తొలి దశ డిసెంబరు 28 ఆదివారం ప్రారంభమవుతుందని మయన్మార్ యూనియన్ ఎన్నికల కమిషన్ ఒక ప్రకటనలో తెలిపింది.

అదానీకి అసోంలో ఓ జిల్లానా?

- బిజెపి సర్కార్ తీరుపై హైకోర్టు షాక్
- 14వేల గిరిజన కుటుంబాలను తరలించి అదానీ గ్రూపునకు 1860 ఎకరాల భూమి ఇవ్వటంపై ఆశ్చర్యం
- కేటాయింపునకు సంబంధించిన పత్రాలు కోరిన న్యాయస్థానం



అదానీ కంపెనీకి భారీ స్థాయిలో భూముల కేటాయింపుపై ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్న న్యాయమూర్తి, వాదనలు వినిపిస్తున్న న్యాయవాదులు

గువహతి : అసోం రాష్ట్ర ప్రభుత్వ తీరుపై గౌహతి హైకోర్టు ఆశ్చర్యం వ్యక్తం చేసింది. సిమెంట్ ఫ్యాక్టరీ కోసం అదానీ గ్రూపునకు 1860 ఎకరాల భూమి (3000 బిఘాలను) అప్పగించాలని నిర్ణయించిన బిజెపి సర్కారు తీరుపై షాక్‌కు గురైంది. 14వేల గిరిజన కుటుంబాలను తరలించి, ఇంత భారీ మొత్తంలో భూమిని అప్పగించటంపై కోర్టులో జరిగిన విచారణపై హైకోర్టు జడ్జి జస్టిస్ సంజయ్ కుమార్ మేధీ ఆశ్చర్యపోయారు. ఈ విషయాన్ని ఆ జడ్జి కూడా నమ్మలేకపోయారు. "ఇదేమైనా జోకా? మీరు మొత్తం జిల్లాను ఇస్తున్నారా?" అని తన ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు. ఈ మేరకు సిమెంట్ కంపెనీ తరఫున వాదించిన న్యాయవాదిని గౌహతి హైకోర్టు తీవ్రంగా విమర్శించింది. సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు కోసం దాదాపు మొత్తం దిమా హసావో జిల్లాను కేటాయించటంపై జడ్జి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ జిల్లా రాజ్యాంగంలోని ఆరో షెడ్యూల్ ప్రకారం స్థానిక తెగల హక్కులు, ప్రయోజనాలకు ప్రాధాన్యతనివ్వాలని ఆయన అభిప్రాయపడ్డారు. అదానీ గ్రూపునకు కేటాయించిన భూమి ఉమ్రాంగ్సోలో ఉన్నది. ఇది వేడి నీటి బుగ్గలు, వలసపక్షులు, వన్యప్రాణులకు ప్రసిద్ధి చెందినది. ఫ్యాక్టరీ కోసం ఆ భూమి అవసరమని న్యాయవాది వాదించారు. దానిని బంజరు భూమిగా తెలిపారు. అయితే జోక్యం చేసుకున్న జడ్జి... "అది బంజరు భూమి అని మాకు తెలుసు. 3000 బిఘాలు. ఇదే రకమైన నిర్ణయం? ఇదేమైనా జోక్ లేక ఇంకేమైనా..?" అని ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు. ఇంత మొత్తంలో భూమిని ఒక కంపెనీకి కట్టబెట్టడాన్ని తప్పుబట్టారు. ప్రజాప్రయోజనాలకు అన్నిటి కంటే ప్రాధాన్యతనివ్వాలని చెప్పారు. తాము ఎవరి భూమిని తీసుకోవటం లేదని, టెండర్ ద్వారా లీజు లభించిందని న్యాయవాది వాదించారు. సిమెంట్ ఫ్యాక్టరీ కోసం జరిపిన భూకేటాయింపు విధానానికి సంబంధించిన పత్రాలను సమర్పించాలని నార్త్‌కాచర్ హిల్స్ అటానమస్ కౌన్సిల్ (ఎన్‌సిహెచ్‌ఎసి)ని హైకోర్టు జడ్జి ఆదేశించారు. తదుపరి విచారణను సెప్టెంబర్ 1కి వాయిదా వేశారు. హైకోర్టులో జరిగిన ఈ విచారణకు సంబంధించిన వీడియో ఒకటి సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ఈ వీడియోలో జడ్జి సిమెంట్ ఫ్యాక్టరీ పేరును అడగటం, దానికి కేటాయించిన 3000 బిఘాల భూకేటాయింపు గురించి తెలుసుకుని 'మొత్తం జిల్లా...', '3000 బిఘాలు...' అని పలుసార్లు ఆశ్చర్యపోవటం అందులో కనిపిస్తుంది. ఈ వీడియోను పలువురు సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేస్తున్నారు. 14వేల గిరిజన కుటుంబాలను తరలించి, అదానీకి భూమి అప్పగించిన బిజెపి ప్రభుత్వ తీరు పట్ల ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. మైనారిటీలు, గిరిజనులు, దళితుల హక్కుల గురించి పట్టని హిమంత ప్రభుత్వం.. బడా వ్యాపారవేత్తలకు లక్షల చదరపు అడుగుల భూమిని కేటాయిస్తున్నదని నెటిజన్లు తీవ్రంగా విమర్శిస్తున్నారు.

ఇంటింటికీ తిరిగితే ఇంతమంది తొలగింపు ఎలా?

- సిఇసిని ప్రశ్నించిన స్టాలిన్

చెన్నై : ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) జ్ఞానేష్ కుమార్ ఆదివారం నిర్వహించిన పత్రికా సమావేశం ఓట్ల చౌర్యంపై ఇండియా బ్లాక్ ప్రస్తావించిన అంశాలకు సమాధానాలు ఇవ్వడం కన్నా మరిన్ని ప్రశ్నలను లేవనెత్తిందని తమిళనాడు ముఖ్యమంత్రి, డిఎంకె అధ్యక్షుడు స్టాలిన్ సోమవారం వ్యాఖ్యానించారు. "అనేక ప్రశ్నలు తలెత్తాయి... ఇంటింటికీ తిరిగి వివరాలు నమోదు చేసినప్పుడు అర్హులైన ఓటర్లు ఇంతమంది ఎలా తొలగించబడ్డారు?' అని ఆయన ఎక్స్ పోస్టులో ప్రశ్నించారు. 'కొత్త ఓటర్ల నమోదు అసాధారణ రీతిలో చాలా తక్కువగా వుంది. ఈ యువ ఓటర్లందరినీ లెక్కించారా? క్వాలిఫైయింగ్ తేదీ నాటికి 18 ఏళ్లు వచ్చిన యువతను ఎంతమందిని చేర్చుకున్నారో తెలియజేసే డేటా ఏమైనా రూపొందించారా?' అని స్టాలిన్ ప్రశ్నించారు. ఓటర్ల నమోదు నిబంధనలు-1960 కింద పేర్కొన్నట్లుగా విచారణ, రెండు అప్పీళ్లకు సంబంధించిన పద్ధతి, వాటి టైమ్‌లైన్ల వల్ల బీహార్‌లో రాబోయే ఎన్నికల్లో పెద్ద సంఖ్యలో ఓటర్లు బహిష్కరించబడవచ్చని ముఖ్యమంత్రి చెప్పారు. "ఈ సమస్యను భారత ఎన్నికల కమిషన్ పరిష్కరిస్తోందా?" అని స్టాలిన్ నిలదీశారు. ఇతర రాష్ట్రాల్లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ చేపట్టే సమయంలో ఈ ఆచరణాత్మకమైన ఇబ్బంది లను ఇసి పరిగణనలోకి తీసుకుంటుందా అని స్టాలిన్ ప్రశ్నించారు. "ఈ ఏడాది మే 1వ తేదీన నోటిఫికేషన్‌లో పేర్కొన్న ప్రక్రియను చేపట్టడం ద్వారా ఓటర్ల జాబితా నుండి చనిపోయిన వారి పేర్లను తొలగించాలని మేం జులై 17న ఇసికి విజ్ఞప్తి చేశాం. ఇది ఎప్పుడు జరుగుతుంది? ఓటరునని నిరూపించుకోవడానికి అంగీకరించే పత్రాల జాబితాలో ఆధార్‌ను చేర్చడానికి ఇసిని అడ్డుకుంటున్న అంశం ఏమిటి? స్వేచ్ఛగా, సక్రమంగా ఎన్నికలు నిర్వహించాలన్నది ఇసి నిజమైన లక్ష్యమైనట్లైతే మరింత పారదర్శకంగా, ఓటరుకు అనుకూలంగా ఎందుకు వుండడం లేదు?' అని స్టాలిన్ ప్రశ్నల వర్షం కురిపించారు.

22న విచారణకు హాజరుకండి

- సుప్రీం రక్షణ కల్పించినా... 'ది వైర్' సంపాదకుడికి గువాహతి పోలీసుల సమన్లు

గువాహతి : ఆపరేషన్ సిందూర్‌పై ప్రచురితమైన వార్తకు సంబంధించి దాఖలైన కేసులో ఈ నెల 22న తన ఎదుట హాజరు కావాలంటూ 'ది వైర్' పోర్టల్ వ్యవస్థాపక సంపాదకుడు సిద్దార్థ వరదరాజన్‌కు గువాహతి క్రైమ్ బ్రాంచ్ పోలీసులు సమన్లు జారీ చేశారు. అస్సాం పోలీసులు దాఖలు చేసిన మరో ఎఫ్ఐఆర్ కింద వరదరాజన్‌కు, పోర్టల్‌ను నిర్వహిస్తున్న ఫౌండేషన్ సభ్యులకు అరెస్ట్ నుంచి రక్షణ కల్పిస్తూ సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసినప్పటికీ గువాహతి పోలీసులు ఈ సమన్లు జారీ చేయడం గమనార్హం. వేరే జిల్లాలో దాఖలైన కేసుకు సంబంధించి సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసిందని, కాబట్టి ఆ ఆదేశాలు గువాహతి జిల్లాకు వర్తించవని పోలీస్ జాయింట్ కమిషనర్ అంకుర్ జైన్ వితండవాదం చేశారు. తాజా ఆదేశాల ప్రకారం వరదరాజన్ ఈ నెల 22న ఉదయం 11.30 గంటలకు పాన్‌బజార్‌లోని క్రైమ్ బ్రాంచ్ పోలీస్ స్టేషన్‌లో విచారణాధికారి ఎదుట హాజరు కావాల్సి ఉంటుంది. అరెస్ట్ నుంచి వరదరాజన్‌కు రక్షణ కల్పించిన కేసు జూలై 11న మోరిగాన్ పోలీస్ స్టేషన్‌లో నమోదైంది. భారతీయ న్యాయ సంహిత లోని సెక్షన్ 152 కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అప్పుడు ఏ ఆరోపణలతో కేసు నమోదు చేశారో తాజా కేసులోనూ అవే ఆరోపణలు మోపారు.

ప్రశ్నిస్తే ఎదురుదాడి

(మొదటి పేజీ తరువాయి)

ఒక పార్టీకి అనుకూలంగా ఉండే కొంతమంది అధికారుల చేతుల్లో ఉందని స్పష్టమైందని విమర్శించారు. రాజకీయ పార్టీలను భయపెట్టొచ్చని ఇసి భావిస్తోందని, అధికారులు వచ్చి వెళ్లిపోతారని, కానీ సభ ఎల్లప్పుడూ వారి చర్యలకు సాక్ష్యమిస్తుందని అన్నారు. తాము వారిపై నిఘా పెడతామని, రాబోయే కాలంలో తగిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఎస్‌పి నేత రామ్‌గోపాల్ యాదవ్ మాట్లాడుతూ రాహుల్ గాంధీ ఫిర్యాదు చేసినందుకు అఫిడవిట్ సమర్పించాలని ఇసి అడుగుతోందని, 2022లో ఓటర్ల జాబితా నుంచి 18,000 మంది ఓటర్లను తొలగించారనే ఫిర్యాదుతో తమ పార్టీ అఫిడవిట్లు సమర్పించినా ఎందుకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. 2024 ఉత్తరప్రదేశ్ ఎన్నికల్లో బిఎల్‌ఓలను మార్చడంపై, మెయిన్‌పురిలో ఎన్నికల సమయంలో ఒక వర్గానికి చెందిన వారికే పోస్టింగ్ ఇవ్వడంపై ఫిర్యాదు చేసినా ఇసి ఎటువంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. ప్రతిపక్షాల ఫిర్యాదులను ఎన్నికల కమిషన్ ఎల్లప్పుడూ విస్మరించిందని చెప్పారు. డిఎంకె ఎంపి తిరుచ్చి శివ మాట్లాడుతూ బీహార్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)పై పార్లమెంటులో చర్చకు ప్రభుత్వం ఎందుకు అనుమతించడం లేదని ప్రశ్నించారు. బీహార్‌లో ఎస్ఐఆర్ ఎందుకు తొందరపాటుగా నిర్వహిస్తున్నారు? అర్హత కలిగిన ఓటర్లను ఇంత పెద్ద సంఖ్యలో ఎలా తొలగిస్తారు? అని ప్రశ్నించారు. ఈ సమస్య రాజకీయ పార్టీల గురించి కాదని, దేశంలోని సామాన్యుల గురించి అని అన్నారు.

సిఇసి తన పదవిలో కొనసాగే హక్కు కోల్పోయారు : సిపిఎం ఎంపి బ్రిట్టాస్

సిపిఎం ఎంపి జాన్ బ్రిట్టాస్ మాట్లాడుతూ సిఇసి ప్రతిపక్ష పార్టీలపై యుద్ధం ప్రకటించారని, తన రాజ్యాంగ పదవిలో పనిచేసే హక్కును కోల్పోయారని అన్నారు. ఇసిని తన 'బి' జట్టుగా చేసుకోవాలనే రహస్య ఉద్దేశం కేంద్ర ప్రభుత్వానికి మొదటి నుంచీ ఉందని, అందుకే 2023లో సుప్రీంకోర్టు ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం తీర్పును తప్పించుకోవడానికి ఒక చట్టాన్ని తీసుకొచ్చిందని విమర్శించారు. కేరళ నుండి కాశ్మీర్ వరకు మొత్తం దేశం ఓటర్ల జాబితాను నకిలీలతో నింపడానికి కుట్ర జరిగిందని, కేరళలో ఒక్క స్థానాన్ని కూడా బిజెపి మోసపూరిత మార్గాల్లోనే గెలుచుకుందని చెప్పారు. రాజ్యాంగ సంస్థ అయిన ఇసి నియమాలకు కట్టుబడి ఉండేలా ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలపడం తప్ప వేరే మార్గం లేదని అన్నారు. డేటా మెషిన్ - రీడబుల్ కాదని ఇసి అబద్ధం చెబుతుందని, 2018లో జస్టిస్ సిక్రీ ఇచ్చిన తీర్పులో అది వ్యక్తిగత గోప్యతను ఉల్లంఘిస్తుందని చెప్పలేదని అన్నారు. 65 లక్షల ఓట్ల తొలగింపు తరువాత, 7.24 కోట్లకు జాబితాను కుదించారని వారిలో ఎంతమంది పత్రాలను సమర్పించారో సమాధానం ఇవ్వడానికి ఇసి నిరాకరిస్తుందని విమర్శించారు. చనిపోయిన వ్యక్తులు ముసాయిదా జాబితాలో ఉన్నారని, జీవించి ఉన్న వ్యక్తులు తొలగించిన జాబితాలో ఉన్నారని చెప్పారు. బిఎల్‌వోలు స్వయంగా ఫారమ్‌లపై సంతకం చేయడం వల్లే ఇలా జరిగిందని విమర్శించారు.

శివసేన ఎంపి అరవింద్ సావంత్ మాట్లాడుతూ బిజెపి ప్రతినిధుల్లా ఎన్నికల కమిషన్ అధికారులు మాట్లాడారని అన్నారు. మహారాష్ట్ర ఎన్నికలకు సంబంధించి సిసిటివి ఫుటేజ్‌ను అడిగినా ఇవ్వలేదని అన్నారు. మహిళల గోప్యత, భద్రతకు సంబంధించిన అంశమని, వీడియోలను ఇవ్వలేమని ఇసి చెప్పడాన్ని బట్టి, ఎన్నికల కమిషన్ బిజెపిని ఎలా కాపాడటానికి ప్రయత్నిస్తుందో మీరు అర్థం చేసుకోవాలని అన్నారు.

ఆర్‌జెడి నేత మనోజ్ ఝా మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ చనిపోయినట్లు ప్రకటించిన కొంతమంది జీవించి ఉన్న వ్యక్తులను సుప్రీంకోర్టులో ప్రవేశపెట్టామని, దీనిపై ఎన్నికల కమిషన్ నోరు మెదపలేదని అన్నారు. రాజ్యాంగం ముసుగులో ఎన్నికల కమిషన్ దానిని ముక్కలు చేయకూడదని స్పష్టం చేశారు.

టిఎంసి ఎంపి మహువా మెయిత్రా మాట్లాడుతూ ఇసి 65 లక్షల తొలగింపులలో 22 లక్షల మంది చనిపోయిన వ్యక్తులు అని చెప్పిందని, 2024 లోక్‌సభ ఎన్నికలు మోసపూరితంగా జరిగాయని చెప్పాలనుకుంటారా? అని ప్రశ్నించారు. ప్రస్తుత, గత ఎన్నికల కమిషనర్లందరినీ విచారించాలని డిమాండ్ చేశారు. మోసపూరిత జాబితాల ఆధారంగా ఉన్న ప్రస్తుత లోక్‌సభను వెంటనే రద్దు చేయాలని అన్నారు.

ఆప్ ఎంపి సంజయ్ సింగ్ మాట్లాడుతూ బీహార్‌లో ఎక్కువ భాగం వరదల్లో మునిగిపోయిందని, ఆ ప్రజలను పత్రాల కోసం ఎలా అడుగుతున్నారని అన్నారు. చొరబాటుదారులు, ఢిల్లీలో నకిలీ ఓట్లపై ఫిర్యాదు చేసినా ఇసి ఎటువంటి చర్య తీసుకోలేదని పేర్కొన్నారు. సిసిటివి ఫుటేజ్ ఇస్తే మహిళల గోప్యత ఉల్లంఘించబడుతుందని ఎన్నికల కమిషన్ చెబుతోందని, వార్తా ఛానెల్‌లు మహిళలు ఓటు వేయడానికి వరుసలో నిలబడి ఉన్నట్లు చూపించినప్పుడు గోప్యత ఉల్లంఘించబడదా? అని ప్రశ్నించారు.

సిఇసి జ్ఞానేష్ కుమార్‌పై అభిశంసన తీర్మానం..!

దేశంలో ఓట్ల దొంగతనం, ఎన్నికల్లో అవకతవకల ఆరోపణల నేపథ్యంలో కేంద్ర ఎన్నికల కమీషనర్ జ్ఞానేష్ కుమార్‌పై అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టాలని ప్రతిపక్షాలు యోచిస్తున్నట్లు తెలుస్తోంది. సోమవారం పార్లమెంట్‌లో రాజ్యసభ ప్రతిపక్షనేత మల్లికార్జున ఖర్గే కార్యాలయంలో ఇండియా బ్లాక్‌కు చెందిన ఫ్లోర్ లీడర్లు సమావేశమయ్యారు. ఈ సమావేశంలో సిఇసిపై అభిశంసన తీర్మానం అంశాన్ని చర్చించినట్లు సమాచారం. సిఈసిపై అభిశంసనకు త్వరలో ఓ నిర్ణయం తీసుకుంటామని కాంగ్రెస్ ఎంపి ఇమ్రాన్ ప్రతాప్‌గర్హీ అన్నారు.

బీహార్‌లో తొలగించిన ఓటర్ల జాబితా విడుదల

- ఇసి వెబ్‌సైట్‌లో 65 లక్షల మంది వివరాలు

న్యూఢిల్లీ : బీహార్‌లో చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ద్వారా తొలగించిన అరవై ఐదు లక్షల ఓటర్ల జాబితాను ఎన్నికల కమిషన్ విడుదల చేసింది. ఈ జాబితాను ప్రజల పరిశీలన నిమిత్తం కమిషన్ అధికారిక వెబ్‌సైటులో ఉంచారు. ఈ నెల 14న సుప్రీంకోర్టు జారీ చేసిన ఆదేశాల మేరకు కేంద్ర ఎన్నికల సంఘం ఈ జాబితాను ప్రచురించింది. ప్రత్యేక సవరణ అనంతరం ఎన్నికల సంఘం తొలగించిన ఓటర్ల పేర్లు ఈ జాబితాలో ఉన్నాయి. జాబితాలో తమ పేర్లు ఉన్నాయా లేవా అనే విషయాన్ని సులభంగా పరిశీలించుకునేందుకు వీలుగా బీహార్ రాష్ట్ర ఎన్నికల సంఘం వెబ్‌సైటులో కొత్త లింకును యాక్టివేట్ చేశారు.

తొలగించిన ఓటర్ల పేర్లను, తొలగించడానికి కారణాలను... అంటే వారు చనిపోయారా లేక వలసపోయారా లేక రెండుచోట్ల ఓటు హక్కును కలిగి ఉన్నారా... జిల్లాల వారీగా ప్రచురించాలని సుప్రీంకోర్టు కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించిన విషయం తెలిసిందే. పోలింగ్ కేంద్రాల వారీగా తొలగించిన ఓటర్ల జాబితాలను జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయంలో ప్రదర్శించాలని కూడా సుప్రీంకోర్టు ఆదేశించింది. జిల్లాల ఎన్నికల అధికారులు ఆ జాబితాలను తమ సామాజిక మాధ్యమ వెబ్‌సైట్లలో ఉంచాలని సూచించింది. సమాచారాన్ని అన్ని వార్తా పత్రికలు, రేడియో, టీవీ తదితర మాధ్యమాల ద్వారా తెలియజేయాలని కూడా న్యాయస్థానం ఆదేశించింది. తొలగించిన ఓటర్ల జాబితాను ప్రతి బూత్ స్థాయి అధికారి (బిఎల్‌ఒ) వద్ద, పంచాయతీ కార్యాలయం వద్ద ఉంచాలని తెలిపింది.

ఇడిపై వ్యాఖ్యలన్నీ వాస్తవాల ఆధారంగా చేసినవే!

- స్పష్టం చేసిన సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ : డైరెక్టరేట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఇడి)కి వ్యతిరేకంగా సుప్రీం కోర్టు చేసే ఏ ప్రతికూల మౌఖిక వ్యాఖ్యలైనా పూర్తి నిష్పాక్షికంగా, వాస్తవాల ప్రాతిపదికన చేసేవేనని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్ తెలిపారు. ఇటువంటి వ్యాఖ్యలు ప్రజల్లో, అలాగే న్యాయ వ్యవస్థలో కూడా ఇడి పట్ల ఒక చెడు అభిప్రాయాన్ని కలగజేస్తాయని ఇడి తరపు న్యాయవాది పేర్కొన్న నేపథ్యంలో సిజెఐ సోమవారం ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ తరుణంలో తమిళనాడు తరపున వాదనలు వినిపిస్తున్న సీనియర్ న్యాయవాది కపిల్ సిబాల్ జోక్యం చేసుకుంటూ కోర్టు వ్యాఖ్యలతో నిమిత్తం లేకుండా ఇడి పట్ల ప్రజల్లో స్పష్టమైన అవగాహన వుందని వ్యాఖ్యానించారు. కోర్టు ఏమన్నా లేకపోయినా కూడా ప్రజల్లో ఇడి అంటే ఏమిటో ఒక వైఖరి నెలకొందని అన్నారు. తమిళనాడు మార్కెటింగ్ కార్పొరేషన్ కార్యాలయాలపై ఇడి దాడులను, సోదాలను సవాలు చేస్తూ తమిళనాడు ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. ఏప్రిల్‌లో ఈ సోదాలపై స్టే ఇవ్వడానికి మద్రాసు హైకోర్టు నిరాకరించడంతో ప్రభుత్వం సుప్రీంను ఆశ్రయించింది. దర్యాప్తులు చేపడుతున్నప్పుడు ఇడి అన్ని పరిమితులను దాటేస్తోందని మే 22న విచారణ సందర్భంగా సిజెఐ వ్యాఖ్యానించారు. రాష్ట్ర కార్పొరేషన్ పట్ల ఇడి చర్యలు దేశ సమాఖ్య వ్యవస్థ సూత్రాలను దారుణంగా ఉల్లంఘిస్తున్నాయని జస్టిస్ గవాయ్ అన్నారు. కార్పొరేషన్ నేరానికి ఎలా పాల్పడుతుంది? అని ఆయన ఇడి తరపున వాదనలు వినిపిస్తున్న అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్.వి.రాజును ప్రశ్నించారు. తమిళనాడు మార్కెటింగ్ కార్పొరేషన్ తరపున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహ్‌తగి మాట్లాడుతూ, ఉద్యోగుల ఫోన్లను క్లోనింగ్ చేశారని, ఆ ఫోన్లలో రహస్యమైన విషయాలు చాలా వుంటాయని చెప్పారు.

పరస్పర గౌరవం, ప్రయోజనాలే లక్ష్యంగా ఇరుదేశాల సంబంధాలు

- చైనా విదేశాంగ మంత్రితో జై శంకర్ భేటీ

న్యూఢిల్లీ : పరస్పర గౌరవం, పరస్పర సున్నితత్వం, పరస్పర ప్రయోజనాలు లక్ష్యంగా భారత్, చైనా సంబంధాలకు మార్గనిర్దేశనం జరగాలని కేంద్ర విదేశాంగ మంత్రి జై శంకర్ తెలిపారు. ప్రస్తుతం భారత్‌లో పర్యటిస్తున్న చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యితో భేటీ సందర్భంగా సోమవారం జై శంకర్ ఈ వ్యాఖ్యలు చేశారు. రెండు రోజుల పర్యటనకు వచ్చిన వాంగ్‌తో ఆయన విస్తృతంగా చర్చలు జరిపారు. ఇరు దేశాల మధ్య వున్న విభేదాలు వివాదాలుగా మారకూడదని జై శంకర్ అన్నారు. మన ద్వైపాక్షిక సంబంధాల గురించి సమగ్రంగా సమీక్షించుకోవడానికి ఈ భేటీ మంచి అవకాశాన్ని కల్పించిందని ఆయన వ్యాఖ్యానించారు. అంతర్జాతీయ పరిస్థితులపై, మరికొన్ని పరస్పర ప్రయోజనాలు కలిగిన అంశాలపై అభిప్రాయాలు పంచుకోవడానికి కూడా ఇది తగిన సమయమని అన్నారు. మన సంబంధాల్లో క్లిష్టమైన దశ కొనసాగినప్పటికీ, వాటన్నింటినీ దాటుకుని ముందుకు సాగాలనుకుంటున్నామని, ఇందుకు ఇరు పక్షాల నుంచి స్పష్టమైన, నిర్మాణాత్మకమైన వైఖరి అవసరమని అన్నారు. ఈ క్రమంలో మనం పరస్పర గౌరవం, ప్రయోజనాలు లక్ష్యంగా మన సంబంధాలు రూపుదిద్దుకోవాలన్నారు. సరిహద్దుల్లో శాంతి, సామరస్యతలను కొసాగించడమే మన సంబంధాలు సజావుగా ముందుకు సాగడానికి కారణమవుతాయని వాంగ్ తన ప్రకటనలో పేర్కొన్నారు. జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, ప్రధాని మోడీలతో మంగళవారం వాంగ్ సమావేశాలు జరపనున్నారు.

సెన్సెక్స్ 676 పాయింట్ల పెరుగుదల

ముంబయి : జిఎస్‌టిలో రెండు శ్లాబులను తెస్తామని కేంద్ర ఆర్థిక శాఖ ప్రతిపాదనకు తోడు భారత రేటింగ్‌ను పెంచుతూ ఎస్అండ్‌పి ప్రకటన చేయడం సోమవారం మార్కెట్లకు ప్రధాన మద్దతును అందించాయి. ఈ నేపథ్యంలోనే బిఎస్ఇ సెన్సెక్స్ 676 పాయింట్లు పెరిగి 81,274కు చేరింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 251.20 పాయింట్లు లాభపడి 24,882 వద్ద ముగిసింది. భారత సావరిన్ క్రెడిట్ రేటింగ్‌ను బిబిబి- నుంచి బిబిబికి అప్‌గ్రేడ్ చేస్తూ ఎస్అండ్‌పి చేసిన నిర్ణయం మార్కెట్‌పై సానుకూల ప్రభావం చూపింది. ఆటోమొబైల్ రంగం షేర్లలో భారీ కొనుగోళ్లు కనిపించాయి. మారుతి సుజుకి, హీరో మోటోకార్ప్, బజాజ్ ఫైనాన్స్, బజాజ్ ఆటో లాభపడగా, ఐటిసి, టెక్ మహీంద్రా అధికంగా నష్టపోయాయి.

రష్యా నుంచి భారత్ చమురు కొనొద్దు

- అమెరికా సలహాదారు హెచ్చరిక

వాషింగ్టన్ : రష్యా నుంచి భారత్ చమురు కొనుగోళ్లపై అమెరికా తన హెచ్చరికలను కొనసాగిస్తోంది. మాస్కో నుంచి ఇండియా ముడి చమురు కొనుగోళ్లను ఆపాలని అమెరికా సలహాదారు నవారో అన్నారు. ఉక్రెయిన్‌తో మాస్కో యుద్ధానికి భారత చమురు నిధులు ఎక్కువగా ఉపయోగపడుతున్నాయని.. వీటిని తక్షణం ఆపాలని వైట్‌హౌస్ వాణిజ్య సలహాదారు పీటర్ నవారో పేర్కొన్నారు. న్యూ ఢిల్లీ ఇప్పుడు రష్యా, చైనాతో సన్నిహితంగా ఉంటోందని పేర్కొన్నారు. అమెరికా వ్యూహాత్మక భాగస్వామిగా భారత్ పరిగణించబడాలనుకుంటే.. రష్యా, చైనాలతో వ్యాపార సంబంధాలను తగ్గించుకోవాలని పరోక్షంగా పేర్కొన్నారు. రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు చేస్తున్నందుకే తమకు లక్ష్యంగా మారిందన్నారు. రష్యా నుంచి చమురు కొనుగోళ్లను కొనసాగిస్తున్నందుకు భారతీయ వస్తువులపై అదనంగా 25 శాతం టారిఫ్‌లను విధిస్తూ ఇటీవల అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. దీంతో భారత్‌పై సుంకాల మొత్తం 50 శాతానికి చేరుతుంది. "రష్యా చమురును భారత్ కొనుగోలు చేయడం ద్వారా మాస్కోకు అవసరమైన డాలర్లను అందిస్తోంది. రష్యా, చైనాతో భారత్ సన్నిహిత సంబంధాలు నెరవేర్చితే అమెరికాకు చెందిన అత్యాధునిక సైనిక సామర్థ్యాలను ఇండియాకు బదిలీ చేయడం ప్రమాదకరమని భావిస్తున్నాము." అని నవారో పేర్కొన్నారు.

భారత్, పాక్‌లపై ఒక కన్నేసి వుంచాం

- అమెరికా విదేశాంగ మంత్రి వ్యాఖ్యలు

వాషింగ్టన్ : కాల్పుల విరమణ ఏ సమయంలోనైనా విచ్ఛిన్నం కావడానికి అవకాశాలు వుంటాయని, అందువల్ల ప్రతిరోజూ భారత్, పాకిస్తాన్‌ల మధ్య, కంబోడియా, థాయిలాండ్‌ల మధ్య ఏం జరుగుతోందో ఒక కన్నేసి వుంచామని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో వ్యాఖ్యానించారు. మూడున్నరేళ్ల సుదీర్ఘ యుద్ధం అనంతరం రష్యా, ఉక్రెయిన్ మధ్య శాశ్వత కాల్పుల విరమణ గురించి తాము ఆలోచించడం లేదని, ఇప్పుడే కాదు, భవిష్యత్తులో కూడా యుద్ధం గురించి ప్రస్తావన రాకుండా శాంతి ఒప్పందం కుదుర్చుకోవడంపై దృష్టి పెట్టామని ఒక ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. గత శుక్రవారం పుతిన్‌తో సమావేశమైనప్పుడు ట్రంప్ భారత్, పాక్‌ల మధ్య యుద్ధం ఆపడం గురించి గంటల వ్యవధిలోనే చాలాసార్లు చెప్పారు.

'చలో కరేడు' పై ఉక్కుపాదం

(మొదటి పేజీ తరువాయి)

ప్రజలు కరేడు వైపు పరుగులు తీశారు. దీంతో జాతీయ రహదారిపై ఉద్రిక్త పరిస్థితులు నెలకొ న్నాయి. పోలీసులకు, ఉద్యమకారులకు వాగ్వాదం జరిగింది. వి. శ్రీనివాస రావుతో పాటు మూలం రమేష్, ఎం. మోహన్‌రావు, గోగుల శ్రీనివాసులు తదితరులను బలవంతంగా అరెస్ట్ చేశారు. పెద్ద సంఖ్యలో పాల్గొన్న మహిళలను కూడా అదుపులోకి తీసుకున్నారు. కొందరిని వ్యాన్లలో పడేశారు. అరెస్ట్ చేసిన వారిని వలేటిపారిపాళెం, కందుకూరు, సింగరాయకొండ, తదితర పోలీసు స్టేషన్లకు తరలించారు. సాయంత్రం 5.30 గంటలకు సొంత పూచికత్తుపై విడుదల చేశారు. పోలీసుల ఆంక్షలకు, నిర్బంధానికి వ్యతిరేకంగా జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో ప్రదర్శనలు, ఆందోళనలు జరిగాయి.

కరేడులో కదం...

ఒకవైపు తీవ్ర నిర్బంధం అమలవుతుండగానే కరేడు గ్రామంలో ప్రజానీకం కదిలింది. పోలీసు ఆంక్షలను అధిగమించి గ్రామానికి చేరుకున్న రైతు, ప్రజా సంఘాల నాయకులతో కలిసి స్థానికులు కదం తొక్కారు. తొలుత వందలాదిమది స్థానిక శివాలయంలో పూజలు చేశారు. తమ భూములు కాపాడాలని కోరుతూ ప్రార్ధనలు చేశారు. గుడి చుట్టూ ప్రదర్శనలు చేశారు. సుమారు 400 కొబ్బరి కాయలు కొట్టారు. అనంతరం పెద్ద ఎత్తున నినాదాలుచేస్తూ గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. 'భూములు ఎవరికీ ఇవ్వం, మా భూములు మాకే ' అంటూ నినదించారు. ఈ నినాదాలతో కరేడు గ్రామం మారుమోగింది. వేపచెట్టు సెంటర్ వరకు చేరుకొని అక్కడ భారీ బహిరంగ సభ నిర్వహించారు. సభలో రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, అధ్యక్షులు వి.కృష్ణయ్య, రైతు కూలీ సంఘం నాయకులు చిట్టిపాటి వెంకటేశ్వర్లు, ఐఎఫ్‌టియు నాయకులు సాగర్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్రనాయకురాలు శివ నాగరాణి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.అజయ్‌కుమార్, వ్యకాస.జిల్లా కార్యదర్శి ఎం. పుల్లయ్య తోపాటు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు. ప్రజలు భారీ సంఖ్యలో కదలడంతోపాటు, నాయకులు ఒక్కసారిగా వేదికపై ప్రత్యక్షం కావడంతో పోలీసులు కంగు తిన్నారు. ప్రసంగించిన నేతలు ప్రజలకు తమ సంఘీభావాన్ని తెలిపారు. బలవంతపు భూ సేకరణను విరమించుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

కరేడులో భూముల్ని గుంజుకోలేరు : వి. శ్రీనివాసరావు

కరేడు ప్రాంతంలో మూడు పంటలు పండే భూములను కార్పొరేట్ల కోసం గుంజుకోలేరని వి. శ్రీనివాసరావు అన్నారు.

అరెస్ట్ చేసిన తరువాత ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇండోసోల్ కంపెనీ కోసం భూములను రైతుల నుండి గుంజుకోవడానికి ప్రభుత్వం ప్రయత్నించడం దుర్మార్గమన్నారు. భూములు ఇవ్వమని గ్రామస్తులు ఏకగ్రీవంగా తీర్మానం చేసినా, ఇళ్లు తొలగించాలని చూస్తున్న నేపథ్యంలో రైతు సంఘాల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో చలో కరేడు కార్యక్రమం నిర్వహించారని చెప్పారు. భూ సేకరణ ఎలా చేయకూడదో అనడానికి ఇదొక ఉదాహరణ అన్నారు. ప్రజలు, రాజకీయ పార్టీలు ఖండించాలన్నారు.

కరేడు భూసేకరణ వ్యతిరేక ఉద్యమంలో సోమవారం ఉత్కంఠ, ఉద్రిక్తత నెలకొంది....పోలీసుల హెచ్చరికలకు బెదరలేదు...జిల్లా వ్యాపితంగా హౌస్ అరెస్ట్ చేసినా బెదరక కరేడు వైపు రైతులు, ప్రజలు అడుగులేశారు... కరేడు గ్రామంలో " హర హర మహాదేవ. శంబోశంకరా... మా ఊరును కాపాడు.... మా పొలాలు కాపాడు " అంటూ గ్రామస్తులు, రైతులు, ప్రజలు పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు....కరేడు ప్రజలకు సంఘీభావం చెప్పడానికి "చలో కరేడు"కు పిలుపునిచ్చిన రైతు సంఘాలు, ప్రజా సంఘాల నాయకులు ..." కరేడు భూములను ఇండోసోల్‌కు తీసుకోవద్దు....పచ్చని కరేడును బతకనివ్వండి" అంటూ గ్రామంలోకి రావడానికి ప్రయత్నం చేసిన నాయకులను పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేశారు. లాక్కెళ్లి వ్యానుల్లో పడేశారు. మహిళలు పోలీసులతో వీరోచితంగా పోరాటాలు... ఎట్ట కేలకు అరెస్ట్ చేసి కందుకూరు నియోజకవర్గంలోని పలు పోలీసు స్టేషన్‌లో నాయకులను ఉంచారు.. సాయంత్రం 5.30 గంటలకు సొంత పూచికత్తుపై విడుదల చేశారు... శ్రావణ సోమవారం కరేడులో ఖాళీల రాజ్యం కనిపించింది. ప్రజలు నిర్వహించిన చలో కరేడు విజయవంతమైంది.


కరేడు గ్రామస్తులను అరెస్ట్‌చేసి వ్యాన్ ఎక్కిస్తున్న పోలీసులు


సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్‌ను, స్థానికులను అడ్డుకుంటున్న పోలీసులు

కరేడులో అక్రమ అరెస్టులకు సిపిఎం ఖండన

నెల్లూరు జిల్లా కరేడులో ఇండోసోల్ కంపెనీకి బలవంతంగా వేలాది ఎకరాల రైతుల భూములను కట్టబెట్టడాన్ని నిరశిస్తూ ప్రజా సంఘాలు ఇచ్చిన చలో కరేడు పిలుపుపై పోలీసులు నిర్బంధాన్ని ప్రయోగించడాన్ని, నాయకులను అక్రమంగా అరెస్టు చేయడాన్ని సిపిఎం రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. ప్రజాస్వామ్య పద్ధతిలో శాంతియుతంగా నిర్వహించతలపెట్టిన సభకు వెళుతున్న పార్టీ, రైతు, ప్రజా సంఘాల నాయకులను పోలీసులు అడ్డుకుని అరెస్టు చేయడం గర్హనీయమని పేర్కొంది. అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని కోరింది.

ఎన్ని నిర్బంధాలు పెట్టినా కరేడులో సభ నిర్వహించడాన్ని హర్షించింది. అరెస్టయిన వారిలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వి వెంకటేశ్వర్లు, దడాల సుబ్బారావు, సిపిఐఎంఎల్ నాయకులు లక్ష్మీరెడ్డి, లిబరేషన్ నాయకులు హరినాథ్, కె గణేష్, నల్లమడ రైతు ఉద్యమ నాయకులు కొల్లా రాజమోహన్, సిపిఎం నెల్లూరు జిల్లా కార్యదర్శి మూలం రమేష్, ప్రకాశం జిల్లా కార్యదర్శి ఎస్‌కె బాబు, కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం హరిబాబు, నెల్లూరు జిల్లా నాయకులు మోహనరావు, వెంగయ్య, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు. అలాగే చంద్ర రాజగోపాల్, కత్తి శ్రీనివాసులు, టి మాల్యాద్రి, కట్టా సతీష్‌ను కూడా నిర్బంధించారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా భూసేకరణకు వ్యతిరేకంగా పోరాడుతున్న ప్రజలపై నిర్బంధాన్ని ఆపాలని, ప్రభుత్వం తన మొండి వైఖరి విడనాడి ఇండోసోల్ కంపెనీకి భూముల కేటాయింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరిని నిరసించాలని ప్రజలకు, మేధావులకు విజ్ఞప్తి చేశారు.

జీవన సౌరభం

ఏమీ లేనప్పుడు ఓపిక,
అన్నీ ఉన్నప్పుడు ప్రవర్తన..
మనిషి వ్యక్తిత్వాన్ని
పెంచుతాయి.

మీ కోసం

ఆహార పదార్థాలు గోరువెచ్చగా
అయ్యాకే నిమ్మరసం చల్లాలి. వేడిగా
ఉన్నప్పుడు కలిపితే అందులోని సి
విటమిన్, పోషకాలు నశిస్తాయి.



మట్టి మనిషి నాటకం ఎంతో నచ్చింది....



మొన్నీమధ్య మా హాస్టల్ పిల్లలందరమూ మట్టి మనిషి అనే నాటకం చూడడానికి వెళ్ళాం. సాంబయ్య ఈ కథలో ముఖ్య పాత్ర. ఆయన పొలంలో పనిచేస్తూ కూలీలతో పనిచేయిస్తూ, చాలా కష్టపడి సేద్యం చేస్తూ ఉంటాడు. సాంబయ్య భార్య దుర్గమ్మ కొడుకుని కని పురిటిలోనే చనిపోతుంది. కొడుకుని సాంబయ్య కష్టపడి పెంచుతాడు, ఆ అబ్బాయికి చదువు అబ్బకపోవడంతో, పొలంపని నేర్పిస్తాడు. అయినా కొడుకు సోమరిపోతుగా తయారవుతాడు. ఆ తరువాత నాటకంలో ఎన్నో మలుపులు, బాధలు, మట్టి పనిచేస్తున్నావని సాంబయ్యకి జరిగే అవమానం అన్నీ అంశాలు ఆ మూడు గంటల నాటకంలో బాగా చూపించారు. ఈ నవలను రచించిన వాసిరెడ్డి సీతాదేవి గారికి, నాటికీకరించిన వల్లూరి శివప్రసాద్ గారికి, నటులందరికీ ఎన్నో అభినందనలు. 400 పేజీల పుస్తకాన్ని మూడు గంటల నాటకంగా తీర్చిదిద్దడంలో ఎంతోమంది కష్టపడ్డారని తెలుస్తుంది. ఈ హడావిడి ప్రపంచంలో ఇంతటి చక్కటి పని చేసిన వారందరికీ కృతజ్ఞతలు. సినిమా కన్నా ఇలా ప్రత్యక్షంగా నాటికలు చూడడం మా స్కూలు కల్పించిన గొప్ప అవకాశం. నాలుగు గంటలసేపు హాల్లో ఉన్న మాకు ఎటువంటి అలసట అనిపించలేదు. ఎంతో సంతోషంగా మేం తిరిగి హాస్టల్‌కి చేరుకున్నాం.



- కె. షణ్ముఖేశ్వర ప్రియ,
9వ తరగతి,
అరవింద హైస్కూలు,
కుంచనపల్లి.


సరైన అంకెలు వేయండి

6	+		=	14
+		+		+
	+	9	=	
=		=		=
	+	17	=	30

పిల్లలూ, ఇక్కడ ఇచ్చిన బాక్సులో ఒక్కో వరుసకు ఒక్కో జవాబు వచ్చేలా కొన్ని అంకెలు ఇచ్చాం. ఇచ్చిన క్లూ ఆధారంగా ఖాళీ గడుల్లో సరైన అంకెలు వేయండి.

నేను చేసిన బొమ్మ





ఎస్‌కె.తనీష,
7వ తరగతి,
వి.టి.హైస్కూల్,
రాజేంద్రనగర్,
విశాఖపట్నం.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

.. ఆ ఫొటోల్లోని నిజం మాట్లాడుతోంది!

సముద్ర అలలని అదిమి పెట్టాలనుకోవడం మతి మాలిన చర్య. సత్యాన్ని గొంతు నులిమి చంపేయాలనుకోవడం కూడా అలాంటి నిరంకుశ చర్యే. ప్రపంచంలో ఏ మూల ఏం జరిగినా, ఏ ప్రజలు ఎంతలా అన్యాయానికి గురయ్యారో తమ వార్తలతో, ఫొటోలతో వాస్తవాలని చూపిస్తారు జర్నలిస్టులు. ఈ క్రమంలో దాడులకు, హత్యలకు గురవుతున్నా సత్యం తరఫున నిలబడతారు. ఇజ్రాయిల్ దురాగతాలను రిపోర్టింగ్ చేస్తున్న అల్-జజీరా జర్నలిస్టులపై ఇటీవల ఇజ్రాయిల్ బాంబుదాడికి పాల్పడి హత్య చేసింది. రక్తపుమడుగులో పడి ఉన్న ఆ జర్నలిస్టుల నిర్జీవ శరీరాలను చూసి వారి మిత్రులే కాదు, గాజా ప్రజలు కూడా కన్నీరు కార్చారు. వారి దీన కథలను, బాధలను ప్రపంచానికి చూపించిన జర్నలిస్టు మిత్రులను పొట్టన పెట్టుకున్నారని ఆవేదన చెందారు. ప్రపంచ ఫొటోగ్రఫీ డే జరుపుకునే ఈ రోజున నిబద్ధత గల అలాంటి జర్నలిస్టులు, ఫొటోగ్రాఫర్ల గురించి ప్రతి ఒక్కరూ చర్చించుకోవాలి. వారి త్యాగాలను గుర్తు చేసుకోవాలి.





యుద్ధం, ప్రకృతి విపత్తులు, పాలకుల దౌర్జన్యాలు, అమాయకుల ఆర్తనాదాలు.. ఇలా ఎన్నెన్నో వార్తాకథనాలను కళ్లకు కట్టినట్లు చూపించడం అంత ఆషామాషీ కాదు. మొన్నీ మధ్య దేశాన్ని కుదిపేసిన కర్నాటక ధర్మస్థల మూకుమ్మడి హత్యల వార్తలు పాలకులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఈ వార్తలు రావడానికి ముందే ఎన్నో ఏళ్లుగా ఈ దురాగతాలను ఫొటోలతో సహా వెలికితీశారు కొంతమంది జర్నలిస్టులు. వాస్తవాలు చెప్పినందుకు వారిపై దాడులు చేశారు. అక్రమ కేసులు బనాయించారు. బెదిరించారు. ఎన్ని కుయుక్తులు పన్నినా నిజాన్ని ఎవరూ చంపలేరు. భూమిలో పాతరేశామనుకున్న నిజం మిరుమిట్లు గొలిపే కాంతితో మళ్లీ పుట్టుకొచ్చింది. ఆధారాలతో సహా వచ్చిన అజ్ఞాత వ్యక్తికి అంత బలమిచ్చింది గతంలో ఈ దుర్ఘటనలపై ప్రచురితమైన వార్తలు, ఫొటోలు అన్నది కాదనలేని నిజం.

రోడ్లు, డ్రైనేజీలు సరిగ్గా నిర్మించలేదని ప్రజలు అవస్థలు పడుతున్నారని ఎప్పటికప్పుడు వార్తలు అందిస్తారు మన జర్నలిస్టు మిత్రులు. డోలీ మోతలు, వరదల్లో అవస్థలు, స్కూలు పిల్లల ప్రమాదకర ప్రయాణాలు ఇలా ఎన్నో వార్తలకు బలం చేకూర్చే ఫొటోలు అక్కడి పరిస్థితిని కళ్లకుకట్టినట్లు చూపిస్తాయి. అధికారులను పరుగులు పెట్టిస్తాయి. ఈ ప్రయాణంలో వారికి ఎదురయ్యే ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. ఇటీవల పూణేలో స్నేహ భర్వే అనే యువ జర్నలిస్టు అక్రమ కట్టడాలపై గ్రౌండ్ రిపోర్టు చేస్తుండగానే ఆమెపై గుండాలు కర్రలతో దాడి చేశారు. ఆమె మైక్‌ని విరగ్గొట్టారు. తల నుండి రక్తం కారేలా కొట్టారు. వెన్నుపూసపై పదే పదే కొట్టడంతో ఇంటర్నల్ బ్లీడింగ్, ఫిట్స్ వచ్చి స్నేహ ప్రమాదకర పరిస్థితిలో ఉంది. ఎప్పుడు ఏ వార్త వింటామో అని కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. వెలుగులోకి రాని ఇటువంటి దాడులు కోకొల్లలు. ఈ దాడి తరువాత స్నేహ గొంతు మూయించామని ఆ దుండగులు విర్రవీగినా ఆమె చూపించిన వార్తల్లో నిజం కణకణ మండే నిప్పులా ఎగిసిపడింది. అధికారబలంతో నిందితులు ఇప్పటికీ అరెస్టు కాలేదు. అయినా ప్రజల్లో వారిపై నిరసన పెల్లుబికింది. నిజానికి ఉన్న శక్తి అలాంటిది. వాస్తవాన్ని కళ్లకి కట్టినట్టు చూపించిన ఆ వార్తాకథనాలది. ఫొటోలది.



చాలాకాలం క్రితం ఉత్తరప్రదేశ్ ఉన్నావ్‌లో




అత్యాచారం చేసి అన్యాయంగా మట్టుపెట్టిన బాధితురాలిని, అర్ధరాత్రి మంటల్లో కాల్చేస్తున్న దృశ్యాలని తమ కెమెరాల్లో బంధించి ప్రపంచానికి చూపించారు కొంతమంది జర్నలిస్టులు. నిజాన్ని మంటల్లో బూడిద చేశామని జబ్బలు చరుచుకున్న దుండగులు వెలుగులోకి వచ్చిన ఆ ఫొటోలతో ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. కేసులతో ఉక్కిరిబిక్కిరి అయ్యారు. ప్రతిగా అక్రమ కేసులు బనాయించి జర్నలిస్టులను జైళ్లల్లో పెట్టించినా వారు వెలికితీసిన నిజం మాత్రం ఇప్పటికీ సజీవంగా మండుతూనే ఉంది. కంట్లో నలుసులా పాలకులను ముప్పుతిప్పలు పెడుతూనే ఉంది.

పది రోజుల క్రితం ఉత్తర గాజాలో జర్నలిస్టులపై జరిగిన దాడి కూడా ఇలాంటిదే. మహ్మద్, అనాస్, నౌఫాల్, ఇబ్రహీం, జహీర్ ఆశ్రయం పొందుతున్న శిబిరాన్ని లక్ష్యం చేసుకుని ఇజ్రాయిల్ బాంబు దాడి చేసింది. ఇంతలా వారిపై కక్ష కట్టడానికి కారణం వారు వెలికితీసిన నిజాలు. గాజాపై ఇజ్రాయిల్ దాడులకు తెగబడినప్పటి నుండి అనాస్ అక్కడే ఉండి రిపోర్టింగ్ చేస్తున్నాడు. దాడుల్లో తన తండ్రిని, సోదరుడిని కోల్పోయాడు. అయినా వెనుదిరగలేదు. పాలస్తీనా ప్రజలు పడుతున్న బాధలను తన కెమెరా కంటితో ప్రపంచానికి చూపించాడు. వారి కథలను జనంలోకి తీసుకెళ్లాడు. ఇప్పటివరకు జరిగిన దాడుల్లో గాజాలో సుమారు 270 మంది జర్నలిస్టులు హత్య చేయబడ్డారంటేనే వారు బహిర్గతం చేసిన నిజాలు ఎంత ప్రభావం చూపించాయో అర్థమవుతుంది. వారు మరణించినా వారు చూపించిన నిజాలు మాత్రం ఎప్పటికీ సజీవంగా ఉంటాయి. మరణం వారికి మాత్రమే.. వారు అందించిన వార్తలు, చూపించిన ఫొటోలు ప్రపంచం ఉన్నంతకాలం జీవించే ఉంటాయి.

మెట్టు దిగని నిర్మాతలు

ఒప్పందం అమలునే కోరుతున్న కార్మికులు





తెలుగు చిత్ర పరిశ్రమ (టిఎఫ్ఐ)లో వేతన అగ్రిమెంట్ కోసం గత 15 రోజులుగా ఫెడరేషన్ ఇచ్చిన పిలుపుమేరకు కార్మికులు ఆందోళనలు కొనసాగిస్తున్నారు. 30 శాతం పెంపుదల సాధ్యం కాదని నిర్మాతల మండలి ప్రతినిధులు పలు దఫాలుగా జరిగిన చర్చల్లో స్పష్టం చేశారు. సీనియర్ నటుడు చిరంజీవితో నిర్మాతల మండలి, ఫెడరేషన్ ప్రతినిధులు ఇప్పటికే పలు దఫాలుగా చర్చలు జరిపారు. ఆదివారం చిన్న నిర్మాతలు కలిసి తమ సమస్యలను చిరంజీవికి వివరించారు. సోమవారంనాడు సాయంత్రం 4 గంటల తర్వాత ఫెడరేషన్ నేతలు కూడా జూబ్లీహిల్స్‌లోని చిరు నివాసంలో ప్రత్యేకంగా సమావేశమై చర్చించారు. 'నిర్మాతలు, చిన్న నిర్మాతలతో కూడా మాట్లాడాను. ఇప్పుడు మీతో కూడా మాట్లాడాను. ఉభయులకు ఆమోదయోగ్యంగా నిర్ణయాలు తీసుకుందాం. తొందర పడకండి. అందరికీ న్యాయం జరిగేలా కృషిచేస్తా' నంటూ చిరంజీవి హామీ ఇచ్చారు. సోమవారం రాత్రిలోగా డిమాండ్ల పరిష్కారం కాకపోతే మంగళవారం సమావేశమై తమ నిర్ణయాన్ని వెల్లడిస్తామని ఫెడరేషన్ నాయకులు స్పష్టంచేశారు.

సంక్షోభంలో ఉన్నాం : నిర్మాతలు

'కరోనా తర్వాత ప్రపంచ వ్యాప్తంగా చూస్తే ఏ రంగమూ పురోగతిలో లేదు. ఇప్పటికే రియల్ ఎస్టేట్ రెండు తెలుగు రాష్ట్రాల్లో కుదేలయ్యింది. 30 శాతం రేట్లు తగ్గించి క్రయవిక్రయాలు జరుగుతున్నాయి. సాఫ్ట్‌వేర్‌రంగంలో 50 శాతం లేఆఫ్‌లు ఉంటున్నాయి. జీతాలు తగ్గించేశారు. భవిష్యత్తులోనైనా మళ్లీ పుంజుకుంటే పెరుగుతాయనే ఆలోచనలు ఉద్యోగులు పనిచేస్తున్నారు. సినీరంగం కూడా అలాగే ఉంది. టాలీవుడ్, బాలీవుడ్, హాలీవుడ్‌లోనూ ఇదే తరహా పరిణామాలున్నాయి. కరోనా మిగిల్చిన గాయం నుంచి సినిమా పరిశ్రమ ఇంకా కోలుకోలేదు. ప్రేక్షకులు థియేటర్లకు రావటం లేదు. ఓటీటీ సంస్థలు అగ్రిమెంట్ అయ్యాక నాలుగు నెలలకు పేమెంట్లు ఇస్తున్నాయి. అదీ ఆదరణ ఉంటేనే. లేకపోతే తగ్గించి ఇస్తున్నాయి. మేమంతా గతంలో వివిధ రంగాల్లో నిష్ణాతులుగా ఉన్నవాళ్లమే. ఏదో వినోద పరిశ్రమపై ఫ్యాషనేట్‌తో ఇందులోకి వచ్చాం. రూ.కోటితో సినిమా తీద్దామనుకుంటే రూ.8 నుంచి రూ.9 కోట్లు వరకూ వ్యయం అవుతోంది. రూ.10 కోట్లు అనుకుంటే రూ.20 కోట్లు అవుతోంది. చిన్నా, పెద్దా అనే బేధం లేకుండా ఏ సినిమాకైనా బడ్జెట్ డబుల్ అయ్యింది. కనీసం పెట్టిన పెట్టుబడులు కూడా రాకపోతే మేము సినిమాలెందుకు తీయాలి? నష్టపోవటానికి కాదు కదా, మేము ఇక్కడికి వచ్చింది.

ఇప్పుడున్న పరిస్థితుల్లో 30 శాతం పెంపుదల కాదు; ఇప్పుడిచ్చే వేతనాల్లో కోత విధిస్తే తప్ప సంక్షోభం నుంచి బయటపడలేము.' అంటూ కొందరు నిర్మాతలు పాత్రికేయ సమావేశాల్లో ప్రస్తావించారు.

మావి గొంతెమ్మ కోర్కెలు కాదు : కార్మికులు

'తెలుగు సినిమా పరిశ్రమ ఈరోజుది కాదు. గత కొన్ని దశాబ్దాలుగా కొనసాగుతున్న అగ్రిమెంట్‌నే అమలు చేయాలని కోరుతున్నాం. మూడేళ్లకు ఓసారి వేతనాల పెంపుదల గతంలో నిర్మాతల మండలి, ఫిలిం వర్కర్స్ ఫెడరేషన్ మధ్య జరిగిన ఒప్పందంలో భాగమే. గతంలో చేసుకున్న ఒప్పందం ముగిసింది. తాజా ఒప్పందం జులై ఒకటోతేదీ నుంచి అమలు కావాల్సివుంది. మేము నెలలు తరబడి గుర్తుచేస్తూనే ఉన్నాం. నిర్మాతలు పెడ చెవిన పెట్టారు. నిర్మాతలు వారి సినిమాలకు బడ్జెట్లు పెరిగిన మాట నిజమే. కానీ గడిచిన మూడేళ్లనే పరిగణనలోకి తీసుకుందాం. ఇంటి అద్దెలు రెట్టింపు అయ్యాయి. జీవన వ్యయం అనూహ్యంగా పెరిగింది. నిత్యావసర వస్తువులు, కూరగాయలు, దుస్తులు, పిల్లల చదువులు ఇలా చెప్పుకుంటే ఒకటేమిటి.. అన్ని వస్తువుల ధరలు పెరిగాయా? లేదా? మేము అడుగుతున్నది కొత్తవి కాదు.. గతంలో చేసుకున్న ఒప్పందం ప్రకారం 2022 నుంచి 2025 వరకూ 10 శాతం చొప్పున 30 శాతం పెంపుదల కోరుతున్నాం. నిర్మాతల షరతులు చాలా ప్రమాదకరంగా ఉన్నాయి. ఉదయం 9 రాత్రి 9 గంటల వరకు కాల్ షీట్‌ను 12 గంటల రెగ్యులర్ కాల్‌షీట్‌గా పరిగణించాలని అడుగుతున్నారు. ఇది ఏమాత్రం సహేతుకం కాదు. రెండో ఆదివారం, కార్మికశాఖ ప్రకటించిన సెలవుదినాల్లో మాత్రమే రెట్టింపు వేతనం చెల్లిస్తామంటున్నారు. మిగతా ఆదివారాల సంగతి ఏమిటి? డబుల్ పేమెంట్ వస్తుందనేగా మేము విధులకు హాజరయ్యేది. లేకపోతే ఇంట్లో ఉండి కుటుంబాలతో హ్యాపీగా ఉంటాం కదా..01-07-2022 ఒప్పందం ప్రకారం, ఫైటర్స్, డాన్సర్స్ కోసం రేషియోలను 01-09-2023 నుండి అమలు చేయటం లేదని అంటున్నారు. మేము రేషియో ప్రకారమే పంపుతున్నాం. కార్మికులను అమాంతంగా తగ్గిచ్చేస్తామంటే ఎలా?. అగ్రిమెంట్ ఉంది కదా... 01-07-2022 ఒప్పందంలోని జనరల్ కండిషన్స్ క్లాజ్ 1 అమలు అంటే నిర్మాతకు తన ఇష్టం ప్రకారం ఏ నైపుణ్యంలోనైనా ఏ వ్యక్తినైనా నియమించుకోవడానికి స్వేచ్ఛ కలిగి ఉంది. దానికి మాకు ఏ విధమైన అభ్యంతరం లేదు. రోజుకు రూ.2000, అంతకంటే తక్కువ సంపాదించే కార్మికుల వేతనాలను నిర్మాతలు వెంటనే 10 శాతం పెంచడానికి, రెండో సంవత్సరం 5 శాతం, మూడో సంవత్సరం మరో 5శాతం పెంచడానికి ప్రతిపాదించారు. రోజుకు రూ.2000 కంటే ఎక్కువ, రూ.5000 కంటే తక్కువ సంపాదించే కార్మికులకు వచ్చే వరుసగా మూడు సంవత్సరాల పాటు ప్రతి సంవత్సరం 5 శాతం పెంచుతామని ప్రతిపాదన ఉంచారు. కానీ చిన్న సినిమాల నిర్మాతలకు ఈ పెంపు వర్తించబోదని మెలికపెట్టారు.

'చిన్న బడ్జెట్' అంటే ఎంత, చిన్న నిర్మాత అంటే ఎన్ని కోట్లు పెట్టి సినిమా తీసే వారనే విషయాన్ని స్పష్టం చేయలేదు. తర్వాత చాంబర్‌లో నిర్ణయం తీసుకుంటామన్నారు. ఇలా అసంబద్ధమైన వాదనలు మా ముందు పెట్టారు.. ఇది న్యాయమా? అసంఘటిత రంగంలో పనిచేసే కార్మికులు వీరంతా. పెరిగిన ధరలకు అనుగుణంగానే మేము వేతనాలు పెంచాలని కోరుతున్నాం. ఇవేవి గొంతెమ్మ కోర్కెలు కాదు. మేము షూటింగ్‌లు జరుపుకోవటానికి వ్యతిరేకం కాదు. అది మీకూ తెలుసు. 30 శాతం అగ్రిమెంట్ అయిన సినిమా షూటింగ్‌లు కొనసాగుతున్నాయి కదా.. మొత్తంగా ఇరువురం ఒక అంగీకారానికి వచ్చి 'కార్మికుల వేతనాల సమస్య' పరిష్కారానికి చొరవ చూపాలని కోరుతున్నాం. నియంతృత్వ పోకడలకు పోతే నిరవధిక బంద్‌కు వెళ్ళటానికి ఏ మాత్రం వెనకాడేది లేదు.. అలాగే మంగళవారం ఉదయం పది గంటలకు అన్నపూర్ణ స్టూడియోస్ రోడ్డులో 24 కార్మిక సంఘాల సమావేశం ఏర్పాటు చేశాము' అని ఫెడరేషన్ నేతలు తెలిపారు.

సూర్యకుమార్, బుమ్రా పక్కా

- గిల్, జైస్వాల్‌కు కష్టమే...
- నేడు ఆసియా కప్‌కు జట్టు ప్రకటించే అవకాశం



ముంబయి: ఆసియా కప్ 2025కు ఒక్కో దేశం తమ బలమైన జట్లను ప్రకటిస్తుండగా.. టీమిండియా జట్టును భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు(బిసిసిఐ) ఇప్పటివరకు ప్రకటించలేదు. ఒకవైపు అన్ని బోర్డులు తమ బలమైన జట్లను ఎంపిక చేసుకోవడంలో బిజీగా ఉండగా.. మరోవైపు భారత జట్టును ఎంపిక చేయడంలో బిసిసిఐ కూడా బిజీగా ఉన్నట్లు సమాచారం. సెప్టెంబర్ 9 నుంచి యుఎఇలో ప్రారంభమయ్యే ఆసియా కప్ 2025 టి20 ఫార్మాట్‌లో జరగనుంది. ఈ క్రమంలో 15 మంది సభ్యుల జట్టును ఖరారు చేయడానికి అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ ముంబయిలోని బిసిసిఐ ప్రధాన కార్యాలయంలో సమావేశం కానుంది. టి20 జట్టుకే ఫిక్స్ అవుతారా? లేదా? అనే దానిపై అందరి దృష్టి నెలకొంది. మరోవైపు జట్టు ప్రకటన కోసం విలేకరుల సమావేశం నిర్వహించాలా? వద్దా? అనే దానిపై బిసిసిఐ మల్లగుల్లాలు పడుతోంది. ఈ క్రమంలో జట్టు ప్రకటన కోసం విలేకరుల సమావేశం ఉండదని, జట్టు జాబితాను అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో విడుదల చేయనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం భారత్-పాక్ వివాదం మధ్య విలేకర్ల నుంచి దాయాది మ్యాచ్ రద్దు ప్రశ్నలు వచ్చే అవకాశం ఉందని, అందుకే ముందు జాగ్రత్త చర్యగా ఇలాంటి నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

గిల్ స్థానాన్ని భర్తీ చేయడం కష్టమే...

మరోవైపు జట్టు ఎంపికపై సుదీర్ఘ చర్చలు జరుగుతున్నాయి. స్టార్ ఫాస్ట్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా ఈ టోర్నమెంట్‌కు అందుబాటులో ఉంటాడని, 31ఏళ్ల బుమ్రా ఇటీవల ఇంగ్లాండ్‌తో జరిగిన టెస్ట్ సిరీస్‌లో మూడు మ్యాచ్‌ల్లో 14 వికెట్లు పడగొట్టడంతో అతడిని తుదిజట్టులో ఎంపిక చేసే ఛాన్స్ ఉంది. మరోవైపు భారత టెస్ట్ కెప్టెన్ శుభ్‌మాన్ గిల్ జట్టులో స్థానం కష్టంగా కనిపిస్తోంది. గిల్ ప్రస్తుత టి20 వ్యూహానికి సరిపోలేదని సెలెక్టర్లు విశ్వసిస్తున్నారు. 2024 టి20 ప్రపంచ కప్ నుంచి జట్టులో భాగమైన ఆటగాళ్లను జట్టులో ఉంచాలని వారు కోరుకుంటున్నారు. ఈ క్రమంలో సూర్యకుమార్ యాదవ్, బుమ్రా, హార్దిక్, అక్షర్, అర్ష్‌దీప్ పేర్లు ఖాయమైనట్లు సమాచారం.

పాకిస్తాన్ వైదొలిగితే...

ఆసియాకప్‌ను పాకిస్తాన్ జట్టు బాయ్‌కాట్ చేయాలనే ఉద్దేశ్యంతో ఉన్నట్లు సమాచారం. భారత్, పాకిస్తాన్ జట్లు ఒకే గ్రూప్‌లో ఉన్న క్రమంలో పాకిస్తాన్ క్రికెట్‌బోర్డు(పిసిబి) అభ్యంతరం తెలపకపోవడంపై సోషల్‌మీడియాలో ప్రధాన చర్చ జరుగుతోంది. ఆసియాకప్‌లో ఒకే గ్రూప్‌లో ఈ రెండు జట్లు టైటిల్‌పోరుతో కలిపి మూడుసార్లు తలపడాల్సి ఉంటుంది. ఈ క్రమంలో పాకిస్తాన్ క్రికెట్‌బోర్డు ఎందుకు విముఖత వ్యక్తం చేయలేదని దుమారం లేస్తోంది. టోర్నీ ఆతిథ్య హక్కులను లాగేసుకోవడం, యుఎఇలో జరిగే టోర్నీకి భారత్ ఆతిథ్యం ఇవ్వడం పాక్ అభిమానులను మరింత ఆజ్యం పోసేలా చేసింది. ఈ క్రమంలో పాకిస్తాన్ టోర్నీని బాయ్‌కాట్ చేస్తే బిసిసిఐ భారీగా నష్టపోవడం ఖాయం. అదే జరిగితే ఆ నష్టాన్ని ఎలా భర్తీ చేయాలనే ఆలోచనలో బిసిసిఐ ఉంది.

సర్ఫరాజ్ మెరుపు సెంచరీ

బుచ్చిబాబు టోర్నీ



ముంబయి: ముంబయి స్టార్ ప్లేయర్ సర్ఫరాజ్ ఖాన్ బుచ్చిబాబు క్రికెట్ టోర్నీలో మెరుపు శతకంతో మెరిసాడు. టిఎన్‌సిఎ ఎలెవెన్‌తో సోమవారం జరిగిన మ్యాచ్‌లో సర్ఫరాజ్ 114 బంతుల్లో 138 పరుగులు చేసి రిటైర్డ్ హర్ట్‌గా పెవిలియన్‌కు చేరాడు. ఐదో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చి కేవలం 92 బంతుల్లో సెంచరీ పూర్తి చేశాడు. ఆకాశ్ పార్కర్‌తో కలిసి ఆరో వికెట్‌కు 100 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. ఆ తర్వాత తొడ కండరాలు పట్టేయడంతో మైదానాన్ని వీడాడు. దీంతో తొలిరోజు ఆట ముగిసే సమయానికి ముంబయి జట్టు 5వికెట్ల నష్టానికి 367 పరుగులు చేసింది. ఆకాశ్ పార్కర్(67) క్రీజ్‌లో ఉన్నాడు. టిఎన్‌సిఎ ఎలెవెన్ బౌలర్ ఎం. సిద్ధార్థ్(2/124) బౌలింగ్‌లో రాణించాడు.

పంజాబ్‌తో తలపడుతున్న హైదరాబాద్ జట్టు తొలిరోజు రాణించింది. దీంతో తొలిరోజు పంజాబ్ జట్టు 4వికెట్లు నష్టపోయి 187 పరుగులే చేసింది. ప్రభ్‌సిమ్రన్(69) బ్యాటింగ్‌లో రాణించగా.. హైదరాబాద్ బౌలర్ అంకిత్ రెడ్డ(2/47) బౌలింగ్‌లో మెరిసాడు. మరో మ్యాచ్‌లో మహారాష్ట్ర స్పిన్నర్లు విక్కీ వోట్సల్, హితేశ్ వలుంజ్ సమిష్టిగా రాణించడంతో ఒడిషా జట్టు 252పరుగులకే ఆలౌటైంది. సంజీత్ దేశాయ్(93) మినహా ఏ ఒక్క బ్యాటరూ రాణించలేదు. మహారాష్ట్ర బౌలర్లు విక్కీ(3/57) బౌలింగ్‌లో రాణించాడు.

గ్రూప్‌లు: (ఎ) టిఎన్‌సిఎ ప్రెసిడెంట్స్ ఎలెవెన్, హిమాచల్‌ప్రదేశ్, ఛత్తీస్‌గడ్, మహారాష్ట్ర (బి) రైల్వేస్, జమ్ము-కాశ్మీర్, బరోడా, ఒడిషా (సి) టిఎన్‌సిఎ ఎలెవెన్, ముంబయి, హర్యానా, బెంగాల్.



సెమీస్‌కు ఈస్ట్‌బెంగాల్

డ్యురండ్ కప్

కోల్‌కతా: డ్యురండ్ కప్-2025లో ఈస్ట్‌బెంగాల్ జట్టు సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. ఆదివారం రాత్రి జరిగిన క్వార్టర్‌ఫైనల్లో ఈస్ట్‌బెంగాల్ జట్టు 2-1గోల్స్ తేడాతో మోహన్ బగాన్ సూపర్ జెయింట్స్‌ను చిత్తుచేసింది. కోల్‌కతాలోని సాల్ట్‌లేక్ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్ చివరి వరకు హోరాహోరీగా సాగింది. డైమండ్ హార్బర్ ఎఫ్‌సి, జంషెడ్ పూర్ ఎఫ్‌సిల మధ్య జరిగే మూడో క్వార్టర్‌ఫైనల్ విజేతతో ఈస్ట్‌బెంగాల్ జట్టు బుధవారం జరిగే రెండో సెమీస్‌లో తలపడనుంది. 38వ ని.లో హమీద్ అహదద్ గాయపడడంతో ప్రత్యామ్నాయంగా వచ్చిన డిమిట్రియోస్ పెనాల్టీని గోల్‌గా మలచడంతో ఈస్ట్‌బెంగాల్ 1-0 ఆధిక్యత సంపాదించింది. ఆ తర్వాత 52వ ని.లో ఈస్ట్‌బెంగాల్ మరో గోల్ కొట్టి 2-0 ఆధిక్యతలోకి దూసుకెళ్లింది. మోహన్ బగాన్ తరఫున ఏకైక గోల్‌ను 68వ ని.లో అనిరుధ్ థాపా చేశాడు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68